ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
గురువారం 12 డిసెంబరు 2024



గుర్రాల పార్కుపై గరం గరం

ముందస్తు ఆమోదం ఎలా ఇచ్చారని మేయర్‌ను నిలదీసిన కూటమి కార్పొరేటర్లు


కౌన్సిల్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పంచకర్ల రమేశ్‌బాబు


మాట్లాడుతున్న మేయర్ హరివెంకట కుమారి

- అది గుర్రాల పార్కు అని తనకు తెలియదన్న మేయర్
- నాటి కమిషనర్ సంతకం చేయమంటే చేసినట్టు ప్రకటన
- మేయర్ రాజీనామాకు కార్పొరేటర్ కంపా హనోక్ డిమాండ్
- కార్పొరేటర్లపై అనేక ఫిర్యాదులు తన వద్ద ఉన్నాయన్న హరివెంకటకుమారి
- దమ్ముంటే వాటిని బయటపెట్టి విచారణ జరపాలని టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు సవాల్
- కౌన్సిల్ ఆమోదం తీసుకోకుండా ప్రాజెక్టు ప్రారంభించడం తప్పేనని అంగీకరించిన చీఫ్ ఇంజనీర్ శివప్రసాదరాజు

విశాఖపట్నం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం బుధవారం వాడీవేడిగా జరిగింది. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సమావేశం రాత్రి తొమ్మిది గంటల వరకూ కొనసాగింది. ముడసర్లోవ పార్కులో రూ.ఆరు కోట్ల వ్యయంతో హార్స్ రైడింగ్ ప్రాజెక్టుకు మేయర్ గొలగాని హరివెంకటకుమారి ఈ ఏడాది జనవరిలో ముందస్తు ఆమోదం తెలిపారు. అధికారులు టెండర్లు పిలవగా ప్రభు అసోసియేట్స్ అనే సంస్థ మాత్రమే పాల్గొన్నప్పటికీ...అప్పటి అధికారులు దానికి ప్రాజెక్టును కట్టబెటారు. ఆ సంస్థ పనులు ప్రారంభించడంతో నగరానికి చెందిన కొందరు అభ్యంతరం వ్యక్తంచేశారు. దీంతో పనులు నిలిపివేశారు. ఇదిలావుండగా మేయర్ ఇచ్చిన ముందస్తు ఆమోదానికి ర్యాటిఫికేషన్ కోరుతూ ఆ అంశాన్ని బుధవారం నాటి కౌన్సిల్ ఎజెండాలో చేర్చారు. దీనిపై జనసేనకు చెందిన 22వ వార్డు కార్పొరేటర్ మూర్తియాదవ్ మాట్లాడుతూ గుర్రాల పార్కును ముడసర్లోవలో ఏర్పాటుచేయడం నిబంధనలకు విరుద్ధమని, తక్షణం ఆ ప్రాజెక్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీకి చెందిన 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ నగరంలో ఇప్పటికే రైల్వే మైదానంలో ఒకరు హార్స్ రైడింగ్ శిక్షణ ఇస్తున్నారని, దానికి స్పందన లేదని నిర్వాహకులు గగ్గోలు పెడుతుంటే, రూ.ఆరు కోట్లు వెచ్చించి గుర్రాలను కొని, మేపడం వల్ల జీవీఎంసీకి భారమే తప్ప ప్రజలకు ఉపయోగం

... మిగతా 6వ పేజీలో

స్టాండింగ్ కౌన్సెల్ కొనసాగింపునకు నో

క్రీడా ప్రాంగణాల నిర్వహణపై కార్యాచరణకు కమిటీ ఏర్పాటు

- టీడీఆర్‌కు బదులుగా నగదు ఇచ్చే ప్రతిపాదనపై అభ్యంతరం
- అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వివరాలు కార్పొరేటర్లకు ఇవ్వాలని తీర్మానం
- సుదీర్ఘంగా సాగిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం
- 61 అంశాలకు ఆమోదం

విశాఖపట్నం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం బుధవారం సుదీర్ఘంగా సాగింది. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో ప్రధాన ఎజెండాలోని 46 అంశాలు, అనుబంధ ఎజెండాలోని 21 అంశాలపై చర్చ జరిగింది. అయితే 61 అంశాలను ఆమోదించిన కౌన్సిల్ నాలుగింటిని తిరస్కరించింది. మరో రెండు అంశాలను వాయిదా వేసింది.

జీవీఎంసీకి న్యాయపరమైన సహాయ సహకారాలు అందించేందుకు జోన్‌కు ఒకరు చొప్పున ఎనిమిది మంది స్టాండింగ్ కౌన్సెల్ ఉన్నారు. వారికి మరో ఏడాది పొడిగింపు ఇచ్చే ప్రతిపాదనను సభ్యులంతా మూకుమ్మడిగా వ్యతిరేకించారు. కోర్టుల్లో కనీసం కౌంటర్ కూడా దాఖలు చేయడం లేదని, వారిని తొలగించి కొత్తవారిని నియమించాలని కార్పొరేటర్లు పీవీ సురేష్, మూర్తియాదవ్, కాకి గోవిందరెడ్డి, లేళ్ల కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. దీనికి వైసీపీ కార్పొరేటర్లు కూడా మద్దతు తెలపడంతో 'ఏడాది పొడిగింపు' అంశాన్ని మేయర్ తిరస్కరిస్తూ, కొత్తగా నోటిఫికేషన్ జారీచేయాలని తీర్మానం చేశారు.

నీటి సరఫరా విభాగంలో టెక్నికల్ విధులు నిర్వహిస్తున్న అన్ స్కిల్డ్ వర్కర్లు 169 మందికి సెమీస్కిల్డ్ కేటగిరీ జీతాలు వర్తింపజేసే అంశంపై 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు అభ్యంతరం వ్యక్తంచేశారు. కౌన్సిల్ ఏర్పడిన తర్వాత వైసీపీ నేతలు కొందరు నుంచి రూ.పది లక్షలు

... మిగతా 6వ పేజీలో

వెనుకబడి!

జిల్లాలో ఫైవ్ స్టార్ రేటింగ్ కలిగిన ప్రభుత్వ పాఠశాల ఒక్కటీ లేదు


3 స్టార్ రేటింగ్ వచ్చిన ములగాడ ప్రాథమిక పాఠశాల

- కనీసం ఫోర్ స్టార్ కూడా దక్కలేదు!
- మౌలిక సదుపాయాలు, టీచర్లు కొరత, ఆంగ్ల మాధ్యమంపై అవగాహన లేమి కారణమంటున్న ఉపాధ్యాయులు
- జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు మొత్తం 595
- 52 పాఠశాలలకు 3-స్టార్ రేటింగ్
- 338 పాఠశాలలకు 2 స్టార్
- 203 పాఠశాలలకు 1 స్టార్...
- రెండింటికి 0
- 2023-24 విద్యా సంవత్సరం యూడైస్ ఆధారంగా రేటింగ్స్

విశాఖపట్నం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి):

తమ పాలనలో ప్రభుత్వ బడులను ఉద్ధరించామంటూ గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి, అప్పటి మంత్రులు గొప్పలు చెప్పుకున్నారు. కానీ, అందులో ఏమాత్రం వాస్తవం లేదని తాజాగా పాఠశాలలకు ప్రకటించిన రేటింగ్ చూస్తే అర్థమవుతోంది. నాడు-నేడు కింద చేపట్టిన పనులు సగంలో నిలిచిపోవడం, ఉపాధ్యాయుల కొరత, ఆంగ్ల మాధ్యమంలో బోధనతో విద్యార్థుల్లో గందరగోళం వంటి అంశాలు రేటింగ్ రాకపోవడానికి కారణంగా ఉపాధ్యాయ వర్గాలు పేర్కొంటున్నాయి.

2023-24 విద్యా సంవత్సరంలో యూడైస్ వివరాలను ప్రాతిపదికగా చేసుకుని కూటమి ప్రభుత్వం ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల స్థితిగతులు...ప్రధానంగా మౌలిక వసతులు, అభ్యసన ఫలితాలను అనుసరించి రేటింగ్ ఇచ్చింది. తాజాగా విడుదల చేసిన రేటింగ్‌లో విశాఖ జిల్లాలో ఉన్న 595 ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్క పాఠశాలకు కూడా 4, 5 స్టార్ రేటింగ్ దక్కలేదు. 52 పాఠశాలలకు 3 స్టార్, 338 పాఠశాలలకు 2 స్టార్, 203 పాఠశాలలకు 1 స్టార్ రేటింగ్ దక్కగా, రెండు పాఠశాలలకు జీరో రేటింగ్ వచ్చింది.

స్టార్ రేటింగ్ కేటాయింపు ఇలా..

మౌలిక సదుపాయాల విభాగంలో రేటింగ్‌కు 18 అంశాలను ప్రామాణికంగా తీసుకున్నారు. బడిలో మరుగుదొడ్లు, ప్రయోగశాలలు, క్రీడా మైదానాలు, ప్రహరీ, లైబ్రరీ, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్, తరగతి గదులు, తాగునీరు వంటి అంశాలను పరిశీలించారు. ఒక్కొక్క అంశానికి ఐదు మార్కులు వంతున ఇచ్చారు. అభ్యాసన ఫలితాల విభాగంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరు, పదో తరగతి ఫలితాలు, పాఠశాలలో నిర్వహించిన అసెస్‌మెంట్ పరీక్షల ఫలితాలను ప్రాతిపదికగా తీసుకున్నారు. హాజరుకు 40 శాతం, ఫలితాలకు 60 శాతం వెయిటేజీ ఇచ్చారు. టీచర్ల హాజరుశాతం 80 దాటితేనే మంచి రేటింగ్ ఇచ్చారు.

విశాఖ జిల్లాలో గత పాలకులు నాడు-నేడు కింద తొలి దశలో 150 పాఠశాలలకు నిధులు కేటాయించినా అదనపు తరగతి గదులు నిర్మించలేదు. రెండో దశలో 130 పాఠశాలలకు పనులు మంజూరుచేసినా నిధులు సమస్య వెంటాడింది. రెండో దశ పనులు 2022-23లోనే మధ్యలో నిలిచిపోయాయి. జిల్లాలో సబ్జెక్టు టీచర్ల కొరత రెండు, మూడేళ్ల నుంచి ఉంది. ఇంకా ఆంగ్ల మాధ్యమంలో బోధనను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అవగాహన చేసుకోవడంలో

... మిగతా 6వ పేజీలో


అమరావతిలోని సచివాలయంలో బుధవారం సీఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన జిల్లా కలెక్టర్ల రెండు రోజుల సదస్సుకు హాజరైన కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

ప్లాస్టిక్ వ్యర్థాలతో రహదారుల నిర్మాణం

వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

- 8 శాతం వరకూ ఖర్చు ఆదా...
- జీవితకాలం ఐదేళ్లు అధికం



విశాఖపట్నం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఇకపై రహదారులన్నీ ప్లాస్టిక్ వ్యర్థాలతో నిర్మించనున్నామని విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) కమిషనర్ విశ్వనాథన్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వంతో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. జీవీఎంసీ పరిధిలో రహదారులు కూడా ప్లాస్టిక్ వ్యర్థాలతోనే నిర్మిస్తారన్నారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభమయ్యేలోపు జాతీయ రహదారిని కలుపుతూ 15 లింక్ రహదారులు నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారని చెప్పారు. అందులో కొన్ని వీఎంఆర్‌డీఏ పరిధిలో, మరికొన్ని రహదారులు, భవనాల శాఖ పరిధిలో, ఇంకొన్ని పంచాయతీరాజ్, జీవీఎంసీల పరిధిలో ఉన్నాయన్నారు. ఎవరి ఆధీనంలో ఉన్న రహదారులలైనా సరే వాటిని ప్లాస్టిక్ వ్యర్థాలతో నిర్మించాలనేది ప్రభుత్వ ఆదేశమన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో రహదారులు అంటే పూర్తిగా ప్లాస్టిక్‌ను ఉపయోగించరు. రీసైక్లింగ్ కాని ప్లాస్టిక్ వ్యర్థాలను దీనికోసం ఉపయోగిస్తారు. బ్లాకులుగా మార్చి, చిన్న చిన్న ముక్కలు చేస్తారు. వాటిని తారు, కంకరుతో పాటు మిక్సింగ్ యంత్రంలో వేస్తారు. మొత్తం మిక్సింగ్‌లో ప్లాస్టిక్ ఎనిమిది శాతం వరకూ ఉంటుంది. ఆ మేరకు వ్యయం తగ్గుతుంది. దీని వల్ల ఇంకో ప్రయోజనం ఏమిటంటే...సాధారణ తారురోడ్డు జీవిత కాలం నాలుగేళ్లు మాత్రమే. ప్లాస్టిక్‌ను కలపవడం వల్ల అది మరో ఐదేళ్లు పెరుగుతుంది. మామూలుగా అయితే వర్షాలు కురిసినప్పుడు రోడ్డులోకి నీరు దిగి త్వరగా పాడైపోతుంది. అదే ప్లాస్టిక్ కలిపిన రహదారి అయితే నీటిని కిందకు దిగనివ్వదు. దీనివల్ల ఆ రోడ్డు జీవితకాలం పెరుగుతుంది. రీసైక్లింగ్ కాని వ్యర్థాలను ఉపయోగించుకోవడం వల్ల అవి భూమిలో చేరకుండా నిరోధించి, పర్యావరణాన్ని కాపాడినట్టు అవుతుందని కమిషనర్ విశ్వనాథన్ వివరించారు. అడవివరం నుంచి శొంఠ్యాం మీదుగా ఆనందపురం వద్ద జాతీయ రహదారిని కలుపుతూ వేసే మార్గంలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఉపయోగిస్తామని తెలిపారు.

2 నుంచి పలు రైళ్లు రద్దు

....వివరాలు 8వ పేజీలో

మార్గశిర ఉత్సవాల్లో పోలీస్ పెత్తనం

కనకమహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో మహిళా పోలీసుల హవా

- వీఐపీ మార్గంలో అడ్డగోలుగా దర్శనాలు
- దర్శనానికి ప్రవేశం, నిష్క్రమణ అన్నీ ఒక వైపే
- అమలు కాని కలెక్టర్ సమావేశ తీర్మానాలు


అమ్మవారి సన్నిధిలో మహిళా పోలీసుల హడావుడి

విశాఖపట్నం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాల్లో పోలీసుల పెత్తనమే అధికంగా కనిపిస్తోంది. ఎన్నడూ లేనిది ఈసారి సాధారణ రోజుల్లో 200 మంది, గురువారం 600 మంది బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఆలయ పరిసరాల్లో భక్తుల కంటే పోలీసుల సంఖ్యే ఎక్కువగా ఉందనే విమర్శలు వస్తున్నాయి. ఇలాంటి ఉత్సవాల్లో స్థానిక రాజకీయ నాయకులు ప్రచారం కోసం ఫ్లెక్సీలు వేయించుకుంటారు. కానీ ఇక్కడ ప్రధాన ద్వారం వద్ద పోలీసు ఉన్నతాధికారుల ఫొటోలతో పెద్ద ఫ్లెక్సీ ఏర్పాటుచేయడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు కాబట్టి గురువారం బందోబస్తు అవసరమే. కానీ పోలీస్ పెద్దలంతా ప్రధాన ప్రవేశ ద్వారాల వద్దే ఉంటున్నారు. వీఐపీ మార్గం గేటుకు తాళం వేసి వారి దగ్గరే ఉంచుకుంటున్నారు. వారి బంధువులు, మిత్రులు వచ్చినప్పుడు తాళాలు తీసి పదుల సంఖ్యలో పంపుతున్నారు. అక్కడ మీకు సంబంధించినవారు పది మంది అయితే, మాకు సంబంధించినవారు ఐదుగురు అంటూ దేవదాయ శాఖ సిబ్బంది కూడా పోలీసులతో కుమ్మక్కై, అడ్డగోలుగా బంధువులను లోపలకు పంపుతున్నారు.

అమ్మవారి సన్నిధిలో పోలీసులు!

ఏ ఆలయంలోనైనా పోలీసులు బయటే ఉండే బందోబస్తు నిర్వహించాలి. ఇక్కడ అందుకు భిన్నంగా ఆలయం లోపల ఎక్కువ మంది ఉంటున్నారు. అమ్మవారికి నేరుగా భక్తులు అభిషేకం చేసి, పసుపు, కుంకుమ, చీరలు సమర్పించడం ఆనవాయితీ. కానీ మహిళా పోలీసులే భక్తుల చేతిలో చీరలు

... మిగతా 6వ పేజీలో

విశాఖలో గూగుల్ డేటా సెంటర్

- 6న ఇక్కడే ఒప్పందం... రహస్యంగా ఉంచిన ప్రభుత్వం
- రెండు దశాబ్దాల క్రితమే విశాఖ కంపెనీతో టైఅప్

ప్రపంచంలోనే అతి పెద్ద ఐటీ కంపెనీ గూగుల్ విశాఖపట్నంలో డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకువచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది.

...వివరాలు మెయిన్ 13లో

అభివృద్ధి పనులకు అధికారుల మోకాలడ్డు

జడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో ఎలమంచిలి నియోజకవర్గానికి చెందిన సభ్యుల ఆరోపణ

- కొంతమంది ఎమ్మెల్యేలు సహకరించడం లేదన్న చైర్‌పర్సన్
- ఈ పరిస్థితిలో మార్పు రాకపోతే వచ్చే జనరల్ బాడీ సమావేశాన్ని బహిష్కరిస్తామని హెచ్చరిక
- మండలాల్లో సదరం మెగా క్యాంపుల నిర్వహణకు ప్రభుత్వం అనుమతి
- పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్వహణపై చైర్‌పర్సన్ అసంతృప్తి


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

విశాఖపట్నం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ నిధులతో ప్రతిపాదించిన పనులు చేపట్టకుండా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు అడ్డుపడుతున్నారని జడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో పలువురు సభ్యులు ఆందోళన వ్యక్తంచేశారు. జడ్పీ సమావేశ మందిరంలో బుధవారం ఒకటి నుంచి ఏడు స్థాయీ సంఘ సమావేశాలు జరిగాయి. ఒకటి, ఏడు స్థాయీ సంఘ సమావేశాల్లో మునగపాక, ఎలమంచిలి, రాంబిల్లి జడ్పీటీసీ సభ్యులు పెంటకోట సత్యనారాయణ, సేనాపతి సంధ్యారాణి, ధూళి నాగరాజు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం, జడ్పీ సాధారణ నిధుల నుంచి అందరికీ నిధులు కేటాయించారని, అయితే ఎలమంచిలి నియోజకవర్గంలో ఇంజనీర్లు పనులు ప్రారంభించడానికి ఆమోదం తెలపడం లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర స్పందిస్తూ పనులు చేపట్టవద్దని కొన్నిచోట్ల అధికారులను ఎమ్మెల్యేలు బెదిరిస్తున్నారన్నారు. సీనియర్ ఎమ్మెల్యేలు ఉన్నచోట ఇబ్బంది

... మిగతా 6వ పేజీలో

చిట్టివలస పేరును కొనసాగించాలని వినతి

తగరపువలస,డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు మేజరు పంచాయతీగా ఉన్న చిట్టివలస పేరు భీమిలి మునిసిపాలిటీలో విలీనమైన తరువాత కనుమరుగవుతుందని ఆ గ్రామానికి చెందిన బల్ల వెంకటరావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ రామారావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిట్టివలస, తగరపువలస మధ్య ఒక రహదారి మాత్రమే ఉందని, గతంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, ఇతర ప్రైవేటు కార్యాలయాలు, ఆర్‌టీసీ బస్సుల బోర్డులపై చిట్టివలస పంచాయతీ పేరు మాత్రమే ఉండేదని చెప్పారు. భీమిలి మునిసి పాలిటీలో విలీనమైన తరువాత అందరూ తగరపువలస పేరు వినియోగించి, చిట్టివలస పేరును కనుమరుగు చేస్తున్నారని తెలిపారు.కొంతమంది తెలియక, మరికొంతమంది కావాలని పేరు మార్పిడి చేస్తున్నారన్నారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ పేరు మార్పిడి లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

గంధవరంలో రెవెన్యూ సదస్సు

పద్మనాభం రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహసీల్దార్ కె. ఆనందరావు అన్నారు. గంధవరం గ్రామంలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు ఇచ్చిన వినతులను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం 72 అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిటి చంద్రశేఖర్, ఆర్ఐ శ్యామల, సర్వే డిటీ వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జేవీ అగ్రహారంలో 19 వినతులు

భీమునిపట్నం : జీవీఎంసీ 4వ వార్డు జయంతివారి అగ్రహారంలో జరిగిన రెవెన్యూ సదస్సులో అధికా రులు రైతుల నుంచి 19 వినతులు స్వీకరించారు. వీటిలో భూ మార్పిడికి సంబంధించి 12, దేవదాయ శాఖకు సంబంధించి ఒక ఫిర్యాదు, ఇతర అంశాలకు సంబంధించి 4 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ రామారావు చెప్పారు.

రాష్ట్రస్థాయి కౌశల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : భారతీయ విజ్ఞాన మండలి, ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ సంయుక్తంగా ఈనెల 6న జిల్లాస్థాయిలో ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన కౌశల్ (ఆర్ఎస్ఎస్ సంస్థ) పోటీల్లో పలువురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని కౌశల్ జిల్లా సమన్వయ కర్త పి. నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఈనెల 29, 30 తేదీల్లో విజయవాడలో రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయన్నారు. క్విజ్‌లో కణితి పాఠశాలకు చెందిన కె.రోహిత్, జీవీఎంసీ కేడీపీఎం పాఠశాలకు చెందిన కె.డానియల్, భీమిలి మునిసిపల్ పాఠశాలకు చెందిన డి. మనోజ్, భీమిలి కేజీబీవీకి చెందిన సోనియా, రేవిడి పాఠశాలకు చెందిన ఎం. అశ్విని, చిట్టివలస పాఠశాలకు చెందిన పి. సాయివర్ధన్ ఎంపికైనట్టు చెప్పారు. పోస్టర్ తయారీలో అడవివరం పాఠశాలకు చెందిన చైత్రవర్షిణి, విశాఖ క్వీన్ మేరీ స్కూల్‌కు చెందిన ఐ. మహిత మధురానగర్‌కు చెందిన పి. చరణ్‌కుమార్, ఎస్. విజయదుర్గ ఎంపికయ్యారన్నారు. రీలు విభాగంలో నడుపూరు పాఠశాలకు చెందిన ఎల్. కౌశిక్, చిట్టివలస విద్యార్థిని బి. కృష్ణహరిణి గెలుపొందారని చెప్పారు.

భగవద్గీత పఠన పోటీలు రేపు

తగరపువలస,డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) :చిట్టివలస పంచాయతీలోని సంతపేట రామాలయంలో శుక్రవారం భగవద్గీత పఠన పోటీలు జరగనున్నట్టు నిర్వాహకులు జీవీ నారాయణ, కేఎస్ నాయుడు తెలిపారు. బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు.6 నుంచి 10వ తరగతి విద్యార్థులు అర్హులని, వయస్సు ఆధారంగా ఆరు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. పోటీల్లో పాల్గొన్న వారికి ముందుగా భగవద్గీత శ్లోకాలను అందిస్తామన్నారు. ప్రతి విభాగంలో బహుమతులు ఇస్తామని వారు తెలిపారు.

సమ్మెటివ్ -2 పరీక్షలు ప్రారంభం

తగరపువలస,డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో సమ్మెటివ్ - 2 పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. తగరపువలస బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాలలో జరిగిన పరీక్షలను ఎంఈఓ ఎ. జయప్రద పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు సంబంధించిన స్టార్ ర్యాంకింగ్ యాప్‌ను ఎలా డౌన్‌లోడ్ చేయాలో ఉపాధ్యాయులకు వివరించారు. ప్రతి పాఠశాల 5 స్టార్ వచ్చేలా కృషి చేయాలని, ఫలితాల ఆధారంగా ర్యాంకింగ్ ఉంటుందన్నారు. అనంతరం పాఠశాలలో అమలు చేస్తున్న పలు కార్యక్రమాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పలరాజు, రమేశ్, సంజీవి, మల్లిక, విద్యా కమిటీ చైర్మన్ షర్మిల పాల్గొన్నారు.

వెనుక బడి

... 5వ పేజీ తరువాయి

వెనుకబడ్డారు. వీటన్నింటినీ గత ప్రభుత్వం గాలికొదిలేసింది. దీంతో పాఠశాల విద్య గాడితప్పింది. దీని ఫలితమే స్టార్ రేటింగ్‌లో వెనుకబడ్డామని పలువురు టీచర్లు అభిప్రాయపడుతున్నారు. చివరకు 3-స్టార్ రేటింగ్ వచ్చిన పాఠశాలల్లో కూడా అత్యధికం ప్రాథమిక పాఠశాలలేనని, ఉన్నత పాఠశాలలు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. గత పాలకులు మాతృభాషలో బోధన, టీచర్ల నియామకాలపై నిర్లక్ష్యం చూపారని సీనియర్ హెచ్ఎం ఒకరు అన్నారు. ప్రధానంగా యాప్‌లతో టీచర్లను వేధించడానికి వారికి సరిపోయిందని, దాంతో బోధన గాడి తప్పిందన్నారు.

అసంపూర్తిగా సామాజిక భవన నిర్మాణం

- నిధుల లేమే కారణం
- రెండేళ్లుగా ఇదే పరిస్థితి
- స్పందించని అధికారులు, పాలకులు



అసంపూర్తిగా నిలిచిన పనులు

పద్మనాభం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభం పంచాయతీలో జిల్లా పరిషత్ అతిథి గృహం ఆవరణలో చేపట్టిన సామాజిక భవన నిర్మాణం నిధుల లేమి వల్ల అసంపూర్తిగా నిలిచిపోయింది. రెండేళ్లుగా పిల్లర్ల దశలోనే పనులు ఆగిపోవడంతో స్థానికులు పలు కార్యక్రమాల నిర్వహణకు ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంత ప్రజల సామాజిక అవసరాల కోసం సామాజిక భవన నిర్మాణం కోసం నాటి భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ముఖ్యమంత్రి అభివృద్ధి నిధుల నుంచి (సీఎండీఎఫ్) రూ. 46 లక్షలు మంజూరు చేయించారు. 2022 డిసెంబరు 27న భూమి పూజ చేసి, టెండర్లు పిలిచారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌పై ఒత్తిడి చేసి మరీ పనులు ప్రారంభించారు. పిల్లర్ల దశ వరకు నిర్మించిన అనంతరం మొదటి బిల్లు కోసం ప్రయత్నించగా సీఎండీఎఫ్‌లో నిధులు లేవని తేలడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారు. నాటి నుంచి దీన్ని పట్టించుకునే నాథుడే లేరు. నిధులు పూర్తిస్థాయిలో లేకుండా ఏవిధంగా పనులు ప్రారంభించారని పలువురు ప్రశ్నిస్తున్నారు. పనులు చేపట్టేటప్పుడు నిధుల లభ్యత చూడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. ఈ విషయమై మండల పీఆర్ ఏఈ వెంకటేశ్వరరావును వివరణ కోరగా భవన నిర్మాణానికి ప్రస్తుతం నిధులు అందుబాటులో లేవన్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

'గీతం' సైన్స్ డీన్‌కు ఐజీయూ అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ కృష్ణ

సాగర్‌నగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ జియోఫిజికల్ యూనియన్ (ఐజీయూ) భూ భౌతిక శాస్త్రవేత్తలకు ఏటా ప్రకటించే ప్రతిష్ఠాత్మక హరినారాయణ్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ 2024 అవార్డును గీతం వర్సిటీ స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్. కృష్ణకు లభించింది. బుధవారం ఆయన ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో జరిగిన ఐజీయూ 61వ వార్షికోత్సవంలో నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ సారస్వత్, మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ కార్యదర్శి డాక్టర్ ఎం. రవిచంద్రన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. గతంలో ఆయన శాంతిస్వరూప్ భట్నాగర్ అవా ర్డుతో పాటు జేసీ బోస్ నేషనల్ ఫెలోషిప్ అందుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణను గీతం వర్సిటీ ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. వేదవతి, తదితరులు అభినందించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 80 మంది ఎంపిక

ఆనందపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గిడిజాల సమీపంలో ఉన్న సాయి గణపతి పాలిటెక్నిక్ కళాశాలలో ప్రముఖ మ్యానుఫ్యాక్చరింగ్ సంస్థ కేవైబీ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ బుధవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. కంపెనీ ప్రతినిధులు 80 మంది ఎంపిక చేశారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహేశ్వరరావు తెలిపారు. ఎంపికైన వారికి రూ. 2.4 లక్షల వార్షిక వేతనం ఉంటుందని కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ మురళి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ వేణుగోపాల్, వైస్ ప్రిన్సిపాల్ అమరేంద్ర కుమార్, మెకానికల్ విభాగాధిపతి రాజేంద్రప్రసాద్ అభినందించారు.

ఆదివాసీ యువత స్వచ్ఛభారత్



రుషికొండలో నిర్వహించిన స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న ఆదివాసీ యువత

ఎండాడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గీతం వేదికగా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గిరిజన జాతీయ యువజన సమ్మేళనంలో భాగంగా ఆదివాసీ యువత బుధవారం రుషికొండ తీరంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలానే గీతం వర్సిటీ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం నిర్వహించిన యూత్ పార్లమెంట్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వేకే విశాఖ ఉమ్మడి జిల్లాల అధికారి గొర్లె మహేశ్వరరావు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల యువ అధికారి కె. వెంకట్ ఉజ్వల్, ఏవో పృథ్వీ, అల్లం రామప్రసాద్, ప్రసన్న, శ్వేత, జేమ్స్, స్వరూప్, వినయ్ పాల్గొన్నారు.

నేరెళ్లవలసలో జూట్‌మిల్లు కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

పద్మనాభం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) :తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేరెళ్లవలస గణేశ్ జూట్‌మిల్లు వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు టీవీ రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేశ్ మాట్లాడుతూ కార్మికులకు అక్టోబరు నెల జీతం చెల్లించకుండా యాజమాన్యం మిల్లును మూసివేయడం దారుణమన్నారు. అక్టోబరు నెల జీతంతో పాటు ఫిబ్రవరి, ఆగస్టు డీఏలను చెల్లించాలని డిమాండ్ చేశారు. మిల్లు తిప్పకుండా కార్మికులను పొడి కూలీలుగా రావాలని, లేదంటే సెటిల్మెంటు చేస్తామని బలవంతం చేస్తున్నారని విమర్శించారు. సమస్యలను పరిష్కరించకపోతే కార్మిక శాఖాధికారులకు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లి పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రమణ, ప్రధాన కార్యదర్శి సురేశ్, ఇతర నాయకులు అప్పలనాయుడు, సూరినాయుడు, ప్రశాంత్, కృష్ణ పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో ప్రత్యేక పారాయణలు



పారాయణలు చేస్తున్న అధ్యాపకులు

సింహాచలం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో బుధవారం ప్రత్యేక పారాయణలు నిర్వహించారు. విశిష్టాద్వైత మత ప్రచారకులు తిరు మంగైళ్వార్ తిరు నక్షత్ర ఉత్సవాల్లో భాగంగా వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ఆస్థాన మండపంలో ప్రత్యేక వేదికపై ఆళ్వార్లతో సహా అధిష్ఠింపజేశారు. షోడశోపచారాలు సమర్పించిన తరువాత నాలాయిర దివ్యప్రబంధంలోని పాశురాలను ఆల య స్థానాచార్యులు డా. టిపి రాజగోపాల్ సారధ్యంలో అధ్యాపకులు పారాయణలు చేశారు. మధ్యాహ్నం రాజభోగ నివేదనలు తరువాత తీర్థగోష్ఠి జరిపారు.

మాడవీధుల్లో వైభవంగా ఏకాదశి తిరువీధి



తిరువీధిలో స్వామివారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు

సింహాచలం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి తిరువీధి ఉత్సవం బుధవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. ఏకాదశి పురస్కరించుకుని ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణ అభరణాలతో శోభాయమానంగా అలంకరించి, పల్లకిలో ఉంచారు. ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనులు, అధ్యాపకుల వేదమంత్రోచ్ఛారణలు, భక్తుల హరి నామస్మరణ నడుమ స్వామివారి తిరువీధి జరిపారు. మార్గం పొడవునా భక్తులు నారికేళ ఫలాలు, కర్పూర నీరాజనాలిచ్చి ఆహ్వానం పలికారు.

హనుమత్ వ్రతం ప్రారంభం

సింహాచలం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సింహగిరి మెట్ల మార్గంలో ఉన్న సాక్షి అంజనేయస్వామి సన్నిధిలో బుధవారం గణపతి పూజతో హనుమద్వ్రతం వేడుకలకు శ్రీకారం చుట్టారు. ఆలయ అర్చకుడు రమేశ్ గణపతి పూజ, పుణ్యాహవచనములు చేసిన పవిత్ర జలాలతో ఆలయ పరిసరాలను, పూజా ద్రవ్యాలను ప్రోక్షణ జరిపారు. తరువాత మూడు రోజుల పాటు సుందరకాండ పారాయణ చేసేందుకు ఋత్విక్ వరణులను ఋత్విక్‌లకు ఇచ్చారు. ఉత్సవాలను పురస్కరించుకుని దేవస్థానం ఈఓ త్రినాథరావు ఆదేశాల మేరకు ఆలయాన్ని మామిడి తోరణాలు, బంతి పూలతో శోభాయమానంగా అలంకరించారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ



విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఈఓ త్రినాథరావు

సింహాచలం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధీనంలో నిర్వహిస్తున్న హైస్కూల్, వేద పాఠశాల విద్యార్థులకు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. నగరానికి చెందిన నారాయణ సేవా దళం వ్యవస్థాపకుడు బత్తుల పవన్‌కుమార్ వీటిని వితరణగా అందజేశారు. దాతలను ఈఓ అభినందించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం బాను, వేద పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంతాచార్యులు, నారాయణ సేవా దళం ప్రతినిధులు పర్వతం శ్రీరామచంద్రమూర్తి, పంపాన దుర్గేశ్, తదితరులు పాల్గొన్నారు.

థింసా నృత్య ప్రదర్శనలో భీమిలి బాలికల ప్రతిభ

భీమునిపట్నం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో రెండు రోజుల క్రితం జరిగిన బాల్‌రంగ్ రాష్ట్రస్థాయి థింసా నృత్య పోటీల్లో పట్టణానికి చెందిన నెహ్రూ మునిసిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపారు. ఈ పోటీల్లో బాలికలకు ద్వితీయ బహుమతి లభించింది. ఈమేరకు బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులను హెచ్ఎం ఎం.తిరుమల శ్రీదేవి, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి, తదితరులు అభినందించారు.

స్టాండింగ్ కౌన్సెల్ కొనసాగింపునకు నో

... 5వ పేజీ తరువాయి

వసూలు చేసి ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. టీడీపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంథం శ్రీనివాసరావు మాట్లాడుతూ గాజువాకలో ఏఈగా పనిచేస్తున్న ఉద్యోగి ఒకరు ఇటీవల తన తమ్ముడికి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం వేయించుకున్నారని, కరోనాలో చనిపోయిన వారికి ఇంతవరకూ ఉద్యోగాలు ఇవ్వలేదని దీనిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. దీనికి కమిషనర్ సంపత్ కుమార్ బదులిస్తూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జాబితా, వారు ఉద్యోగంలోకి చేరిన తేదీతో కూడిన వివరాలను సభ్యులందరికీ వచ్చే కౌన్సిల్ నాటికి అందజేస్తామన్నారు. జీవీఎంసీకి చెందిన క్రీడా ప్రాంగణాల్లో సాధన చేసే క్రీడాకారుల నుంచి వసూలు చేసే ఫీజులు పెంచే ప్రతిపాదనపై 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు అభ్యంతరం వ్యక్తం చేశారు. రూ.25 కోట్లు ఖర్చు పెట్టి జీవీఎంసీ నిర్మిస్తే, అధికారులు దొంగచాటుగా అస్మదీయుడైన వ్యక్తికి స్టేడియం అప్పగించేశారని ఆరోపించారు. సీపీఎం కార్పొరేటర్ బి. గంగారావు మాట్లాడుతూ జీవీఎంసీ క్రీడా ప్రాంగణాల నిర్వహణకు కార్యాచరణ రూపొందించేందుకు కార్పొరేటర్లు, క్రీడాకారులు, క్రీడా సంఘాలతో ఒక కమిటీని నియమించాలని కోరగా మేయర్ అంగీకరించారు. కౌన్సిల్‌లో తీర్మానాలు చేసి చేతులు దులిపేసుకుంటున్నారు తప్ప, వాటిని అమలు చేయడంలో విఫలమవుతున్నారంటూ 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ అసంతృప్తి వ్యక్తం చేశారు. నైట్ ఫుడ్‌కోర్టు తరలింపు, చైన్‌మెన్ వ్యవస్థ రద్దుపై నిర్ణయం తీసుకుని ఏడాది గడిచినా ఇప్పటికీ కొనసాగుతుండడమే అందుకు నిదర్శనమన్నారు. దీనిపై కమిషనర్ కలుగజేసుకుని చైన్‌మెన్‌ను కార్యాలయాల్లో అటెండర్లుగా వినియోగించుకోవాలని సీసీపీ ప్రభాకరరావును ఆదేశించారు. కార్పొరేటర్ల స్టడీ టూర్‌కు ఏజెంట్‌గా వ్యవహరించిన వ్యక్తికి రూ.1.39 కోట్లు బిల్లు చెల్లించే అంశంపై కార్పొరేటర్లు మహ్మద్ సాదిక్, మహ్మద్ ఇమ్రాన్, ఉరుకూటి చంద్రరావు తదితరులు అభ్యంతరం తెలిపారు. స్టడీ టూర్‌కు వెళ్లినవారంతా ఏం అధ్యయనం చేశారో తెలపాలని సీపీఎం కార్పొరేటర్ గంగారావు డిమాండ్ చేశారు. స్టడీటూర్‌లో బెంగళూరులోని చెత్త విభజన ప్లాంట్‌ను సందర్శించామని అలాంటి ప్రాజెక్టు విశాఖలో ఉండాలని, గోవా బీచ్ తరహాలో విశాఖ బీచ్‌లో కూడా రక్షణ గార్డులను ఏర్పాటు చేయాలని సీపీఐ కార్పొరేటర్ ఏజే స్టాలిన్ కోరారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ సెక్రటరీ ఆధ్వర్యంలో రిపోర్టు తయారవుతోందని, వచ్చే కౌన్సిల్‌లో దీనిపై నివేదిక ఇస్తామన్నారు.

ఎండాడ నుంచి రుషికొండ, సూర్య ప్రెస్ వద్ద నుంచి కొమ్మాది వరకూ నిర్మించిన మాస్టర్ ప్లాన్ రోడ్డులో స్థలం కోల్పోయిన వారికి టీడీఆర్‌కు బదులుగా రూ.పది కోట్లు నగదు పరిహారం ఇవ్వాలనే ప్రతిపాదనను సభ్యులంతా మూకుమ్మడిగా తిరస్కరించారు. ఇలా నగదు పరిహారం ఇస్తే జీవీఎంసీ ఆర్థికంగా సంక్షోభంలో కూరుకుపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికే అప్పగిస్తూ తీర్మానం చేసి పంపించాలని నిర్ణయించారు. సింహాచలం బీఆర్‌టీఎస్ రోడ్డులో స్థలాలు కోల్పోయిన వారికి టీడీఆర్ ఇవ్వాలని, అక్కడి కార్పొరేటర్ ఫ్లెక్సీ పట్టుకుని మేయర్ ముందుకు వెళ్లి నిలబడగా, అక్కడ ఎవరికీ టైటిల్ లేదని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా ఆదేశాలు వస్తేనే తప్ప ఏమీ చేయలేమని కమిషనర్ స్పష్టం చేశారు. గత పదేళ్లలో జీవీఎంసీ పరిధిలో 1035 టీడీఆర్‌లు జారీచేశారని వాటిలో చాలావరకూ అక్రమాలు ఉన్నాయని కార్పొరేటర్ మూర్తియాదవ్ ఆరోపించగా, టీడీఆర్‌ల వివరాలను సభ్యులందరికీ అందజేస్తామని ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపొచ్చని కమిషనర్ సూచించారు. ఎమ్మెల్సీ వరుదు కళ్యాణికి జీవీఎంసీ కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యేందుకు అర్హత లేదని, ఆమెను ఎలా అనుమతిస్తున్నారని మూర్తియాదవ్ మేయర్‌ను ప్రశ్నించారు. దీనిపై అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మేయర్ హామీ ఇచ్చారు. క్లాప్ వాహనాలకు లోడర్లుగా 656 మందిని రోజువారీ వేతనంపై తీసుకున్నప్పటికీ కాంట్రాక్టర్ సరిగా మనుషులను పెట్టడం లేదని, బిల్లు మాత్రం తీసుకుంటున్నారని కార్పొరేటర్లు శరగడం రాజశేఖర్,గల్లా పోలిపల్లి, గాడు చిన్నికుమారి, గంకల కవిత, తదితరులు ఆరోపించారు. కాంట్రాక్టర్ బిల్లు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. దీనికి కమిషనర్ బదులిస్తూ కార్మికుల వేతనాలు ఆపడం సరికాదని, కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని హామీ ఇచ్చారు.గాజువాక హౌస్ కమిటీ సమస్య చాలాకాలంగా పెండింగ్ ఉందని అక్కడ భవన నిర్మాణాలకు అనుమతివ్వాలని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మేయర్‌ను కోరారు. దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ తన నియోజకవర్గం పరిధిలో జీవీఎంసీ నైట్ షెల్టర్ల నిర్వహణ దారుణంగా ఉందని, గంజాయి వినియోగం కూడా పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు కూడా హాజరయ్యారు.



ఆనందపురం : భగవద్గీత శ్లోకాలను చదువుతున్న విద్యార్థులు

గంభీరంలో ఘనంగా గీతా జయంతి

ఆనందపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంభీరం పంచాయతీ ఐఐఎం రోడ్డులో ఉన్న హరేకృష్ణ వైకుంఠం ఆధ్వర్యంలో గీతా జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి 350 మంది విద్యార్థులు హాజరై 700 శ్లోకాలు 18 అధ్యాయనాలను పారాయణం చేశారు. ఈ సందర్భంగా హరేకృష్ణ మూవ్మెంట్ జిల్లా అధ్యక్షుడు నిష్కించన భక్తదాస మాట్లాడుతూ భగవద్గీత జీవితంలో అనేక విషయాల గురించి నేర్పుతుందన్నారు. విద్యార్థులు భగవద్గీతను చదవడం అలవాటుగా మార్చుకోవాలని సూచించారు.

సింహాచలం : పతంజలి గీత పిరమిడ్ ధ్యాన కేంద్రం ప్రతినిధి గీత సత్యవతి ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి ప్రారంభమైన 11వ శ్రీమద్భగవద్గీత జయంతి ధ్యాన వేడుకల బుధవారం నాటి పారాయణలతో ముగిసాయి. వేడుకల్లో భాగంగా చివరి రోజు ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు విద్యార్థులకు, నిర్వాహకులకు ఆశీర్వచనాలీయగా, పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు జ్ఞాపికలను అందజేశారు.

తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘం ఏర్పాటు

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : భీమిలి, ఆనందపురం మండలాల పరిధిలో ఉన్న విద్యుత్ కార్మికులు తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘంగా ఏర్పడ్డారు. ఈమేరకు బుధవారం తాళ్లవలసలో ఆ శాఖ 3వ జోన్ అధ్యక్షుడు కోన రవి కిశోర్ అధ్యక్షతన సమావేశమయ్యారు. ముఖ్య అతిథులుగా ఈపీడీసీఎల్ డిస్కామ్ అధ్యక్షుడు బీఎం నాయుడు, వేదుల నగేశ్ హాజరై ఎన్నిక నిర్వహించారు. భీమిలి, ఆనందపురం మండలాలకు చెందిన పది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అడహాక్ బాడీ అనంతరం ఎన్నిక నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో షిఫ్టు ఆపరేటర్లు, పిక్ లోడ్ సిబ్బంది, జూనియర్ లైన్‌మెన్‌లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

మార్గశిర ఉత్సవాల్లో పోలీస్ పెత్తనం

... 5వ పేజీ తరువాయి

లాక్కొని వారే అమ్మవారికి చూపించి ఇస్తున్నారు. సన్నిధిలో దేవదాయ శాఖ సిబ్బంది ఉండి భక్తులను త్వరగా బయటకు పంపాలి. కానీ ఇక్కడ పోలీసులే ఆ పని చేస్తున్నారు. దేవదాయ శాఖ అధికారులు కూడా వారి చర్యలను ప్రశ్నించలేకపోతున్నారు. పోలీసులకు భోజనం కోసం ఈ ఏడాది ప్రత్యేకంగా మెస్ నిర్వహించడం మరో విశేషం.

అమలు కాని తీర్మానాలు

కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన ఉత్సవంపై సమావేశం అన్ని శాఖల అధికారులతో నిర్వహించినప్పుడు ఏమేమి చేయాలో తీర్మానాలు చేశారు. వాటిని ఏ శాఖ అమలు చేయాలో కూడా సూచించారు. వాటిలో కీలకమైనవి అమలు కావడం లేదు.

- భక్తులు ఆలయంలోకి ప్రవేశించడానికి ఒక మార్గం, బయటకు వెళ్లడానికి మరో మార్గం ఉండాలని సూచించారు. ప్రధాన రహదారి ఆర్చి నుంచి భక్తులు ప్రవేశించి, ఘోషాసుపత్రి వైపు బయటకు వెళ్లేలా చూడాలని తీర్మానించారు. కానీ దీనిని పోలీసులు అమలు చేయడం లేదు. భక్తులు ఏ మార్గంలో ఆలయం వైపు వస్తున్నారో.. అదే మార్గంలో బయటకు వెళుతున్నారు.
- ఆలయ మార్గంలో క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నందున ఇరు వైపులా దుకాణాల వారిని వెనక్కి జరపాలని సూచించారు. ఈ బాధ్యత జీవీఎంసీ, పోలీస్ శాఖలకు అప్పగించారు. దుకాణాలను వెనక్కి జరపలేదు. వారు మరింత ముందుకువచ్చి రోడ్డుపై జంగిళ్లు పెడుతున్నా వారించడం లేదు.
- ఆలయ మార్గంలో కాలువలు వెంటనే పరిశుభ్రం చేయాలని, అవసరమైతే వాటిపై కప్పులు వేయాలని సూచించారు. కానీ ఆ పనులు కూడా జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది సరిగ్గా చేయడం లేదు.

గుర్రాల పార్కుపై గరంగరం

... 5వ పేజీ తరువాయి

లేదన్నారు. 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు మాట్లాడుతూ ఇంతవరకూ ఆ ప్రాజెక్టుకు ఎంత చెల్లించారు, గత కౌన్సిల్‌లో ఎందుకు ఈ అంశాన్ని పెట్టలేదని ప్రశ్నించారు. చీఫ్ ఇంజనీర్ శివప్రసాద్‌రాజు వివరణ ఇస్తూ ఈ ప్రాజెక్టుకు ఇప్పటికే రూ.3 కోట్లు బిల్లు చెల్లించామని చెప్పడంతో టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తంచేస్తూ, అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకుండా, ఇంకా పనులు పూర్తిచేయకుండానే గుర్రాల ప్రాజెక్టుకు రూ.3 కోట్లు ఎలా ఇచ్చారో మేయర్ చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై మేయర్ కలుగజేసుకుంటూ తనకు కూడా గుర్రాల పార్కు గురించి కనీసం తెలియదని, ముడసర్లోవ పార్కు అభివృద్ధికి అని అప్పటి కమిషనర్ చెప్పడంతోనే సంతకం చేశానని వివరణ ఇచ్చారు. మేయర్ వివరణపై 45వ వార్డు కార్పొరేటర్ కంపా హనోక్ అభ్యంతరం వ్యక్తంచేశారు.మేయర్‌కు తెలియకుండా రూ.ఆరు కోట్ల ప్రాజెక్టు ప్రారంభించారంటే మేయర్‌తోపాటు కౌన్సిల్‌కే అవమానమని అందుకు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేయడంతో సభ ఒక్కసారిగా వేడెక్కింది. ఆరోపణలు వస్తేనే రాజీనామా చేయాలంటే కార్పొరేటర్లందరిపైనా ఆరోపణలు ఉన్నాయని, కొందరిపై టీడీపీ సీనియర్ కార్యకర్తలమంటూ చేసిన ఫిర్యాదులు తన వద్ద ఉన్నాయని మేయర్ అన్నారు. అందుకు టీడీపీ సభ్యులంతా అభ్యంతరం తెలిపారు. దమ్ముంటే వాటిని బయటపెట్టి విచారణ జరపాలని, ఆరోపణలు రుజువైతే వారిపై చర్యలు తీసుకోవాలని పీలా శ్రీనివాసరావు సవాల్ చేశారు. చివరకు కౌన్సిల్‌లో ఆమోదం పొందకుండా ప్రాజెక్టుకు ప్రతిపాదనలు తయారుచేయడం తప్పేనని చీఫ్ ఇంజనీర్ శివప్రసాదరాజు అంగీకరించారు. ఈ నేపథ్యంలో గుర్రాల పార్క్ ప్రాజెక్టును నిలిపివేశారు.

అభివృద్ధి పనులకు అధికారుల మోకాలడ్డు

... 5వ పేజీ తరువాయి

లేదని, కొత్తగా వచ్చిన ఒకరిద్దరు ఎమ్మెల్యేలు మాత్రం జడ్పీ నిధులకు సంబంధించి పనులు చేపట్టవద్దని చెబుతున్నారన్నారు. ఈ విధానంలో మార్పు రాకపోతే వచ్చే జనరల్ బాడీ సమావేశాన్ని బహిష్కరిస్తామని చైర్‌పర్సన్ హెచ్చరించారు. ఈ అంశంపై పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసరావు బదులిస్తూ పనులకు ఆటంకం లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కె.కోటపాడు జడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ అధ్యక్షతన జరిగిన రెండు, ఐదు స్థాయీ సంఘ సమావేశాల్లో సామాజిక పింఛన్ల సర్వేపై చైర్‌పర్సన్ సుభద్ర, దేవరాపల్లి జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, తదితరులు ఆందోళన వ్యక్తంచేశారు. పింఛన్ల ఏరివేత కోసం ఈ సర్వే చేస్తున్నారా...అని ప్రశ్నించగా అనకాపల్లి డీఆర్‌డీఏ పీడీ శచీదేవి బదులిస్తూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాకు ఒక సచివాలయ పరిధిలో సర్వే చేశామన్నారు. పింఛన్లలో కోత ఉండదన్నారు. దివ్యాంగులకు పింఛన్ల విషయంలో ఇబ్బందులు ఉన్నాయని పలువురు సభ్యులు ప్రస్తావించగా...అల్లూరి సీతారామరాజు జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ కె.కృష్ణారావు బదులిస్తూ మండలాల్లో మెగా సదరం క్యాంపుల నిర్వహణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. సంబంధిత ఎంపీడీవోల నుంచి వచ్చిన ప్రతిపాదనల మేరకు క్యాంపులు నిర్వహిస్తామన్నారు. వైద్య ఆరోగ్య శాఖపై చర్చ సందర్భంగా కేజీహెచ్‌కు నేరుగా వెళితే వైద్యం అందడంలో జాప్యం జరుగుతుందని, సూపరింటెండెంట్‌కు ఫోన్ చేస్తే వెంటనే చికిత్స అందుతుందని పలువురు సభ్యులు అన్నారు. విద్యా శాఖపై చర్చలో చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ చాలా పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా ఉందన్నారు. భీమిలి జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు మాట్లాడుతూ నగర పరిధిలో ఉన్న జడ్పీ, ఎంపీపీ పాఠశాలలను జీవీఎంసీలో విలీనం చేయాలని కోరగా ప్రభుత్వానికి నివేదిస్తామని డీఈవో ప్రేమ్‌కుమార్ హామీ ఇచ్చారు. కాగా, అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులు, నిర్మాణాలకు ప్రతిపాదనలు వస్తే నిధులు మంజూరుచేస్తామని చైర్‌పర్సన్ అన్నారు. ప్రతి మండలంలో అభివృద్ధి కార్యక్రమాలకు జడ్పీటీసీ సభ్యులను ఆహ్వానించాలని, గ్రామ సభల్లో చేసిన తీర్మానాల వివరాలు సర్పంచులు/ఇతర ప్రజా ప్రతినిధులకు అందజేయాలని అధికారులను చైర్‌పర్సన్ ఆదేశించారు. ఉద్దేశపూర్వకంగా జడ్పీటీసీ సభ్యులను నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని ఆమె అన్నారు. సమావేశంలో డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

సాగర్‌నగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సాగర్‌నగర్ సన్ బీచ్ క్యాంపస్‌లో బుధవారం సెమీ కిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందరంగా కేక్ మిక్సింగ్ గ్రేప్ స్టాంపింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సన్ ఇనిస్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశాజ్యోతి, రాడిసన్ బ్లూ జనరల్ మేనేజర్ అభిషేక్ పాణి, డైరెక్టర్ ఆఫ్ సేల్స్ రాజ్‌కిరణ్, హ్యూమన్ రిసోర్స్ మేనేజర్ రత్నకుమార్, క్యాంపస్ హెడ్ ఇషాక్ సుధాకర్ హాజరై విద్యార్థులతో కలసి 50 కిలోల కేక్ మిక్సింగ్‌లో పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల సేవలు ప్రశంసనీయం

» ఏయూ వీసీ శశిభూషణరావు



మాట్లాడుతున్న వీసీ శశిభూషణరావు

వెంకోజీపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఏయూ పరిధిలోని జాతీయ సేవా పథక కార్యకర్తల సేవలు ప్రశంసనీయమని ఏయూ వీసీ జి.శశిభూషణరావు అన్నారు. ఏయూ ఈసీ హాలులో వర్సిటీకి జాతీయ సేవా పథక విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన యూనివర్సిటీ జాతీయ సేవా పథక సలహా కమిటీ వార్షిక సమావేశంలో ఆయన అధ్యక్ష ఉపన్యాసం చేశారు. వలంటీర్లు కేంద్ర ప్రభుత్వ పథకాలైన జై భారత్, వికసిత్ భారత్, ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్, స్వచ్ఛ భారత్ తదితర కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. 2022-23, 2023-24 సంవత్సరాల్లో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాల వివరాలను పవర్ పాయింట్ సహాయంతో యూనివర్సిటీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరినాథ్ వివరించారు. తెలుగు రాష్ట్రాల్లో జాతీయ సేవా పథక కార్యక్రమాలలో ఏయూ జాతీయ సేవా పథక విభాగం ముందుందని ఎన్‌ఎస్‌ఎస్ ప్రాంతీయ సంచాలకులు ఎం.రామకృష్ణ అన్నారు. మరిన్ని వినూత్న కార్యక్రమాలతో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం పని చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో జాతీయ సేవా పథక పూర్వ రాష్ట్ర అధికారి డాక్టర్ పి.రామచంద్రరావు, ఏయూ రెక్టార్ ఎన్.కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

» ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు



మాట్లాడుతున్న దామోదరరావు

కూర్మన్నపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ఎంప్లాయీస్ యూనియన్ ధ్యేయమని రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. బుధవారం స్టీల్ సిటీ ఆర్టీసీ డిపోలో ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది డిపోల ఈయూ కార్మికుల సమావేశంలో మాట్లాడారు. ఖాళీగా ఉన్న పోస్టులను ప్రభుత్వం తక్షణమే భర్తీ చేయాలని, పదోన్నతులకు మోక్షం కల్పించాలని, సిబ్బందికి నైట్‌అవుట్, ట్రావెలింగ్, ఓటీ అలవెన్స్‌లను చెల్లించాలని, ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను అమలు చేయాలని కోరారు. తప్పు చేయకుండా కార్మికులను అధికారులు వేధిస్తే ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈయూ డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి.భానుమూర్తి కారుణ్య నియామకాలను తక్షణమే చేపట్టాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి నందమూరి రామారావు, శుభకర్, కృష్ణమూర్తి, తాతలు, నారాయణ, పద్మ, మూర్తి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **పుష్ప-2** : జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 50, టమాటా 26, వంకాయలు (తెలుపు)28, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 20, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 34, బీరకాయలు 38, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 20, క్యారెట్ 68 దొండకాయలు 30, బంగాళ దుంపలు 33, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 120, అల్లం (పాతది)56, బరబాటి 20, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 55, గోరుచిక్కుడు 24 దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 300, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, పొటల్స్ 44, కీరదోస 28, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 50, కొండఉసిరి 50, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	620
విజయనగరం	624
శ్రీకాకుళం	624

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	93
ఫారం ధర	113
విత్ స్కిన్	196
స్కిన్‌లెస్	206

22వ వార్డు కంపు కంపు

» గెడ్డల్లో పూడికలు తీయని పారిశుధ్య సిబ్బంది
» పట్టించుకోని అధికారులు
» దుర్వాసన, దోమలతో ప్రజల ఇబ్బందులు



మంగాపురంకాలనీ గెడ్డలో పేరుకుపోయిన రాళ్లురప్పలు, పూడికలు

మద్దిలపాలెం, డిసెంబరు 11 : జీవీఎంసీ 22వ వార్డులో పారిశుధ్య నిర్వహణ నిర్లక్ష్యానికి ప్రతిరూపంగా మారింది. ఈ ప్రాంతంలో గెడ్డలు మురికికూపాలుగా తయారయ్యాయి. పారిశుధ్య సిబ్బంది నెల తరబడి పూడికలు తొలగించకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోతోంది. ఇక మురికి కాల్వల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. ఎక్కడికక్కడే చెత్త నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఫలితంగా 22వ వార్డు కంపులో కొట్టుమిట్టాడుతోంది.

ఈ వార్డులోని మురుగు నీరు సముద్రంలో కలవడానికి ఇక్కడ ప్రధానంగా ఆరు గెడ్డలు ఉన్నాయి. పిఠాపురం కాలనీ, పీతలవానిపాలెం, మంగాపురం కాలనీ, బలరాంనగర్, రేసపువానిపాలెం మీదుగా ఈ గెడ్డలు ప్రవహిస్తుంటాయి. ఎగువ ప్రాంతాలైన మద్దిలపాలెం, సత్యం జంక్షన్ నుంచి వచ్చే మురుగు నీటితో పాటు వార్డులోని పలు ప్రాంతాల వాడుక నీరు ఆయా గెడ్డల ద్వారా సముద్రంలో కలుస్తోంది. అయితే ఈ గెడ్డల్లో ఎన్నో నెలల నుంచి పూడికలు తొలగించకపోవడంతో గుట్టల కొద్దీ చెత్తాచెదారం పేరుకుపోయి ఎక్కడికక్కడే మురుగునీరు నిలిచిపోతోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

నెలల తరబడి తొలగించని పూడిక

సాధారణంగా రెండు, మూడు నెలలకోసారి చిన్న జేసీబీలతో గెడ్డల్లో చెత్తను తొలిగిస్తుంటారు. అయితే 22వ వార్డులో మాత్రం ఆరు నెలల పైబడినా గెడ్డల్లో పూడికలు తొలగించడమే లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన చెత్తచెదారంతో మరింత అధ్వానంగా పరిస్థితి తయారైంది. గెడ్డల పక్కన ఏరియాలు మురికికూపాలుగా మారిపోయాయి. గెడ్డల పక్క నుంచి వెళితే చాలు కంపుతో ముక్కు పుటలు అదిరిపోతున్నాయి. గెడ్డలు, కాలువల్లో ఇలాంటి పరిస్థితి నెలకొనడంతో ఎలాగూ దోమల వృద్ధిని అరికట్టలేమన్న ఉద్దేశంతో ఏమో ఫాగింగ్ వంటి చర్యలు చేపట్టడం లేదు.



పీతలవానిపాలెం గెడ్డలో నిలిచిన మురుగు నీరు



పిఠాపురంకాలనీ గెడ్డలో పేరుకుపోయిన చెత్తాచెదారం

విధులకు 30 మందే హాజరు

ఈ 22వ వార్డులో పారిశుధ్య కార్మికులు సరిగా విధులు నిర్వహించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. రోజు వారీ పారిశుధ్య పనులకు 64 మంది కార్మికులు ఉన్నా.. హాజరయ్యేది మాత్రం ఇరవై ముప్పైమందేనని పలువురు అంటున్నారు. మిగతా వారు విధుల్లోకి రాకపోయినామస్తరు (హాజరు) వేసి ఎంచక్కా వేతనాలు తీసుకొంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగా వార్డులో శానిటేషన్ దారుణంగా తయారైందని స్థానికులు చెబుతున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి పారిశుధ్య నిర్వహణలో సరిదిద్ది, సమస్య పరిష్కారానికి పటిష్ఠ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మోటారు కార్మికుల భద్రతకు సంక్షేమ బోర్డు అవసరం

» విశాఖ జిల్లా మోటారు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి ఎస్కే రెహమాన్



సమావేశంలో మాట్లాడుతున్న రెహమాన్

ఆరిలోవ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మోటారు కార్మికులకు భద్రతతో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని విశాఖ జిల్లా మోటారు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి ఎస్కే రెహమాన్ కోరారు. బుధవారం హనుమంతవాక జంక్షన్ వద్ద గల ముడసర్లోవ పార్కులో టాటా మ్యాక్సీ డ్రైవర్ల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం మోటారు రంగ కార్మికులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతోందని విమర్శించారు. కొత్త జీవోలను తెస్తూ ఆర్టీఏ, ట్రాఫిక్ పోలీసుల ద్వారా ఎడాపెడా జరిమానాలు వసూలు చేయడం, కేసులు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా మోటారు రంగంపై ఆంక్షలు విధించడం, ఈ రంగాన్ని ఆదాయ వనరు మార్గంగానే చూస్తోంది తప్ప కార్మికుల సంక్షేమం గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదో ఓ కొత్త పేరుతో పెట్టి ట్యాక్స్‌లు, జరిమానాలు విధించడం పరిపాటిగా మారిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడి వారి సంక్షేమానికి అవసరమైన విధానలు రూపొందించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడు పాండురంగ, అధ్యక్షుడు కనకరాజు, ఉపాధ్యాక్షుడు లక్ష్మణ్, కార్యదర్శి గోవింద్, జాయింట్ సెక్రటరీ రవిశంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరంజీవి, కోశాధికారి అప్పలరాజు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా అభియాన్ ఏసీఎంవోగా దేముడుబాబు



దేముడుబాబుకు అభినందిస్తున్న సంఘ నేతలు

విశాఖపట్నం: డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టులో అసిస్టెంట్ కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్(ఏసీఎంవో)గా పైల దేముడుబాబు నియమితులయ్యారు. ఈ మేరకు సమగ్రశిక్షా అభియాన్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. దేముడుబాబు చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు బుధవారం ఏసీఎంవోగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు తీసుకున్న దేముడుబాబుకు ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ.పైడిరాజు, ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రతినిధి ఎంవీ కృష్ణకుమార్ తదితరులు అభినందించారు.

వికసిత్ భారత్‌లో యువతదే ప్రధాన భూమిక



వికసిత్ భారత్‌లో పాల్గొన్న ఆచార్య అజిత్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆరిలోవ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : భారతదేశం 2047 నాటికి వికసిత్ భారత్‌గా రూపొందాలంటే ముందుగా యువత తమలక్ష్యాలను నిర్దేశించుకొని, విజయం సాధించాలని ఆచార్య అజిత్‌కుమార్ అన్నారు. బుధవారం శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గురుకులో నిర్వహించిన వికసిత్ భారత్-2027 కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ గురుకులాల సమన్వయకర్త ఎస్.రూపవతి అధ్యక్షతను జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్య వైద్యం, రక్షణ, వ్యవసాయం తదతర రంగాల్లో యువతను ప్రోత్సహించాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఈ దేశ ఆశయాలు, లక్ష్యాలు నెరవేర్చే దిశగా ప్రయత్నిస్తున్నారని, ఆయన అంచనాలకు తగినట్టుగా మనం పని చేయాలని సూచించారు. మహిళా సాధికారత దేశానికి అత్యంత అవసరమన్నారు. అనంతరం రూపవతి మాట్లాడుతూ యువత సమయాన్ని వృథా చేసుకోరాదని సూచించారు. ప్రతి నిమిషం తన కోసం, దేశం కోసం ఆలోచిస్తూ పని చేయాలని సూచించారు. అంతకుముందు వికసిత్ భారత్‌పై విద్యార్థులకు వ్యాస రచన పోటీ నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి

పెదవాల్తేరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 21వ వార్డుకు చెందిన టీడీపీ యువ నాయకుడు ఎ.సురేష్ స్మృత్యర్థం కుటుంబ సభ్యులు, స్నేహితుల ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంకు సిబ్బంది 73 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి సురేష్, టీడీపీ 21వ వార్డు అధ్యక్షుడు పీతల అమరేంద్ర, నేతలు పి.అవినాశ్, జి.మూర్తి, గోల్డెన్ స్టార్స్ కల్చర్ క్లబ్, నేతాజీ స్ట్రీట్ కల్చర్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర కారాగారానికి మరో డిప్యూటీ సూపరింటెండెంట్

ఆరిలోవ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విశాఖ కేంద్రకారాగారానికి బుధవారం మరో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా సూర్యకుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ విషయాన్ని జైలు వర్గాలు ధ్రువీకరించాయి. ఈయన రాజమండ్రి కేంద్ర కారాగారం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. కాగా ఇప్పటికే కేంద్ర కారాగారం డిప్యూటీ సూపరింటెండెంట్లుగా ఇద్దరు ఉన్నారు. తాజాగా సూర్యకుమార్ రాకతో సూపరింటెండెంట్ల సంఖ్య మూడుకు చేరింది. కాగా, ముగ్గురు డిప్యూటీ సూపరింటెండెంట్లు ఉండడంతో కాస్త పని భారం తగ్గి మెరుగైన పనితీరుకు అవకాశం ఉంటుందని జైలు వర్గాలు పేర్కొంటున్నాయి.

సందడిగా శ్రీప్రకాశ్ విద్యానికేతన్ వార్షికోత్సవం



యంగ్ స్పైల్స్ పత్రికను ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథులు

సిరిపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : శ్రీప్రకాష్ విద్యానికేతన్ 23వ వార్షికోత్సవం (ఆరోమా 2024-25)ను సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ గణిత శాస్త్రవేత్త డా.సుధాకర్ సి.అగార్కర్, కంకటాల సీఎండీ కంకటాల మల్లికార్జునరావు, వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేష్, ప్రొఫెసర్ డా.రాబిన్ గ్రోవ్స్ ప్రముఖ స్టోరీ టెల్లర్ జొంగిస్వా కోట్ట, శ్రీప్రకాష్ విద్యానికేతన్ డైరెక్టర్ చిట్టూరి వాసు ప్రకాష్ హాజరై జ్యోతి ప్రజల్వనగావించి సంబరాలను ప్రారంభించారు. అనందరం వక్తలు మాట్లాడుతూ చదువుతో పాటు అన్ని అంశాల్లోనూ విద్యార్థులు ప్రతిభావంతంగా రాణించాలని అభిలషించారు. విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాత్రే కీలకమన్నారు. తదుపరి సభా ప్రాంగణంలో విద్యార్థులు తమ సృజనాత్మకతతో రూపొందించిన ఆర్ట్ గ్యాలరీలో చిత్రకళ, పేపర్ ఆర్ట్, విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలో శాస్త్ర విజ్ఞానంతో తయారైన వివిధ నమూనాలు ఆకట్టుకున్నాయి. సింహాచలం పుణ్యక్షేత్ర వైభవాన్ని 100 చిత్రాలతో కూడిన పెయింటింగ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో భాగంగా యంగ్ స్మైల్స్ పత్రికను ఆవిష్కరించారు.

ఉత్కల్ సమాజ్ ఆలయ ప్రాంగణంలో శ్రీగీతా జయంతి



శ్రీగీతా హోమంలో పాల్గొన్న భక్తులు

సిరిపురం, (ఆంధ్రజ్యోతి) డిసెంబరు 11 : సిరిపురం ఉత్కల్ సమాజ్ దేవాలయం ప్రాంగణంలో శ్రీగీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో బుధవారం శ్రీగీతా జయంతి ముగింపు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీగీతా ప్రచార సమితి సభ్యులు సామూహికంగా సంపూర్ణ గీతా పారాయణం గీతా హోమంతో నిర్వహించారు. అనంతరం గీతా జయంతి ఉత్సవంలో పాల్గొన్న భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షులు పి.జగన్మోహన్‌రావు, ఎంవీ రాజశేఖర్, కార్యదర్శి ఎం.వనజాదేవి, కోశాధికారి జీవీఆర్ ప్రసాద్, జి.లక్ష్మీనరసింహ, ఎస్.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

దమన్‌జోడి, జగదల్‌పూర్ సెక్షన్‌లో రైల్వే జీఎం పర్యటన



పనులు పర్యవేక్షించి అధికారులకు సూచనలు ఇస్తున్న రైల్వే జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్

విశాఖపట్నం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వాల్తేరుడివిజన్ పరిధిలోని దమన్‌జోడి-జగదల్‌పూర్ సెక్షన్‌లో తూర్పుకోస్తా రైల్వే మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ బుధవారం తనిఖీలు చేశారు.సెక్షన్‌లో జరుగుతున్న మౌలిక సదుపాయాల ప్రాజెక్టు పనులు, ట్రాఫిక్ నిర్వహణ తీరును పరిశీలించారు. కార్గో రవాణా మరింత మెరుగుపరచడానికి చేపట్టాల్సిన పనులపై సంబంధింత అధికారులతో చర్చించారు. కొనసాగుతున్న ప్రాజెక్టుల పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సెల్కో-దమన్‌జోడి మార్గంలోని రైల్వే సైడింగ్, జరతి వద్ద టన్నెల్స్, అమ్మగుర వద్ద టేకాఫ్ పాయింట్లను తనిఖీ చేశారు. అనంతరం వివిధ స్టేషన్లలోని ప్రయాణికులు, సిబ్బందికి కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించి సౌకర్యాల మెరుగుకు ప్రణాళిక రూపొందించి కార్యాచరణపై దృష్టి సారించాలని ఆదేశించారు. అక్కడ నుంచి విండో ట్రైలింగ్ ద్వారా డబ్లింగ్ పనులు, మలుపులు, వంతెనలు, సొరంగాలను నిశితంగా పరిశీలించి భద్రతా నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. పర్యటనలో డీఆర్‌ఎమనోజ్‌కుమార్ సాహు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల క్రీడలు అభినందనీయం

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సమాజ సేవలో నిరంతరం తీవ్ర ఒత్తిడికి లోనయ్యే జర్నలిస్టులు క్రీడా పోటీలు నిర్వహించుకోవడం అభినందనీయమని ఏపీ ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్, ఉపకార ట్రస్టు అధినేత కంచర్ల అచ్యుతరావు పేర్కొన్నారు. ఈ నెల 16 నుంచి 22 వరకు ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో విశాఖ మీడియా క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్, ట్రోఫీలను కంచర్ల ఎంవీపీ కాలనీలోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల పాటు మీడియా మిత్రులు పోటీలు నిర్వహించుకోవడం వలన వారిలో క్రీడా స్ఫూర్తి పెరగడంతో పాటు శారీరక దేహదారుఢ్యం మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు నాయకులు జి.శ్రీనుబాబు, నిర్వాహకులు గురుప్రసాద్, మదన్, ఈశ్వరరావు, కళాకారులు గెంబలి జగదీష్, నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో భారత్ భాషా ఉత్సవ్



ఉత్సవ్‌లో పాల్గొన్న ఆచార్యులు

వెంకోజీపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఏయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లా కళాశాలలో బుధవారం భారతీయ భాషా ఉత్సవ్ ఉత్సవాలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.సీతామాణిక్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు ఎస్‌బీ చంద్రకళ, ఎ.పద్మావతి, టి.నాగభూషణం, తదితరులతోపాటు విద్యార్థులు, సహాయక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. డిజిటల్ స్పేస్‌లలో భారతీయ భాషలను ప్రోత్సహించడం, భారతీయ భాషల ద్వారా ఆవిష్కరణలు, పరిశోధనలను ప్రోత్సహించడం, బహుభాషా సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంగాలు, పాటలు ఆటలు, వినోద కార్యక్రమాలు, పొడుపు కథలు, వివిధ భాషల్లో చలనచిత్ర ప్రదర్శనలు వంటి కార్యక్రమాల సూచిక జాబితా వంటివి ఈ ఉత్సవాల్లో నిర్వహించారు.

మిద్దె తోటలతో ఆరోగ్యకర ఆహారం



మిద్దె తోటల ప్రాధాన్యాన్ని వివరిస్తున్న విద్యార్థులు, నవీన్‌కుమార్

వెంకోజీపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మిద్దె తోటల ద్వారా ఆరోగ్యకర ఆహారం లభిస్తుందని సెవెంత్ డే అడ్వెంటిస్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ అన్నారు. బుధవారం ఎంవీపీ కాలనీలోని సెవెంత్ డె అడ్వెంటిస్ట్ స్కూల్ ప్యూస్ ఎన్జీవో కో-ఆర్డినేటర్ జె.రాజేశ్వరి నేతృత్వంలో కూరగాయల మొక్కలు నాటిన అనంతరం ఆయన మాట్లాడారు. మిద్దె తోటల మీద విద్యార్థులకు అవగాహన అవసరమన్నారు. ప్రకృతి ఆధారిత పంటలు ఎప్పుడూ ఆరోగ్యకరం అని పేర్కొన్నారు. ఇళ్ల పై కప్పు, ఇంటి పరిసరాలు, బాల్కనీలు, విద్యా సంస్థలో కూరగాయల తోటలు అధికంగా పెంచాలని కోరారు.

సంస్థ అధ్యాపకురాలు జాస్లిన్ విప్పర్తి మాట్లాడుతూ ప్రకృతి ఆధారిత పంటలు పండించే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై కప్పు మీద తోటలు పెంచాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయ మొక్కలు పెంచుకోవచ్చు అనే విషయం ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. రసాయనాలు, ఎరువులు, రసాయన, క్రిమి సంహారకాలు వినియోగించకుండా పంటలు పండించాలని కోరారు. కార్యక్రమంలో గ్రీన్ వాలంటీర్ జె.రవితేజ పాల్గొన్నారు.

కొత్త పీఎస్‌లో అందుబాటులోకి సేవలు



నూతన పోలీస్‌స్టేషన్ భవనంలో సీఐ మల్లేశ్వరరావు, సిబ్బంది

ఆరిలోవ, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి) : విమ్స్ ఆస్పత్రి ప్రాంగణంలో గత ఆదివారం రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ప్రారంభించిన ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కార్యకలాపాలు ప్రారంభించినట్టు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. కొన్ని పనులు చేపట్టిన తర్వాత బుధవారం నుంచి ఇక్కడ పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి వచ్చినట్టు సీఐ వెల్లడించారు. ఈ సందర్భంగా వేద పండితులతో పూజలు చేయించారు. ఆశీర్వచనాలు స్వీకరించారు. ఇకపై ఇక్కడే తాను, తమ సిబ్బంది అందుబాటులో ఉంటామన్నారు. కాగా, ఆరిలోవ పాత పోలీసు స్టేషన్‌ను ఔట్ పోలీస్ స్టేషన్‌గా వినియోగించనున్నట్టు తెలిపారు. ఈ పోలీసు స్టేషన్‌లో ఒక హెడ్ కానిస్టేబుల్, ఒక కానిస్టేబుల్ ఉంటారని చెప్పారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా గంజాయి, మాదక ద్రవ్యాలు సేవించేవార ఉంటారని, అలాగే కొట్లాటలు, భార్యభర్తల తగాదాలు ఉంటాయని, అందుకే అక్కడ నిఘా ఉంచడం జరుగుతుందన్నారు.

వైసీపీ కార్యాలయం ప్రారంభం



పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్

మద్దిలపాలెం, డిసెంబరు 11 : మద్దిలపాలెం కృష్ణా కళాశాల రోడ్డులో బుధవారం వైసీపీ కార్యాలయాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీకి పూర్వ వైభవం తీసుకురావడానికి కార్యకర్తలందరూ సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సూపర్ సిక్స్ హామీలతో ఎన్నికలకు వెళ్లిన కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక పథకాలను పక్కన పెట్టేశాయన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే విధంగా వైసీపీ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, అదీప్‌రాజు, వాసుపల్లి గణేష్‌కుమార్, చింతలపూడి వెంకట్రామయ్య, పలువురు కార్పొరేటర్లు, నేతలు పాల్గొన్నారు.

దివ్యాంగుల క్రికెట్ విజేత తూర్పుగోదావరి

» ద్వితీయ, తృతీయ స్థానాల్లో విశాఖ, విజయనగరం జట్లు

గాజువాక, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జింక్ మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి దివ్యాంగుల క్రికెట్ పోటీలు బుధవారంతో ముగిశాయి. తూర్పుగోదావరి జట్టు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విశాఖ, విజయనగరం జట్లు నిలిచాయి. విజేతలకు న్యూపోర్టు సీఐ దాలిబాబు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని కోరారు. బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ క్రీడలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇస్తున్నాయన్నారు. దివ్యాంగులు క్రీడా స్ఫూర్తితో మెలగడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వినోద్ బాలు, గుటూరు శంకరరావు, బాటా శ్రీనివాస్, వెంకట్, స్వరూప్, తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కణితి మార్గంలోని ఒక తోటలో ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. గాజువాక కర్ణవానిపాలెం ప్రాంతానికి చెందిన గుంటూరు అప్పలరాజు (52) క్రేన్ ఆపరేటర్. బుధవారం కణితి చెక్‌పోస్టు ప్రాంతంలోని ఓ తోటలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మార్గంలో వస్తున్న ఓ ఆటో డ్రైవర్ ఇది గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కాగా అప్పలరాజు బాధ్యతారాహిత్యంగా ఉంటాడని, మూడు రోజుల క్రితం తన తల్లి చనిపోయినా వెళ్లలేదని పోలీసులకు మృతుని కుటుంబ సభ్యులు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్టాండింగ్ కౌన్సెల్ కొనసాగింపునకు నో

... 5వ పేజీ తరువాయి

వసూలుచేసి ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. టీడీపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ గాజువాకలో ఏఈగా పని చేస్తున్న ఉద్యోగి ఒకరు ఇటీవల తన తమ్ముడికి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం వేయించుకున్నారని, కరోనాలో చనిపోయిన వారికి ఇంతవరకూ ఉద్యోగాలు ఇవ్వలేదని దీనిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. దీనికి కమిషనర్ పి.సంపత్‌కుమార్ బదులిస్తూ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జాబితా, వారు ఉద్యోగంలోకి చేరిన తేదీతో కూడిన వివరాలను సభ్యులందరికీ వచ్చే కౌన్సెల్ నాటికి అందజేస్తామన్నారు. జీవీఎంసీకి చెందిన క్రీడా ప్రాంగణాల్లో సాధన చేసే క్రీడాకారుల నుంచి వసూలుచేసే ఫీజులు పెంచే ప్రతిపాదనపై 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు అభ్యంతరం వ్యక్తంచేశారు. రూ.25 కోట్లు ఖర్చు పెట్టి జీవీఎంసీ నిర్మిస్తే, అధికారులు దొంగచాటుగా అస్మదీయుడైన వ్యక్తికి స్టేడియం అప్పగించేశారని ఆరోపించారు. సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు మాట్లాడుతూ జీవీఎంసీ క్రీడా ప్రాంగణాల నిర్వహణకు కార్యాచరణ రూపొందించేందుకు కార్పొరేటర్లు, క్రీడాకారులు, క్రీడా సంఘాలతో ఒక కమిటీని నియమించాలని కోరగామేయర్ అంగీకరించారు. కౌన్సిల్‌లో తీర్మానాలు చేసి చేతులు దులిపేసుకుంటున్నారు తప్ప, వాటిని అమలుచేయడంలో విఫలమవుతున్నారంటూ 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ అసంతృప్తి వ్యక్తంచేశారు. నైట్ ఫుడ్‌కోర్టు తరలింపు, చైన్‌మెన్ వ్యవస్థ రద్దుపై నిర్ణయం తీసుకుని ఏడాది గడిచినా ఇప్పటికీ కొనసాగుతుండడమే అందుకు నిదర్శనమన్నారు. దీనిపై కమిషనర్ కలుగజేసుకుని చైన్‌మెన్‌ను కార్యాలయాల్లో అటెండర్లుగా వినియోగించుకోవాలని సీసీపీ ప్రభాకరరావును ఆదేశించారు. కార్పొరేటర్ల స్టడీ టూర్‌కు ఏజెంట్‌గా వ్యవహరించిన వ్యక్తికి రూ.1.39 కోట్లు బిల్లు చెల్లించే అంశంపై కార్పొరేటర్లు మహ్మద్ సాదిక్, మహ్మద్ఇమ్రాన్, ఉరుకూటి చంద్రరావు తదితరులు అభ్యంతరం తెలిపారు. స్టడీ టూర్‌కు వెళ్లినవారంతా ఏం అధ్యయనం చేశారో తెలపాలని సీపీఎం కార్పొరేటర్ గంగారావు డిమాండ్ చేశారు. స్టడీటూర్‌లో బెంగళూరులోని చెత్తవిభజన ప్లాంట్‌ను సందర్శించామని అలాంటి ప్రాజెక్టు విశాఖలో ఉండాలని, గోవాబీచ్ తరహాలో విశాఖ బీచ్‌లో కూడా రక్షణగార్డులను ఏర్పాటుచేయాలని సీపీఐ కార్పొరేటర్ ఏజే స్టాలిన్ కోరారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ సెక్రటరీ ఆధ్వర్యంలో రిపోర్టు తయారవుతోందని, వచ్చే కౌన్సెల్‌లో దీనిపై నివేదిక ఇస్తామన్నారు.

ఎండాడ నుంచి రుషికొండ, సూర్య ప్రెస్ వద్ద నుంచి కొమ్మాది వరకూ నిర్మించిన మాస్టర్ ప్లాన్ రోడ్డులో స్థలం కోల్పోయిన వారికి టీడీఆర్‌కు బదులుగా రూ.పది కోట్లు నగదు పరిహారం ఇవ్వాలనే ప్రతిపాదనను సభ్యులంతా మూకుమ్మడికిగా తిరస్కరించారు. ఇలా నగదు పరిహారం ఇస్తే జీవీఎంసీ ఆర్థికంగా సంక్షోభంలో కూరుకుపోతుందని ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికే అప్పగిస్తూ తీర్మానం చేసి పంపించాలని నిర్ణయించారు. సింహాచలం బీఆర్‌టీఎస్ రోడ్డులో స్థలాలు కోల్పోయిన వారికి టీడీఆర్ ఇవ్వాలని, అక్కడి కార్పొరేటర్ ఫ్లెక్సీ పట్టుకుని మేయర్ ముందుకు వెళ్లి నిలబడగా, అక్కడ ఎవరికీ టైటిల్ లేదని, రాష్ట్రప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా ఆదేశాలు వస్తేనే తప్ప ఏమీ చేయలేమని కమిషనర్ స్పష్టంచేశారు. గత పదేళ్లలో జీవీఎంసీ పరిధిలో 1035 టీడీఆర్‌లు జారీచేశారని వాటిలో చాలావరకూ అక్రమాలు ఉన్నాయని కార్పొరేటర్ మూర్తియాదవ్ ఆరోపించగా, టీడీఆర్‌ల వివరాలను సభ్యులందరికీ అందజేస్తామని ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపొచ్చని కమిషనర్ సూచించారు. ఎమ్మెల్సీ వరుదు కళ్యాణికి జీవీఎంసీ కౌన్సెల్ సమావేశానికి హాజరయ్యేందుకు అర్హత లేదని, ఆమెను ఎలా అనుమతిస్తున్నారని మూర్తియాదవ్ మేయర్‌ను ప్రశ్నించారు. దీనిపై అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మేయర్ హామీ ఇచ్చారు. క్లాప్ వాహనాలకు లోడర్లుగా 656 మందిని రోజువారీ వేతనంపై తీసుకున్నప్పటికీ కాంట్రాక్టర్ సరిగా మనుషులను పెట్టడంలేదని, బిల్లు మాత్రం తీసుకుంటున్నారని కార్పొరేటర్లు శరగడం రాజశేఖర్, గల్లా పోలిపల్లి, గాడు చిన్నికుమారి, గంకల కవిత, తదితరులు ఆరోపించారు. కాంట్రాక్టర్ బిల్లు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. దీనికి కమిషనర్ బదులిస్తూ కార్మికుల వేతనాలు ఆపడం సరికాదని, కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని హామీ ఇచ్చారు. గాజువాక హౌస్ కమిటీ సమస్య చాలాకాలంగా పెండింగ్ ఉందని అక్కడ భవన నిర్మాణాలకు అనుమతివ్వాలని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మేయర్‌ను కోరారు. దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ మాట్లాడుతూ తన నియోజకవర్గం పరిధిలో జీవీఎంసీ నైట్‌షెల్టర్ల నిర్వహణ దారుణంగా ఉందని, గంజాయి వినియోగం కూడా పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తంచేశారు. సమావేశానికి పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు హాజరయ్యారు.

మార్గశిర ఉత్సవాల్లో పోలీస్ పెత్తనం

... 5వ పేజీ తరువాయి

లాక్కొని వారే అమ్మవారికి చూపించి ఇస్తున్నారు. సన్నిధిలో దేవదాయ శాఖ సిబ్బంది ఉండి భక్తులను త్వరగా బయటకు పంపాలి. కానీ ఇక్కడ పోలీసులే ఆ పని చేస్తున్నారు. దేవదాయ శాఖ అధికారులు కూడా వారి చర్యలను ప్రశ్నించలేకపోతున్నారు. పోలీసులకు భోజనం కోసం ఈ ఏడాది ప్రత్యేకంగా మెస్ నిర్వహించడం మరో విశేషం.

అమలు కాని తీర్మానాలు

కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన ఉత్సవంపై సమావేశం అన్ని శాఖల అధికారులతో నిర్వహించినప్పుడు ఏమేమి చేయాలో తీర్మానాలు చేశారు. వాటిని ఏ శాఖ అమలు చేయాలో కూడా సూచించారు. వాటిలో కీలకమైనవి అమలు కావడం లేదు.

- భక్తులు ఆలయంలోకి ప్రవేశించడానికి ఒక మార్గం, బయటకు వెళ్లడానికి మరో మార్గం ఉండాలని సూచించారు. ప్రధాన రహదారి ఆర్చి నుంచి భక్తులు ప్రవేశించి, ఘోషాసుపత్రి వైపు బయటకు వెళ్లేలా చూడాలని తీర్మానించారు. కానీ దీనిని పోలీసులు అమలు చేయడం లేదు. భక్తులు ఏ మార్గంలో ఆలయం వైపు వస్తున్నారో.. అదే మార్గంలో బయటకు వెళుతున్నారు.
- ఆలయ మార్గంలో క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నందున ఇరు వైపులా దుకాణాల వారిని వెనక్కి జరపాలని సూచించారు. ఈ బాధ్యత జీవీఎంసీ, పోలీస్ శాఖలకు అప్పగించారు. దుకాణాలను వెనక్కి జరపలేదు. వారు మరింత ముందుకువచ్చి రోడ్డుపై జంగిళ్లు పెడుతున్నా వారించడం లేదు.
- ఆలయ మార్గంలో కాలువలు వెంటనే పరిశుభ్రం చేయాలని, అవసరమైతే వాటిపై కప్పులు వేయాలని సూచించారు. కానీ ఆ పనులు కూడా జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది సరిగ్గా చేయడం లేదు.

గుర్రాల పార్కుపై గరంగరం

... 5వ పేజీ తరువాయి

లేదన్నారు. 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు మాట్లాడుతూ ఇంతవరకూ ఆ ప్రాజెక్టుకు ఎంత చెల్లించారు, గత కౌన్సిల్‌లో ఎందుకు ఈ అంశాన్ని పెట్టలేదని ప్రశ్నించారు. చీఫ్ ఇంజనీర్ శివప్రసాద్‌రాజు వివరణ ఇస్తూ ఈ ప్రాజెక్టుకు ఇప్పటికే రూ.3 కోట్లు బిల్లు చెల్లించామని చెప్పడంతో టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తంచేస్తూ, అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకుండా, ఇంకా పనులు పూర్తిచేయకుండానే గుర్రాల ప్రాజెక్టుకు రూ.3 కోట్లు ఎలా ఇచ్చారో మేయర్ చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై మేయర్ కలుగజేసుకుంటూ తనకు కూడా గుర్రాల పార్కు గురించి కనీసం తెలియదని, ముడసర్లోవ పార్కు అభివృద్ధికి అని అప్పటి కమిషనర్ చెప్పడంతోనే సంతకం చేశానని వివరణ ఇచ్చారు. మేయర్ వివరణపై 45వ వార్డు కార్పొరేటర్ కంపా హనోక్ అభ్యంతరం వ్యక్తంచేశారు. మేయర్‌కు తెలియకుండా రూ.6 కోట్ల ప్రాజెక్టు ప్రారంభించారంటే కౌన్సిల్‌కే అవమానమని అందుకు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేయడంతో సభ ఒక్కసారిగా వేడెక్కింది. ఆరోపణలు వస్తేనే రాజీనామా చేయాలంటే కార్పొరేటర్లందరిపైనా ఆరోపణలు ఉన్నాయని, కొందరిపై టీడీపీ సీనియర్ కార్యకర్తలమంటూ చేసిన ఫిర్యాదులుతన వద్ద ఉన్నాయని మేయర్ అన్నారు. అందుకు టీడీపీసభ్యులు అభ్యంతరం తెలిపారు. దమ్ముంటే వాటిని బయటపెట్టి విచారణ జరపాలని, రుజువైతే చర్యలు తీసుకోవాలని పీలా శ్రీనివాసరావు సవాల్ చేశారు. చివరకు కౌన్సిల్‌లో ఆమోదం పొందకుండా ప్రాజెక్టుకు ప్రతిపాదనలు తయారుచేయడం తప్పేనని చీఫ్ ఇంజనీర్ శివప్రసాదరాజు అంగీకరించారు. ఈ నేపథ్యంలో గుర్రాల పార్కు ప్రాజెక్టును నిలిపివేశారు.

అభివృద్ధి పనులకు అధికారుల మోకాలడ్డు

... 5వ పేజీ తరువాయి

లేదని, కొత్తగా వచ్చిన ఒకరిద్దరు ఎమ్మెల్యేలు మాత్రం జడ్పీ నిధులకు సంబంధించి పనులు చేపట్టవద్దని చెబుతున్నారన్నారు. ఈ విధానంలో మార్పు రాకపోతే వచ్చే జనరల్ బాడీ సమావేశాన్ని బహిష్కరిస్తామని చైర్‌పర్సన్ హెచ్చరించారు. ఈ అంశంపై పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసరావు బదులిస్తూ పనులకు ఆటంకం లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కె.కోటపాడు జడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ అధ్యక్షతన జరిగిన రెండు, ఐదు స్థాయీ సంఘ సమావేశాల్లో సామాజిక పింఛన్ల సర్వేపై చైర్‌పర్సన్ సుభద్ర, దేవరాపల్లి జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, తదితరులు ఆందోళన వ్యక్తంచేశారు. పింఛన్ల ఏరివేత కోసం ఈ సర్వే చేస్తున్నారా...అని ప్రశ్నించగా అనకాపల్లి డీఆర్‌డీఏ పీడీ శచీదేవి బదులిస్తూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాకు ఒక సచివాలయ పరిధిలో సర్వే చేశామన్నారు. పింఛన్లలో కోత ఉండదన్నారు. దివ్యాంగులకు పింఛన్ల విషయంలో ఇబ్బందులు ఉన్నాయని పలువురు సభ్యులు ప్రస్తావించగా...అల్లూరి సీతారామరాజు జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ కె.కృష్ణారావు బదులిస్తూ మండలాల్లో మెగా సదరం క్యాంపుల నిర్వహణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. సంబంధిత ఎంపీడీవోల నుంచి వచ్చిన ప్రతిపాదనల మేరకు క్యాంపులు నిర్వహిస్తామన్నారు. వైద్య ఆరోగ్య శాఖపై చర్చ సందర్భంగా కేజీహెచ్‌కు నేరుగా వెళితే వైద్యం అందడంలో జాప్యం జరుగుతుందని, సూపరింటెండెంట్‌కు ఫోన్ చేస్తే వెంటనే చికిత్స అందుతుందని పలువురు సభ్యులు అన్నారు. విద్యా శాఖపై చర్చలో చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ చాలా పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా ఉందన్నారు. భీమిలి జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు మాట్లాడుతూ నగర పరిధిలో ఉన్న జడ్పీ, ఎంపీపీ పాఠశాలలను జీవీఎంసీలో విలీనం చేయాలని కోరగా ప్రభుత్వానికి నివేదిస్తామని డీఈవో ప్రేమ్‌కుమార్ హామీ ఇచ్చారు. కాగా, అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులు, నిర్మాణాలకు ప్రతిపాదనలు వస్తే నిధులు మంజూరుచేస్తామని చైర్‌పర్సన్ అన్నారు. ప్రతి మండలంలో అభివృద్ధి కార్యక్రమాలకు జడ్పీటీసీ సభ్యులను ఆహ్వానించాలని, గ్రామ సభల్లో చేసిన తీర్మానాల వివరాలు సర్పంచులు/ఇతర ప్రజా ప్రతినిధులకు అందజేయాలని అధికారులను చైర్‌పర్సన్ ఆదేశించారు. ఉద్దేశపూర్వకంగా జడ్పీటీసీ సభ్యులను నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని ఆమె అన్నారు. డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

నిద్దరోతున్న నిఘా నేత్రాలు

- పట్టించుకోని అధికారులు
- దుస్సంఘటనలు జరిగితే ఎవరిది బాధ్యత?
- ద్వారకా బస్‌స్టేషన్‌లో దయనీయ పరిస్థితి



ద్వారకా బస్టాండ్‌లో పనిచేయని సీసీ కెమేరాల్లో ఇదొకటి



అలంకారప్రాయంగా పోలీసు అవుట్‌పోస్టు

మహరాణిపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సాంకేతికత కొత్తపుంతలు తొక్కుతున్న నేటి కాలంలో చీకటి ప్రపంచాన్ని బట్టబయలు చేయడంలో సీసీ కెమేరాల పాత్ర ఎనలేనిది. నేరస్తులను పట్టించడంలో పోలీసు శాఖకు ఉపయుక్తంగా ఉంటున్నాయి. కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే ప్రజల ఆస్తులకూ రక్షణగా ఉంటున్నాయి. ఎక్కడ, ఏ సమయంలో, ఎవరు నేరం చేశారో పోలీసులు వీటి ద్వారా నిర్ధారణ చేసుకోగలుగుతున్నారు. బహుళ అంతస్తుల భవనాలు, వాణిజ్య సముదాయాలు, ఆసుపత్రులు, ప్రధాన రహదారులు, మార్కెట్ల నుంచి ఇప్పుడు ప్రతి చిన్న దుకాణం, ఇళ్లలోనూ సీసీ కెమేరాల ఏర్పాటు అనివార్యమవుతోంది. రాష్ట్రానికి ఆర్థిక రాజధానిగా పేర్కొంటున్న విశాఖలో అత్యంత కీలకమైన ద్వారకా ఆర్‌టీసీ బస్‌కాంప్లెక్స్‌లో సీసీ కెమేరాలు పనిచేయడం లేదన్న గుట్టు బయటపడింది. బస్టాండ్‌కు వచ్చిపోయే ప్రయాణికులను పోలీసు అవుట్ పోస్టు నుంచి నిరంతరం పర్యవేక్షించవలసిన వ్యవస్థ లేకపోవడం విడ్డూరం. బూత్ తప్ప అందులో సిబ్బంది లేరు.

కానిస్టేబుల్‌కు చేదు అనుభవం

సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ ఒకరు ఇటీవల నెల్లూరు నుంచి వచ్చి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నారు. వెంటనే అక్కడున్న పోలీసు అవుట్ పోస్టు వద్దకు రాగా, అక్కడ ఎవరూ లేకపోవటంతో ఆర్‌టీసీ భద్రతా దళ సిబ్బందిని సంప్రదించారు. అక్కడున్న మహిళా కానిస్టేబుల్ 'మీరు టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయండ'ని (అక్కడకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది) సలహా ఇచ్చారు. రోజూ వేలాదిమంది రాకపోకలు సాగించే ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నిఘా వ్యవస్థ ఎలా ఉన్నదీ బయట పడింది.

ఇదీ నేటి పరిస్థితి!

విశాఖ నగరం గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణాకు అడ్డాగా మారింది. ఏజెన్సీ నుంచి ఎక్కువమంది ఆర్‌టీసీ బస్ కాంప్లెక్స్‌కు వచ్చి, ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు వెళతారు. పోలీసులకు అందిన పక్కా సమాచారంతో మాటు వేసి గంజాయి రవాణా చేసే వారిని పట్టుకుంటారు. ఇప్పుడు సీసీ కెమేరాలు పనిచేయకపోవడంతో ఎవరు ఏం తెచ్చినా గుర్తించలేని పరిస్థితి నెలకొంది. గతంలో కాంప్లెక్స్‌లోని ప్రతీ ప్లాట్‌ఫారం వద్ద సీసీ కెమేరా ఉండేది. బస్సు ప్రయాణికుల వివరాలు స్పష్టంగా తెలిసేవి. పర్యవేక్షించేందుకు పోలీసు అవుట్ పోస్టులో ఇన్‌చార్జి సహా నలుగురు పోలీసు సిబ్బంది సీసీ కెమేరాలో రికార్డవుతున్న పుటేజీని పోలీసు అవుట్ పోస్టులో ఏర్పాటు చేసిన మోనటరింగ్ సిస్టం ద్వారా గమనించేవారు. ప్రస్తుతం నిర్వహణ లేక సీసీ కెమేరాల కనెక్షన్ల వైర్లు వేలాడుతూ ఉన్నాయి. పోలీసు కమాండ్ కంట్రోల్‌కు చెందిన మరో రెండు సీసీ కెమేరాల పరిస్థితీ ఇంతేనని తెలుస్తోంది. సీసీ కెమేరాలు పనిచేయనందున కొత్తవి ఏర్పాటు చేయాలని డీసీపీ స్థాయి అధికారి నేరుగా ఆర్‌టీసీ రీజనల్ మేనేజర్‌కు లిఖిత పూర్వకంగా కోరినా తక్షణమే స్పందించాల్సింది పోయి, ఇప్పటికీ చర్య తీసుకోకపోవడం గమనార్హం. చేతులు కాలాక ఆకులు పట్టిన చందంగా ఉన్నతాధికారుల తీరు కనిపిస్తోంది.. వెంటనే చర్యలు తీసుకోవాల్సి ఉంది.

గీతా పారాయణం మహత్తర ఔషధం

- చిన్నజీయర్ స్వామి ఉద్బోధ
- ముగిసిన గీతామృత ప్రవచనాలు



ఆహుతులతో సామూహికంగా భగవద్గీత పారాయణం చేయిస్తున్న ఆధ్యాత్మిక ఆచార్యులు త్రిదండి చిన్నజీయర్ స్వామి

సీతమ్మధార, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత సారం తెలుసుకుని ఆచరిస్తే జీవిత రాత మారుతుందని ఆధ్యాత్మిక ఆచార్యులు త్రిదండి చిన్న జీయర్ స్వామి పేర్కొన్నారు. మానవ జీవితానికి మహత్తర ఔషధంలా గీతా పారాయణం పనిచేస్తుందని వివరించారు. వికాస తరంగిణి, వారిజ నిర్వహణలో సీతమ్మధారలోని వర్మ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన గీతా జయంతి వేడుకలు, గీతామృత ప్రవచనాల కార్యక్రమం బుధవారం ముగిసింది. చివరి రోజున చిన్న జీయర్ స్వామి సుమారు అయిదు వేల మందితో సంపూర్ణ భగవద్గీత పారాయణం చేయించారు. గీతా పారాయణ వైభవం, చదవాల్సిన అవసరాన్ని స్వామీజీ వివరించారు. పూర్ణాహుతిసూచికగా భగవద్గీత పారాయణం, హవనంతో శాంతి హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఎంఎస్ఎస్ఆర్ వర్మ, ముడుంబై శ్రీకాంత్, పెద్దసంఖ్యలో యువతీ, యువకులు తదితరులు పాల్గొన్నారు.

29న రెడ్‌క్రాస్ సర్వసభ్య సమావేశం

మహారాణిపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ విశాఖ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 29న నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. జిల్లాకు చెందిన రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులంతా తమ ఆధార్, సభ్యత్వ కార్డులు తీసుకొని 29న ఉదయం 11 గంటలకు ఐఆర్‌పీఎస్ హాల్‌కు హాజరుకావాలని తెలిపారు. 10 మంది సభ్యులతో కూడిన జిల్లా శాఖ కార్యవర్గాన్ని ఎన్నుకుంటామన్నారు. ఈ పది మందిలో చైర్మన్, వైస్ చెర్మన్, కోశాధికారులను ఎన్ను కుంటారని పేర్కొన్నారు. జిల్లా సహకార అధికారి ఎన్నికలు నిర్వహిస్తారు.

కేవీలో ఘనంగా భాషా ఉత్సవ్


కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

అక్కయ్యపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో బుధవారం భారతీయ భాషా ఉత్సవ్ ఘనంగా ముగిసింది. సుప్రసిద్ధ తమిళ కవి సుబ్రహ్మణ్య భారతి జ్ఞాపకార్థం భాషల ద్వారా సమైక్యత అనే అంశంపై జరిగిన ఉత్సవ్ ఈ నెల 4 నుంచి వారంపాటు నిర్వహించారు. భాషల సామరస్యత, సాంకేతికత ద్వారా అనుసంధానం, భాష-సాహిత్యం-భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు, భాష-సమాజం, భాష-సంస్కృతి తదితర అంశాలపై చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జిత్, ఇందిరా నాయర్, హేమలత, కుందన్ లాల్, నాగమణి, పింకి, మణిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు సవరణకు దరఖాస్తుల ఆహ్వానం

డాబాగార్డెన్స్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నియోజకవర్గ పరిధిలో 18 సంవత్సరాలు నిండిన యువత నూతన ఓటు నమోదుకు అర్హులని జీవీఎంసీ జోన్-4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సచివాలయాల్లో కొత్త ఓటరుగా 24లోగా నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారు ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణ, ఫోటో జత చేయాలన్నారు. ఓటరు కార్డులో చిరునామా, ఇతర వివరాల మార్పు కోసం కూడా దరఖాస్తు చేసుకోచ్చని పేర్కొన్నారు. చిరునామా మార్పు కోసం గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుదారు ఇంటికి బీఎల్‌ఓ వెళ్లి విచారణ చేసిన తరువాత ఓటరు గుర్తింపు కార్డును ఇంటర్నెట్ సెంటర్‌లో ప్రింట్ తీసుకోవాల్సి ఉంటుందని తెలియజేశారు.

తుఫాన్ బాధిత రైతులకు సంఘీభావం


రైతు వేషధారి వద్ద సంఘీభావం తెలుపుతున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

అక్కయ్యపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు పోర్టు స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సంఘీభావం తెలిపింది. అధ్యక్షుడు ఎస్.ప్రసాదరావు బిచ్చగాడు వేషధారణలో రైతులకు సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు రైతు భరోసా, రుణమాఫీ, రైతు బీమా పథకాలు అమలు చేస్తున్నప్పటికీ సకాలంలో అందకపోవడంతో వ్యవసాయంలో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఆధునిక పరికరాలను రాయితీతో సమకూర్చి ఆ పంట చేతికి రాగానే సరైన గిట్టుబాటు ధర వచ్చేలా ప్రభుత్వాలు కృషి చేసి వ్యవసాయమే మేలన్న విధంగా ప్రజలకు భరోసా కల్పించాలని కోరారు.

ఆర్పీఎఫ్ సేవలతో ప్రయాణికుడికి ఊరట

విశాఖపట్నం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ అమానత్ సేవల ద్వారా ఆర్పీఎఫ్ సిబ్బంది ప్రయాణికులకు ఊరట కలిగిస్తున్నారు. రైల్లో పొరపాటున విలువైన వస్తువులు విడిచిపెట్టి దిగిపోయిన ప్రయాణికులకు వీరు కొద్ది గంటల్లో తిరిగి అప్పగించడం విశేషం. బుధవారం బ్రహ్మపూర్-విశాఖ (18525) రైల్లో కోచ్ సి-1లో సీటు నంబరు 67 వద్ద సుమారు రూ.50 వేల విలువైన వస్తువులతో సంచిని విడిచిపెట్టి దిగిపోయినట్లు ఓ ప్రయాణికుడి నుంచి ఫిర్యాదు అందింది. వెంటనే ఆర్పీఎఫ్ అప్రమత్తమై రైలు కొత్తవలస చేరిన వెంటనే సి-1 కోచ్‌లోకి వెళ్లి తనిఖీ చేయగా సంచి దొరికింది. ఈ సమాచారాన్ని ఫిర్యాదుదారుకు అందించారు. కొత్తవలస స్టేషన్‌కు చేరుకున్న ఫిర్యాదుదారుని ఆర్పీఎఫ్ కార్యాలయ కమాండెంట్ విచారించి తగిన ఆధారాలు సమర్పించడంతో సంచిని తిరిగి అప్పగించారు.

ఖండకావ్యం భాషకు అలంకారం



సమావేశంలో మాట్లాడుతున్న రచయిత చిన సూర్యనారాయణ

సీతంపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఖండకావ్యం పూర్తిగా ఆధునిక ప్రక్రియ.. కల్పితం లేదా కల్పితం కానిది గానీ విషయాన్ని వస్తువుగా తీసుకొని అష్టాదశ వర్ణనలతో జనరంజకంగా రాసే ప్రక్రియను ఖండకావ్యం అంటారని రచయిత సీహెచ్ చిన సూర్యనారాయణ పేర్కొన్నారు. పరిమిత పద్యాలతో ఒక వర్ణాంశమో, సంఘటన లేదా కథను చెబుతారని ఆయన విశ్లేషించారు. సీతంపేట రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు శేఖర్‌మంత్రి ప్రభాకర్ అధ్యక్షతన 'తెలుగులో ఖండ కావ్యాలు' అనే అంశంపై బుధవారం చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి వక్తగా విచ్చేసిన చిన సూర్యనారాయణ మాట్లాడుతూ మహాకావ్యం లక్షణాలు, ఖండకావ్యం అంశాలను వివరించారు. ప్రసంగాన్ని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డి.వి. సూర్యారావు సమీక్షించారు. డాక్టర్ కె.వి.ఎస్ మూర్తి, భాగవతుల సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

రైతుబజార్‌లో గోసంచారం

సీతమ్మధార, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార రైతుబజార్ లోపలకు ఆవులు వస్తుండటంతో కూరగాయల విక్రయదారులు ఇబ్బంది పడుతున్నారు. రైతుల గంపలు, కొనుగోలుదారుల సంచిలో ఉండే కూరగాయలను ఒక్క ఉదుటన తినడంతో ఏమీ చేయలేకపోతున్నారు. ఆవరణలోకి ఆవులు రాకుండా చూడాలని కొనుగోలుదారులు కోరుతున్నారు.

వెనుకబడి

... 5వ పేజీ తరువాయి

వెనుకబడ్డారు. వీటన్నింటినీ గత ప్రభుత్వం గాలికొదిలేసింది. దీంతో పాఠశాల విద్య గాడితప్పింది. దీని ఫలితమే స్టార్ రేటింగ్‌లో వెనుకబడ్డామని పలువురు టీచర్లు అభిప్రాయపడుతున్నారు. చివరకు 3-స్టార్ రేటింగ్ వచ్చిన పాఠశాలల్లో కూడా అత్యధికం ప్రాథమిక పాఠశాలలేనని, ఉన్నత పాఠశాలలు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. గత పాలకులు మాతృభాషలో బోధన, టీచర్ల నియామకాలపై నిర్లక్ష్యం చూపారని సీనియర్ హెచ్ఎం ఒకరు అన్నారు. ప్రధానంగా యాప్‌లతో టీచర్లను వేధించడానికి వారికి సరిపోయిందని, దాంతో బోధన గాడి తప్పిందన్నారు.

☛ సంక్షిప్తంగా..

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు ప్రశంసనీయం

» ఏయూ వీసీ శశిభూషణరావు



మాట్లాడుతున్న వీసీ శశిభూషణరావు

వెంకోజీపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఏయూ పరిధిలోని జాతీయ సేవా పథక కార్యకర్తల సేవలు ప్రశంసనీయమని ఏయూ వీసీ జి.శశిభూషణరావు అన్నారు. ఏయూ ఈసీ హాలులో వర్సిటీకి జాతీయ సేవా పథక విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన యూనివర్సిటీ జాతీయ సేవా పథక సలహా కమిటీ వార్షిక సమావేశంలో ఆయన అధ్యక్ష ఉపన్యాసం చేశారు. వలంటీర్లు కేంద్ర ప్రభుత్వ పథకాలైన జై భారత్, వికసిత్ భారత్, ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్, స్వచ్ఛ భారత్ తదితర కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. 2022-23, 2023-24 సంవత్సరాల్లో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాల వివరాలను పవర్ పాయింట్ సహాయంతో యూనివర్సిటీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరినాథ్ వివరించారు. తెలుగు రాష్ట్రాల్లో జాతీయ సేవా పథక కార్యక్రమాలలో ఏయూ జాతీయ సేవా పథక విభాగం ముందుందని ఎన్ఎస్ఎస్ ప్రాంతీయ సంచాలకులు ఎం.రామకృష్ణ అన్నారు. మరిన్ని వినూత్న కార్యక్రమాలతో ఎన్ఎస్ఎస్ విభాగం పని చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో జాతీయ సేవా పథక పూర్వ రాష్ట్ర అధికారి డాక్టర్ పి.రామచంద్రరావు, ఏయూ రెక్టార్ ఎన్.కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

» ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు



మాట్లాడుతున్న దామోదరరావు

కూర్మన్నపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ఎంప్లాయీస్ యూనియన్ ధ్యేయమని రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. బుధవారం స్టీల్ సిటీ ఆర్టీసీ డిపోలో ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది డిపోల ఈయూ కార్మికుల సమావేశంలో మాట్లాడారు. ఖాళీగా ఉన్న పోస్టులను ప్రభుత్వం తక్షణమే భర్తీ చేయాలని, పదోన్నతులకు మోక్షం కల్పించాలని, సిబ్బందికి నైట్‌అవుట్, ట్రావెలింగ్, ఓటీ అలవెన్స్‌లను చెల్లించాలని, ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను అమలు చేయాలని కోరారు. తప్పు చేయకుండా కార్మికులను అధికారులు వేధిస్తే ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈయూ డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి.భానుమూర్తి కారుణ్య నియామకాలను తక్షణమే చేపట్టాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి నందమూరి రామారావు, శుభకర్, కృష్ణమూర్తి, తాతలు, నారాయణ, పద్మ, మూర్తి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● పుష్ప-2 : జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య సంగం, శరత్, మెలోడీ, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 50, టమాటా 26, వంకాయలు (తెలుపు)28, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 20, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 34, బీరకాయలు 38, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 20, క్యారెట్ 68 దొండకాయలు 30, బంగాళ దుంపలు 33, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 120, అల్లం (పాతది)56, బరబాటి 20, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 55, గోరుచిక్కుడు 24 దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 300, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, పొటల్స్ 44, కీరదోస 28, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 50, కొండఉసిరి 50, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామ కాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	620
విజయనగరం	624
శ్రీకాకుళం	624

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	93
ఫారం ధర	113
విత్ స్కిన్	196
స్కిన్‌లెస్	206

22వ వార్డు కంపు కంపు

» గెడ్డల్లో పూడికలు తీయని పారిశుధ్య సిబ్బంది
» పట్టించుకోని అధికారులు
» దుర్వాసన, దోమలతో ప్రజల ఇబ్బందులు



మంగాపురంకాలనీ గెడ్డలో పేరుకుపోయిన రాళ్లురప్పలు, పూడికలు

మద్దిలపాలెం, డిసెంబరు 11 : జీవీఎంసీ 22వ వార్డులో పారిశుధ్య నిర్వహణ నిర్లక్ష్యానికి ప్రతిరూపంగా మారింది. ఈ ప్రాంతంలో గెడ్డలు మురికికూపాలుగా తయారయ్యాయి. పారిశుధ్య సిబ్బంది నెల తరబడి పూడికలు తొలగించకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోతోంది. ఇక మురికి కాల్వల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. ఎక్కడికక్కడే చెత్త నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఫలితంగా 22వ వార్డు కంపులో కొట్టుమిట్టాడుతోంది.

ఈ వార్డులోని మురుగు నీరు సముద్రంలో కలవడానికి ఇక్కడ ప్రధానంగా ఆరు గెడ్డలు ఉన్నాయి. పిఠాపురం కాలనీ, పీతలవానిపాలెం, మంగాపురం కాలనీ, బలరాంనగర్, రేసపువానిపాలెం మీదుగా ఈ గెడ్డలు ప్రవహిస్తుంటాయి. ఎగువ ప్రాంతాలైన మద్దిలపాలెం, సత్యం జంక్షన్ నుంచి వచ్చే మురుగు నీటితో పాటు వార్డులోని పలు ప్రాంతాల వాడుక నీరు ఆయా గెడ్డల ద్వారా సముద్రంలో కలుస్తోంది. అయితే ఈ గెడ్డల్లో ఎన్నో నెలల నుంచి పూడికలు తొలగించకపోవడంతో గుట్టల కొద్దీ చెత్తాచెదారం పేరుకుపోయి ఎక్కడికక్కడే మురుగునీరు నిలిచిపోతోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

నెలల తరబడి తొలగించని పూడిక

సాధారణంగా రెండు, మూడు నెలలకోసారి చిన్న జేసీబీలతో గెడ్డల్లో చెత్తను తొలిగిస్తుంటారు. అయితే 22వ వార్డులో మాత్రం ఆరు నెలల పైబడినా గెడ్డల్లో పూడికలు తొలగించడమే లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన చెత్తచెదారంతో మరింత అధ్వానంగా పరిస్థితి తయారైంది. గెడ్డల పక్కన ఏరియాలు మురికికూపాలుగా మారిపోయాయి. గెడ్డల పక్క నుంచి వెళితే చాలు కంపుతో ముక్కు పుటలు అదిరిపోతున్నాయి. గెడ్డలు, కాలువల్లో ఇలాంటి పరిస్థితి నెలకొనడంతో ఎలాగూ దోమల వృద్ధిని అరికట్టలేమన్న ఉద్దేశంతో ఏమో ఫాగింగ్ వంటి చర్యలు చేపట్టడం లేదు.



పీతలవానిపాలెం గెడ్డలో నిలిచిన మురుగు నీరు



పిఠాపురంకాలనీ గెడ్డలో పేరుకుపోయిన చెత్తాచెదారం

విధులకు 30 మందే హాజరు

ఈ 22వ వార్డులో పారిశుధ్య కార్మికులు సరిగా విధులు నిర్వహించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. రోజు వారీ పారిశుధ్య పనులకు 64 మంది కార్మికులు ఉన్నా.. హాజరయ్యేది మాత్రం ఇరవై ముప్పైమందేనని పలువురు అంటున్నారు. మిగతా వారు విధుల్లోకి రాకపోయినామస్తరు (హాజరు) వేసి ఎంచక్కా వేతనాలు తీసుకొంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగా వార్డులో శానిటేషన్ దారుణంగా తయారైందని స్థానికులు చెబుతున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి పారిశుధ్య నిర్వహణలో సరిదిద్ది, సమస్య పరిష్కారానికి పటిష్ఠ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మోటారు కార్మికుల భద్రతకు సంక్షేమ బోర్డు అవసరం

» విశాఖ జిల్లా మోటారు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి ఎస్కే రెహమాన్



సమావేశంలో మాట్లాడుతున్న రెహమాన్

ఆరిలోవ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మోటారు కార్మికులకు భద్రతతో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని విశాఖ జిల్లా మోటారు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి ఎస్కే. రెహమాన్ కోరారు. బుధవారం హనుమంతవాక జంక్షన్ వద్ద గల ముడసర్లోవ పార్కులో టాటా మ్యాక్సీ డ్రైవర్ల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం మోటారు రంగ కార్మికులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతోందని విమర్శించారు. కొత్త జీవోలను తెస్తూ ఆర్టీఏ, ట్రాఫిక్ పోలీసుల ద్వారా ఎడాపెడా జరిమానాలు వసూలు చేయడం, కేసులు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా మోటారు రంగంపై ఆంక్షలు విధించడం, ఈ రంగాన్ని ఆదాయ వనరు మార్గంగానే చూస్తోంది తప్ప కార్మికుల సంక్షేమం గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదో ఓ కొత్త పేరుతో పెట్టి ట్యాక్స్‌లు, జరిమానాలు విధించడం పరిపాటిగా మారిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడి వారి సంక్షేమానికి అవసరమైన విధానలు రూపొందించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడు పాండురంగ, అధ్యక్షుడు కనకరాజు, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, కార్యదర్శి గోవింద్, జాయింట్ సెక్రటరీ రవిశంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరంజీవి, కోశాధికారి అప్పలరాజు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా అభియాన్ ఏసీఎంవోగా దేముడుబాబు



దేముడుబాబుకు అభినందిస్తున్న సంఘ నేతలు

విశాఖపట్నం: డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టులో అసిస్టెంట్ కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్(ఏసీఎంవో)గా పైల దేముడుబాబు నియమితులయ్యారు. ఈ మేరకు సమగ్రశిక్షా అభియాన్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. దేముడుబాబు చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు బుధవారం ఏసీఎంవోగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు తీసుకున్న దేముడుబాబుకు ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ. పైడిరాజు, ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రతినిధి ఎంవీ కృష్ణకుమార్ తదితరులు అభినందించారు.

వికసిత్ భారత్‌లో యువతదే ప్రధాన భూమిక



వికసిత్ భారత్‌లో పాల్గొన్న ఆచార్య అజిత్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆరిలోవ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : భారతదేశం 2047 నాటికి వికసిత్ భారత్‌గా రూపొందాలంటే ముందుగా యువత తమలక్ష్యాలను నిర్దేశించుకొని, విజయం సాధించాలని ఆచార్య అజిత్‌కుమార్ అన్నారు. బుధవారం శ్రీకృష్ణాపురం అంబేద్కర్ గురుకులో నిర్వహించిన వికసిత్ భారత్-2027 కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ గురుకులాల సమన్వయకర్త ఎస్.రూపవతి అధ్యక్షతను జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్య వైద్యం, రక్షణ, వ్యవసాయం తదతర రంగాల్లో యువతను ప్రోత్సహించాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఈ దేశ ఆశయాలు, లక్ష్యాలు నెరవేర్చే దిశగా ప్రయత్నిస్తున్నారని, ఆయన అంచనాలకు తగినట్టుగా మనం పని చేయాలని సూచించారు. మహిళా సాధికారత దేశానికి అత్యంత అవసరమన్నారు. అనంతరం రూపవతి మాట్లాడుతూ యువత సమయాన్ని వృథా చేసుకోరాదని సూచించారు. ప్రతి నిమిషం తన కోసం, దేశం కోసం ఆలోచిస్తూ పని చేయాలని సూచించారు. అంతకుముందు వికసిత్ భారత్‌పై విద్యార్థులకు వ్యాస రచన పోటీ నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి

పెదవాల్తేరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 21వ వార్డుకు చెందిన టీడీపీ యువ నాయకుడు ఎ.సురేష్ స్మృత్యర్థం కుటుంబ సభ్యులు, స్నేహితుల ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంకు సిబ్బంది 73 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో 20వ వార్డు కార్పొరేటర్ ముప్పల లక్ష్మి సురేష్, టీడీపీ 21వ వార్డు అధ్యక్షుడు పీతల అమరేంద్ర, నేతలు పి.అవినాశ్, జి.మూర్తి, గోల్డెన్ స్టార్స్ కల్చర్ క్లబ్, నేతాజీ స్ట్రీట్ కల్చర్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా శ్రీప్రకాశ్ విద్యానికేతన్ వార్షికోత్సవం



యంగ్ స్మైల్స్ పత్రికను ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథులు

సిరిపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : శ్రీప్రకాష్ విద్యానికేతన్ 23వ వార్షికోత్సవం (ఆరోమా 2024-25)ను సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ గణిత శాస్త్రవేత్త డా.సుధాకర్ సి.అగార్కర్, కంకటాల సీఎండీ కంకటాల మల్లికార్జునరావు, వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేష్, ప్రొఫెసర్ డా.రాబిన్ గ్రోవ్స్, ప్రముఖ స్టోరీ టెల్లర్ బొంగిస్వా కోట్ట, శ్రీప్రకాష్ విద్యానికేతన్ డైరెక్టర్ చిట్టూరి వాసు ప్రకాష్ హాజరై జ్యోతి ప్రజ్వలనగావించి సంబరాలను ప్రారంభించారు. అనందరం వక్తలు మాట్లాడుతూ చదువుతో పాటు అన్ని అంశాల్లోనూ విద్యార్థులు ప్రతిభావంతంగా రాణించాలని అభిలషించారు. విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాత్రే కీలకమన్నారు. తదుపరి సభ ప్రాంగణంలో విద్యార్థులు తమ సృజనాత్మకతతో రూపొందించిన ఆర్ట్ గ్యాలరీలో చిత్రకళ, పేపర్ ఆర్ట్, విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలో శాస్త్ర విజ్ఞానంతో తయారైన వివిధ నమూనాలు ఆకట్టుకున్నాయి. సింహాచలం పుణ్యక్షేత్ర వైభవాన్ని 100 చిత్రాలతో కూడిన పెయింటింగ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో భాగంగా యంగ్ స్మైల్స్ పత్రికను ఆవిష్కరించారు.

కేంద్ర కారాగారానికి మరో డిప్యూటీ సూపరింటెండెంట్

ఆరిలోవ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విశాఖ కేంద్రకారాగారానికి బుధవారం మరో డిప్యూటి సూపరింటెండెంట్‌గా సూర్యకుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ విషయాన్ని జైలు వర్గాలు ధ్రువీకరించాయి. ఈయన రాజమండ్రి కేంద్ర కారాగారం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. కాగా ఇప్పటికే కేంద్ర కారాగారం డిప్యూటి సూపరింటెండెంట్లుగా ఇద్దరు ఉన్నారు. తాజాగా సూర్యకుమార్ రాకతో సూపరింటెండెంట్ల సంఖ్య మూడుకు చేరింది. కాగా, ముగ్గురు డిప్యూటీ సూపరింటెండెంట్లు ఉండడంతో కాస్త పని భారం తగ్గి మెరుగైన పనితీరుకు అవకాశం ఉంటుందని జైలు వర్గాలు పేర్కొంటున్నాయి.

ఉత్కల్ సమాజ్ ఆలయ ప్రాంగణంలో శ్రీగీతా జయంతి



శ్రీగీతా హోమంలో పాల్గొన్న భక్తులు

సిరిపురం, (ఆంధ్రజ్యోతి) డిసెంబరు 11 : సిరిపురం ఉత్కల్ సమాజ్ దేవాలయం ప్రాంగణంలో శ్రీగీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో బుధవారం శ్రీగీతా జయంతి ముగింపు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీగీతా ప్రచార సమితి సభ్యులు సామూహికంగా సంపూర్ణ గీతా పారాయణం గీతా హోమంతో నిర్వహించారు. అనంతరం గీతా జయంతి ఉత్సవంలో పాల్గొన్న భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షులు పి.జగన్‌మోహన్‌రావు, ఎంవీ రాజశేఖర్, కార్యదర్శి ఎం.వనజాదేవి, కోశాధికారి జీవీఆర్ ప్రసాద్, జి.లక్ష్మీనరసింహ, ఎస్.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

దమన్‌జోడి, జగదల్‌పూర్ సెక్షన్‌లో రైల్వే జీఎం పర్యటన



పనులు పర్యవేక్షించి అధికారులకు సూచనలు ఇస్తున్న రైల్వే జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్

విశాఖపట్నం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వాల్తేరుడివిజన్ పరిధిలోని దమన్‌జోడి-జగదల్‌పూర్ సెక్షన్‌లో తూర్పుకోస్తా రైల్వే మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ బుధవారం తనిఖీలు చేశారు.సెక్షన్‌లో జరుగుతున్న మౌలిక సదుపాయాల ప్రాజెక్టు పనులు, ట్రాఫిక్ నిర్వహణ తీరును పరిశీలించారు. కార్గో రవాణా మరింత మెరుగుపరచడానికి చేపట్టాల్సిన పనులపై సంబంధిత అధికారులతో చర్చించారు. కొనసాగుతున్న ప్రాజెక్టుల పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. నెల్కో-దమన్‌జోడి మార్గంలోని రైల్వే సైడింగ్, జరతి వద్ద టన్నెల్స్, అమ్మగుర వద్ద టేకాఫ్ పాయింట్లను తనిఖీ చేశారు. అనంతరం వివిధ స్టేషన్లలోని ప్రయాణికులు, సిబ్బందికి కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించి సౌకర్యాల మెరుగుకు ప్రణాళిక రూపొందించి కార్యాచరణపై దృష్టి సారించాలని ఆదేశించారు. అక్కడ నుంచి విండో ట్రైలింగ్ ద్వారా డబ్లింగ్ పనులు, మలుపులు, వంతెనలు, సొరంగాలను నిశితంగా పరిశీలించి భద్రతా నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. పర్యటనలో డీఆర్ఎంమనోజ్‌కుమార్ సాహు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల క్రీడలు అభినందనీయం

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సమాజ సేవలో నిరంతరం తీవ్ర ఒత్తిడికి లోనయ్యే జర్నలిస్టులు క్రీడా పోటీలు నిర్వహించుకోవడం అభినందనీయమని ఏపీ ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఛైర్మన్, ఉపకార ట్రస్టు అధినేత కంచర్ల అచ్యుతరావు పేర్కొన్నారు. ఈ నెల 16 నుంచి 22 వరకు ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో విశాఖ మీడియా క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్, ట్రోఫీలను కంచర్ల ఎంవీపీ కాలనీలోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల పాటు మీడియా మిత్రులు పోటీలు నిర్వహించుకోవడం వలన వారిలో క్రీడా స్ఫూర్తి పెరగడంతో పాటు శారీరక దేహదారుఢ్యం మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు నాయకులు జి.శ్రీనుబాబు, నిర్వాహకులు గురుప్రసాద్, మదన్, ఈశ్వరరావు, కళాకారులు గెంబలి జగదీష్, నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో భారత్ భాషా ఉత్సవ్



ఉత్సవ్‌లో పాల్గొన్న ఆచార్యులు

వెంకోజీపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఏయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లా కళాశాలలో బుధవారం భారతీయ భాషా ఉత్సవ్ ఉత్సవాలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.సీతామాణిక్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు ఎస్‌బీ చంద్రకళ, ఎ.పద్మావతి, టి.నాగభూషణం, తదితరులతోపాటు విద్యార్థులు, సహాయక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. డిజిటల్ స్పేస్‌లలో భారతీయ భాషలను ప్రోత్సహించడం, భారతీయ భాషల ద్వారా ఆవిష్కరణలు, పరిశోధనలను ప్రోత్సహించడం, బహుభాషా సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంగాలు, పాటలు ఆటలు, వినోద కార్యక్రమాలు, పొడుపు కథలు, వివిధ భాషల్లో చలనచిత్ర ప్రదర్శనలు వంటి కార్యక్రమాల సూచిక జాబితా వంటివి ఈ ఉత్సవాల్లో నిర్వహించారు.

మిద్దె తోటలతో ఆరోగ్యకర ఆహారం



మిద్దె తోటల ప్రాధాన్యాన్ని వివరిస్తున్న విద్యార్థులు, నవీన్‌కుమార్

వెంకోజీపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మిద్దె తోటల ద్వారా ఆరోగ్యకర ఆహారం లభిస్తుందని సెవెంత్ డే అడ్వెంటిస్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ అన్నారు. బుధవారం ఎంవీపీ కాలనీలోని సెవెంత్ డె అడ్వెంటిస్ట్ స్కూల్ ప్యూస్ ఎన్జీవో కో-ఆర్డినేటర్ జె.రాజేశ్వరి నేతృత్వంలో కూరగాయల మొక్కలు నాటిన అనంతరం ఆయన మాట్లాడారు. మిద్దె తోటల మీద విద్యార్థులకు అవగాహన అవసరమన్నారు. ప్రకృతి ఆధారిత పంటలు ఎప్పుడూ ఆరోగ్యకరం అని పేర్కొన్నారు. ఇళ్ల పై కప్పు, ఇంటి పరిసరాలు, బాల్కనీలు, విద్యా సంస్థల్లో కూరగాయల తోటలు అధికంగా పెంచాలని కోరారు.

సంస్థ అధ్యాపకురాలు జాస్లిన్ విప్పర్తి మాట్లాడుతూ ప్రకృతి ఆధారిత పంటలు పండించే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై కప్పు మీద తోటలు పెంచాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయ మొక్కలు పెంచుకోవచ్చు అనే విషయం ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. రసాయనాలు, ఎరువులు, రసాయన, క్రిమి సంహారకాలు వినియోగించకుండా పంటలు పండించాలని కోరారు. కార్యక్రమంలో గ్రీన్ వాలంటీర్ జె.రవితేజ పాల్గొన్నారు.

కొత్త పీఎస్‌లో అందుబాటులోకి సేవలు



నూతన పోలీస్‌స్టేషన్ భవనంలో సీఐ మల్లేశ్వరరావు, సిబ్బంది

ఆరిలోవ, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి) : విమ్స్ ఆస్పత్రి ప్రాంగణంలో గత ఆదివారం రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ప్రారంభించిన ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కార్యకలాపాలు ప్రారంభించినట్టు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. కొన్ని పనులు చేపట్టిన తర్వాత బుధవారం నుంచి ఇక్కడ పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి వచ్చినట్టు సీఐ వెల్లడించారు. ఈ సందర్భంగా వేద పండితులతో పూజలు చేయించారు. ఆశీర్వచనాలు స్వీకరించారు. ఇకపై ఇక్కడే తాను, తమ సిబ్బంది అందుబాటులో ఉంటామన్నారు. కాగా, ఆరిలోవ పాత పోలీసు స్టేషన్‌ను ఔట్ పోలీస్ స్టేషన్‌గా వినియోగించనున్నట్టు తెలిపారు. ఈ పోలీసు స్టేషన్‌లో ఒక హెడ్ కానిస్టేబుల్, ఒక కానిస్టేబుల్ ఉంటారని చెప్పారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా గంజాయి, మాదక ద్రవ్యాలు సేవించేవార ఉంటారని, అలాగే కొట్లాటలు, భార్యభర్తల తగాదాలు ఉంటాయని, అందుకే అక్కడ నిఘా ఉంచడం జరుగుతుందన్నారు.

వైసీపీ కార్యాలయం ప్రారంభం



పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్

మద్దిలపాలెం, డిసెంబరు 11 : మద్దిలపాలెం కృష్ణా కళాశాల రోడ్డులో బుధవారం వైసీపీ కార్యాలయాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీకి పూర్వ వైభవం తీసుకురావడానికి కార్యకర్తలందరూ సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సూపర్ సిక్స్ హామీలతో ఎన్నికలకు వెళ్లిన కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక పథకాలను పక్కన పెట్టేశాయన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే విధంగా వైసీపీ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, అదీప్‌రాజు, వాసుపల్లి గణేష్‌కుమార్, చింతలపూడి వెంకట్రామయ్య, పలువురు కార్పొరేటర్లు, నేతలు పాల్గొన్నారు.

దివ్యాంగుల క్రికెట్ విజేత తూర్పుగోదావరి

» ద్వితీయ, తృతీయ స్థానాల్లో విశాఖ, విజయనగరం జట్లు

గాజువాక, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జింక్ మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి దివ్యాంగుల క్రికెట్ పోటీలు బుధవారంతో ముగిశాయి. తూర్పుగోదావరి జట్టు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విశాఖ, విజయనగరం జట్లు నిలిచాయి. విజేతలకు న్యూపోర్టు సీఐ దాలిబాబు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని కోరారు. బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ క్రీడలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇస్తున్నాయన్నారు. దివ్యాంగులు క్రీడా స్ఫూర్తితో మెలగడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వినోద్ బాలు, గూటూరు శంకరరావు, బాటా శ్రీనివాస్, వెంకట్, స్వరూప్, తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కణితి మార్గంలోని ఒక తోటలో ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. గాజువాక కర్ణవానిపాలెం ప్రాంతానికి చెందిన గుంటూరు అప్పలరాజు (52) క్రేన్ ఆపరేటర్. బుధవారం కణితి చెక్‌పోస్టు ప్రాంతంలోని ఓ తోటలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మార్గంలో వస్తున్న ఓ ఆటో డ్రైవర్ ఇది గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కాగా అప్పలరాజు బాధ్యతారాహిత్యంగా ఉంటాడని, మూడు రోజుల క్రితం తన తల్లి చనిపోయినా వెళ్లలేదని పోలీసులకు మృతుని కుటుంబ సభ్యులు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్టాండింగ్ కౌన్సిల్ కొనసాగింపునకు నో

... 5వ పేజీ తరువాయి

వసూలుచేసి ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. టీడీపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ గాజువాకలో ఏళ్లుగా పని చేస్తున్న ఉద్యోగి ఒకరు ఇటీవల తన తమ్ముడికి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం వేయించుకున్నారని, కరోనాలో చనిపోయిన వారికి ఇంతవరకూ ఉద్యోగాలు ఇవ్వలేదని దీనిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. దీనికి కమిషనర్ పి.సంపత్‌కుమార్ బదులిస్తూ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జాబితా, వారు ఉద్యోగంలోకి చేరిన తేదీతో కూడిన వివరాలను సభ్యులందరికీ వచ్చే కౌన్సిల్ నాటికి అందజేస్తామన్నారు. జీవీఎంసీకి చెందిన క్రీడా ప్రాంగణాల్లో సాధన చేసే క్రీడాకారుల నుంచి వసూలుచేసే ఫీజులు పెంచే ప్రతిపాదనపై 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు అభ్యంతరం వ్యక్తంచేశారు. రూ.25 కోట్లు ఖర్చు పెట్టి జీవీఎంసీ నిర్మిస్తే, అధికారులు దొంగచాటుగా అస్మదీయుడైన వ్యక్తికి స్టేడియం అప్పగించేశారని ఆరోపించారు. సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు మాట్లాడుతూ జీవీఎంసీ క్రీడా ప్రాంగణాల నిర్వహణకు కార్యాచరణ రూపొందించేందుకు కార్పొరేటర్లు, క్రీడాకారులు, క్రీడా సంఘాలతో ఒక కమిటీని నియమించాలని కోరగామేయర్ అంగీకరించారు. కౌన్సిల్‌లో తీర్మానాలు చేసి చేతులు దులిపేసుకుంటున్నారు తప్ప, వాటిని అమలుచేయడంలో విఫలమవుతున్నారంటూ 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ అసంతృప్తి వ్యక్తంచేశారు. నైట్ ఫుడ్‌కోర్టు తరలింపు, చైన్‌మెన్ వ్యవస్థ రద్దుపై నిర్ణయం తీసుకుని ఏడాది గడిచినా ఇప్పటికీ కొనసాగుతుండడమే అందుకు నిదర్శనమన్నారు. దీనిపై కమిషనర్ కలుగజేసుకుని చైన్‌మెన్‌ను కార్యాలయాల్లో అటెండర్లుగా వినియోగించుకోవాలని సీసీపీ ప్రభాకరరావును ఆదేశించారు. కార్పొరేటర్ల స్టడీ టూర్‌కు ఏజెంట్‌గా వ్యవహరించిన వ్యక్తికి రూ.1.39 కోట్లు బిల్లు చెల్లించే అంశంపై కార్పొరేటర్లు మహ్మద్ సాదిక్, మహ్మద్‌ఇమ్రాన్, ఉరుకూటి చంద్రరావు తదితరులు అభ్యంతరం తెలిపారు. స్టడీ టూర్‌కు వెళ్లినవారంతా ఏం అధ్యయనం చేశారో తెలపాలని సీపీఎం కార్పొరేటర్ గంగారావు డిమాండ్ చేశారు. స్టడీటూర్‌లో బెంగళూరులోని చెత్తవిభజన ప్లాంట్ ను సందర్శించామని అలాంటి ప్రాజెక్టు విశాఖలో ఉండాలని, గోవాబీచ్ తరహాలో విశాఖ బీచ్‌లో కూడా రక్షణగార్డులను ఏర్పాటుచేయాలని సీపీఐ కార్పొరేటర్ ఏజే స్టాలిన్ కోరారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ సెక్రటరీ ఆధ్వర్యంలో రిపోర్టు తయారవుతోందని, వచ్చే కౌన్సిల్‌లో దీనిపై నివేదిక ఇస్తామన్నారు.

ఎండాడ నుంచి రుషికొండ, సూర్య ప్రైస్ వద్ద నుంచి కొమ్మాది వరకూ నిర్మించిన మాస్టర్ ప్లాన్ రోడ్డులో స్థలం కోల్పోయిన వారికి టీడీఆర్‌కు బదులుగా రూ.పది కోట్లు నగదు పరిహారం ఇవ్వాలనే ప్రతిపాదనను సభ్యులంతా మూకుమ్మడికిగా తిరస్కరించారు. ఇలా నగదు పరిహారం ఇస్తే జీవీఎంసీ ఆర్థికంగా సంక్షోభంలో కూరుకుపోతుందని ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికే అప్పగిస్తూ తీర్మానం చేసి పంపించాలని నిర్ణయించారు. సింహాచలం బీఆర్‌టీఎస్ రోడ్డులో స్థలాలు కోల్పోయిన వారికి టీడీఆర్ ఇవ్వాలని, అక్కడి కార్పొరేటర్ ఫ్లెక్సీ పట్టుకుని మేయర్ ముందుకు వెళ్లి నిలబడగా, అక్కడ ఎవరికీ టైటిల్ లేదని, రాష్ట్రప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా ఆదేశాలు వస్తేనే తప్ప ఏమీ చేయలేమని కమిషనర్ స్పష్టంచేశారు. గత పదేళ్లలో జీవీఎంసీ పరిధిలో 1035 టీడీఆర్‌లు జారీచేశారని వాటిలో చాలావరకూ అక్రమాలు ఉన్నాయని కార్పొరేటర్ మూర్తియాదవ్ ఆరోపించగా, టీడీఆర్‌ల వివరాలను సభ్యులందరికీ అందజేస్తామని ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపొచ్చని కమిషనర్ సూచించారు. ఎమ్మెల్సీ వరుదు కళ్యాణికి జీవీఎంసీ కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యేందుకు అర్హత లేదని, ఆమెను ఎలా అనుమతిస్తున్నారని మూర్తియాదవ్ మేయర్‌ను ప్రశ్నించారు. దీనిపై అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మేయర్ హామీ ఇచ్చారు. క్లాప్ వాహనాలకు లోడర్లుగా 656 మందిని రోజువారీ వేతనంపై తీసుకున్నప్పటికీ కాంట్రాక్టర్ సరిగా మనుషులను పెట్టడంలేదని, బిల్లు మాత్రం తీసుకుంటున్నారని కార్పొరేటర్లు శరగడం రాజశేఖర్, గల్లా పోలిపల్లి, గాడు చిన్నికుమారి, గంకల కవిత, తదితరులు ఆరోపించారు. కాంట్రాక్టర్ బిల్లు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. దీనికి కమిషనర్ బదులిస్తూ కార్మికుల వేతనాలు ఆపడం సరికాదని, కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని హామీ ఇచ్చారు. గాజువాక హౌస్ కమిటీ సమస్య చాలాకాలంగా పెండింగ్ ఉందని అక్కడ భవన నిర్మాణాలకు అనుమతివ్వాలని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మేయర్‌ను కోరారు. దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ మాట్లాడుతూ తన నియోజకవర్గం పరిధిలో జీవీఎంసీ నైట్‌షెల్టర్ల నిర్వహణ దారుణంగా ఉందని, గంజాయి వినియోగం కూడా పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తంచేశారు. సమావేశానికి పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు హాజరయ్యారు.

మార్గశిర ఉత్సవాల్లో పోలీస్ పెత్తనం

... 5వ పేజీ తరువాయి

లాక్కొని వారే అమ్మవారికి చూపించి ఇస్తున్నారు. సన్నిధిలో దేవదాయ శాఖ సిబ్బంది ఉండి భక్తులను త్వరగా బయటకు పంపాలి. కానీ ఇక్కడ పోలీసులే ఆ పని చేస్తున్నారు. దేవదాయ శాఖ అధికారులు కూడా వారి చర్యలను ప్రశ్నించలేకపోతున్నారు. పోలీసులకు భోజనం కోసం ఈ ఏడాది ప్రత్యేకంగా మెస్ నిర్వహించడం మరో విశేషం.

అమలు కాని తీర్మానాలు

కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన ఉత్సవంపై సమావేశం అన్ని శాఖల అధికారులతో నిర్వహించినప్పుడు ఏమేమి చేయాలో తీర్మానాలు చేశారు. వాటిని ఏ శాఖ అమలు చేయాలో కూడా సూచించారు. వాటిలో కీలకమైనవి అమలు కావడం లేదు.

- భక్తులు ఆలయంలోకి ప్రవేశించడానికి ఒక మార్గం, బయటకు వెళ్లడానికి మరో మార్గం ఉండాలని సూచించారు. ప్రధాన రహదారి ఆర్చి నుంచి భక్తులు ప్రవేశించి, ఘోషాసుపత్రి వైపు బయటకు వెళ్లేలా చూడాలని తీర్మానించారు. కానీ దీనిని పోలీసులు అమలు చేయడం లేదు. భక్తులు ఏ మార్గంలో ఆలయం వైపు వస్తున్నారో.. అదే మార్గంలో బయటకు వెళుతున్నారు.
- ఆలయ మార్గంలో క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నందున ఇరు వైపులా దుకాణాల వారిని వెనక్కి జరపాలని సూచించారు. ఈ బాధ్యత జీవీఎంసీ, పోలీస్ శాఖలకు అప్పగించారు. దుకాణాలను వెనక్కి జరపలేదు. వారు మరింత ముందుకువచ్చి రోడ్డుపై జంగిళ్లు పెడుతున్నా వారించడం లేదు.
- ఆలయ మార్గంలో కాలువలు వెంటనే పరిశుభ్రం చేయాలని, అవసరమైతే వాటిపై కప్పులు వేయాలని సూచించారు. కానీ ఆ పనులు కూడా జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది సరిగ్గా చేయడం లేదు.

గుర్రాల పార్కుపై గరంగరం

... 5వ పేజీ తరువాయి

లేదన్నారు. 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు మాట్లాడుతూ ఇంతవరకూ ఆ ప్రాజెక్టుకు ఎంత చెల్లించారు, గత కౌన్సిల్‌లో ఎందుకు ఈ అంశాన్ని పెట్టలేదని ప్రశ్నించారు. చీఫ్ ఇంజనీర్ శివప్రసాద్‌రాజు వివరణ ఇస్తూ ఈ ప్రాజెక్టుకు ఇప్పటికే రూ.3 కోట్లు బిల్లు చెల్లించామని చెప్పడంతో టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తంచేస్తూ, అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకుండా, ఇంకా పనులు పూర్తిచేయకుండానే గుర్రాల ప్రాజెక్టుకు రూ.3 కోట్లు ఎలా ఇచ్చారో మేయర్ చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై మేయర్ కలుగజేసుకుంటూ తనకు కూడా గుర్రాల పార్కు గురించి కనీసం తెలియదని, ముడసర్లోవ పార్కు అభివృద్ధికి అని అప్పటి కమిషనర్ చెప్పడంతోనే సంతకం చేశానని వివరణ ఇచ్చారు.

మేయర్ వివరణపై 45వ వార్డు కార్పొరేటర్ కంపా హనోక్ అభ్యంతరం వ్యక్తంచేశారు. మేయర్‌కు తెలియకుండా రూ.6 కోట్ల ప్రాజెక్టు ప్రారంభించారంటే కౌన్సిల్‌కే అవమానమని అందుకు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేయడంతో సభ ఒక్కసారిగా వేడెక్కింది. ఆరోపణలు వస్తేనే రాజీనామా చేయాలంటే కార్పొరేటర్లందరిపైనా ఆరోపణలు ఉన్నాయని, కొందరిపై టీడీపీ సీనియర్ కార్యకర్తలమంటూ చేసిన ఫిర్యాదులు తన వద్ద ఉన్నాయని మేయర్ అన్నారు. అందుకు టీడీపీ సభ్యులు అభ్యంతరం తెలిపారు. దమ్ముంటే వాటిని బయటపెట్టి విచారణ జరపాలని, ఆరోపణలు రుజువైతే వారిపై చర్యలు తీసుకోవాలని పీలా శ్రీనివాసరావు సవాల్ చేశారు. చివరకు కౌన్సిల్‌లో ఆమోదం పొందకుండా ప్రాజెక్టుకు ప్రతిపాదనలు తయారుచేయడం తప్పేనని చీఫ్ ఇంజనీర్ శివప్రసాదరాజు అంగీకరించారు. ఈ నేపథ్యంలో గుర్రాల పార్కు ప్రాజెక్టును నిలిపివేశారు.

అభివృద్ధి పనులకు అధికారులు మోకాలడ్డు

... 5వ పేజీ తరువాయి

లేదని, కొత్తగా వచ్చిన ఒకరిద్దరు ఎమ్మెల్యేలు మాత్రం జడ్పీ నిధులకు సంబంధించి పనులు చేపట్టవద్దని చెబుతున్నారన్నారు. ఈ విధానంలో మార్పు రాకపోతే వచ్చే జనరల్ బాడీ సమావేశాన్ని బహిష్కరిస్తామని చైర్‌పర్సన్ హెచ్చరించారు. ఈ అంశంపై పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసరావు బదులిస్తూ పనులకు ఆటంకం లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కె.కోటపాడు జడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ అధ్యక్షతన జరిగిన రెండు, ఐదు స్థాయీ సంఘ సమావేశాల్లో సామాజిక పింఛన్ల సర్వేపై చైర్‌పర్సన్ సుభద్ర, దేవరాపల్లి జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, తదితరులు ఆందోళన వ్యక్తంచేశారు. పింఛన్ల ఏరివేత కోసం ఈ సర్వే చేస్తున్నారా...అని ప్రశ్నించగా అనకాపల్లి డీఆర్‌డీఏ పీడీ శచీదేవి బదులిస్తూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాకు ఒక సచివాలయ పరిధిలో సర్వే చేశామన్నారు. పింఛన్లలో కోత ఉండదన్నారు. దివ్యాంగులకు పింఛన్ల విషయంలో ఇబ్బందులు ఉన్నాయని పలువురు సభ్యులు ప్రస్తావించగా...అల్లూరి సీతారామరాజు జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ కె.కృష్ణారావు బదులిస్తూ మండలాల్లో మెగా సదరం క్యాంపుల నిర్వహణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. సంబంధిత ఎంపీడీవోల నుంచి వచ్చిన ప్రతిపాదనల మేరకు క్యాంపులు నిర్వహిస్తామన్నారు. వైద్య ఆరోగ్య శాఖపై చర్చ సందర్భంగా కేజీహెచ్‌కు నేరుగా వెళితే వైద్యం అందడంలో జాప్యం జరుగుతుందని, సూపరింటెండెంట్‌కు ఫోన్ చేస్తే వెంటనే చికిత్స అందుతుందని పలువురు సభ్యులు అన్నారు. విద్యా శాఖపై చర్చలో చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ చాలా పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా ఉందన్నారు. భీమిలి జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు మాట్లాడుతూ నగర పరిధిలో ఉన్న జడ్పీ, ఎంపీపీ పాఠశాలలను జీవీఎంసీలో విలీనం చేయాలని కోరగా ప్రభుత్వానికి నివేదిస్తామని డీఈవో ప్రేమ్‌కుమార్ హామీ ఇచ్చారు. కాగా, అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులు, నిర్మాణాలకు ప్రతిపాదనలు వస్తే నిధులు మంజూరుచేస్తామని చైర్‌పర్సన్ అన్నారు. ప్రతి మండలంలో అభివృద్ధి కార్యక్రమాలకు జడ్పీటీసీ సభ్యులను ఆహ్వానించాలని, గ్రామ సభల్లో చేసిన తీర్మానాల వివరాలు సర్పంచులు/ఇతర ప్రజా ప్రతినిధులకు అందజేయాలని అధికారులను చైర్‌పర్సన్ ఆదేశించారు. ఉద్దేశపూర్వకంగా జడ్పీటీసీ సభ్యులను నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని ఆమె అన్నారు. డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

నిద్దరోతున్న నిఘా నేత్రాలు

- పట్టించుకోని అధికారులు
- దుస్సంఘటనలు జరిగితే ఎవరిది బాధ్యత?
- ద్వారకా బస్‌స్టేషన్‌లో దయనీయ పరిస్థితి



ద్వారకా బస్టాండ్‌లో పనిచేయని సీసీ కెమేరాల్లో ఇదొకటి



అలంకారప్రాయంగా పోలీసు అవుట్‌పోస్టు

మహరాణిపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సాంకేతికత కొత్తపుంతలు తొక్కుతున్న నేటి కాలంలో చీకటి ప్రపంచాన్ని బట్టబయలు చేయడంలో సీసీ కెమేరాల పాత్ర ఎనలేనిది. నేరస్తులను పట్టించడంలో పోలీసు శాఖకు ఉపయుక్తంగా ఉంటున్నాయి. కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే ప్రజల ఆస్తులకూ రక్షణగా ఉంటున్నాయి. ఎక్కడ, ఏ సమయంలో, ఎవరు నేరం చేశారో పోలీసులు వీటి ద్వారా నిర్ధారణ చేసుకోగలుగుతున్నారు. బహుళ అంతస్తుల భవనాలు, వాణిజ్య సముదాయాలు, ఆసుపత్రులు, ప్రధాన రహదారులు, మార్కెట్ల నుంచి ఇప్పుడు ప్రతి చిన్న దుకాణం, ఇళ్లలోనూ సీసీ కెమేరాల ఏర్పాటు అనివార్యమవుతోంది. రాష్ట్రానికి ఆర్థిక రాజధానిగా పేర్కొంటున్న విశాఖలో అత్యంత కీలకమైన ద్వారకా ఆర్టీసీ బస్‌కాంప్లెక్స్‌లో సీసీ కెమేరాలు పనిచేయడం లేదన్న గుట్టు బయటపడింది. బస్టాండ్‌కు వచ్చిపోయే ప్రయాణికులను పోలీసు అవుట్ పోస్టు నుంచి నిరంతరం పర్యవేక్షించవలసిన వ్యవస్థ లేకపోవడం విడ్డూరం. బూత్ తప్ప అందులో సిబ్బంది లేరు.

కానిస్టేబుల్‌కు చేదు అనుభవం

సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ ఒకరు ఇటీవల నెల్లూరు నుంచి వచ్చి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నారు. వెంటనే అక్కడున్న పోలీసు అవుట్ పోస్టు వద్దకు రాగా, అక్కడ ఎవరూ లేకపోవటంతో ఆర్టీసీ భద్రతా దళ సిబ్బందిని సంప్రదించారు. అక్కడున్న మహిళా కానిస్టేబుల్ 'మీరు టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయండ'ని (అక్కడకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది) సలహా ఇచ్చారు. రోజూ వేలాదిమంది రాకపోకలు సాగించే ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నిఘా వ్యవస్థ ఎలా ఉన్నదీ బయటపడింది.

ఇదీ నేటి పరిస్థితి!

విశాఖ నగరం గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణాకు అడ్డాగా మారింది. ఏజెన్సీ నుంచి ఎక్కువమంది ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌కు వచ్చి, ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు వెళతారు. పోలీసులకు అందిన పక్కా సమాచారంతో మాటు వేసి గంజాయి రవాణా చేసే వారిని పట్టుకుంటారు. ఇప్పుడు సీసీ కెమేరాలు పనిచేయకపోవడంతో ఎవరు ఏం తెచ్చినా గుర్తించలేని పరిస్థితి నెలకొంది. గతంలో కాంప్లెక్స్‌లోని ప్రతీ ప్లాట్‌ఫారం వద్ద సీసీ కెమేరా ఉండేది. బస్సు ప్రయాణికుల వివరాలు స్పష్టంగా తెలిసేవి. పర్యవేక్షించేందుకు పోలీసు అవుట్ పోస్టులో ఇన్‌చార్జి సహా నలుగురు పోలీసు సిబ్బంది సీసీ కెమేరాలో రికార్డవుతున్న ఫుటేజీని పోలీసు అవుట్ పోస్టులో ఏర్పాటు చేసిన మోనటరింగ్ సిస్టం ద్వారా గమనించేవారు. ప్రస్తుతం నిర్వహణ లేక సీసీ కెమేరాల కనెక్షన్ల వైర్లు వేలాడుతూ ఉన్నాయి. పోలీసు కమాండ్ కంట్రోల్‌కు చెందిన మరో రెండు సీసీ కెమేరాల పరిస్థితీ ఇంతేనని తెలుస్తోంది. సీసీ కెమేరాలు పనిచేయనందున కొత్తవి ఏర్పాటు చేయాలని డీసీపీ స్థాయి అధికారి నేరుగా ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌కు లిఖిత పూర్వకంగా కోరినా తక్షణమే స్పందించాల్సింది పోయి, ఇప్పటికీ చర్య తీసుకోకపోవడం గమనార్హం. చేతులు కాలాక ఆకులు పట్టిన చందంగా ఉన్నతాధికారుల తీరు కనిపిస్తోంది.. వెంటనే చర్యలు తీసుకోవాల్సి ఉంది.

గీతా పారాయణం మహత్తర ఔషధం

- చిన్నజీయర్ స్వామి ఉద్బోధ
- ముగిసిన గీతామృత ప్రవచనాలు



ఆహూతులతో సామూహికంగా భగవద్గీత పారాయణం చేయిస్తున్న ఆధ్యాత్మిక ఆచార్యులు త్రిదండి చిన్నజీయర్ స్వామి

సీతమ్మధార, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత సారం తెలుసుకుని ఆచరిస్తే జీవిత రాత మారుతుందని ఆధ్యాత్మిక ఆచార్యులు త్రిదండి చిన్న జీయర్ స్వామి పేర్కొన్నారు. మానవ జీవితానికి మహత్తర ఔషధంలా గీతా పారాయణం పనిచేస్తుందని వివరించారు. వికాస తరంగిణి, వారిజ నిర్వహణలో సీతమ్మధారలోని వర్మ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన గీతా జయంతి వేడుకలు, గీతామృత ప్రవచనాల కార్యక్రమం బుధవారం ముగిసింది. చివరి రోజున చిన్న జీయర్ స్వామి సుమారు అయిదు వేల మందితో సంపూర్ణ భగవద్గీత పారాయణం చేయించారు. గీతా పారాయణ వైభవం, చదవాల్సిన అవసరాన్ని స్వామీజీ వివరించారు. పూర్ణాహుతిసూచికగా భగవద్గీత పారాయణం, హవనంతో శాంతి హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఎంఎస్ఎస్ఆర్ వర్మ, ముదుంబై శ్రీకాంత్, పెద్దసంఖ్యలో యువతీ, యువకులు తదితరులు పాల్గొన్నారు.

కేవీలో ఘనంగా భాషా ఉత్సవ్


కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

అక్కయ్యపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో బుధవారం భారతీయ భాషా ఉత్సవ్ ఘనంగా ముగిసింది. సుప్రసిద్ధ తమిళ కవి సుబ్రహ్మణ్య భారతి జ్ఞాపకార్థం భాషల ద్వారా సమైక్యత అనే అంశంపై జరిగిన ఉత్సవ్ ఈ నెల 4 నుంచి వారంపాటు నిర్వహించారు. భాషల సామరస్యత, సాంకేతికత ద్వారా అనుసంధానం, భాష-సాహిత్యం-భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు, భాష-సమాజం, భాష-సంస్కృతి తదితర అంశాలపై చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జిత్, ఇందిరా నాయర్, హేమలత, కుందన్ లాల్, నాగమణి, పింకి, మణిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు సవరణకు దరఖాస్తుల ఆహ్వానం

డాబాగార్డెన్స్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నియోజకవర్గ పరిధిలో 18 సంవత్సరాలు నిండిన యువత నూతన ఓటు నమోదుకు అర్హులని జీవీఎంసీ జోన్-4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సచివాలయాల్లో కొత్త ఓటరుగా 24లోగా నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారు ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణ, ఫోటో జత చేయాలన్నారు. ఓటరు కార్డులో చిరునామా, ఇతర వివరాల మార్పు కోసం కూడా దరఖాస్తు చేసుకోచ్చని పేర్కొన్నారు. చిరునామా మార్పు కోసం గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుదారు ఇంటికి బీఎల్ఓ వెళ్లి విచారణ చేసిన తరువాత ఓటరు గుర్తింపు కార్డును ఇంటర్నెట్ సెంటర్‌లో ప్రింట్ తీసుకోవాల్సి ఉంటుందని తెలియజేశారు.

తుఫాన్ బాధిత రైతులకు సంఘీభావం


రైతు వేషధారి వద్ద సంఘీభావం తెలుపుతున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

అక్కయ్యపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు పోర్టు స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సంఘీభావం తెలిపింది. అధ్యక్షుడు ఎస్.ప్రసాదరావు బిచ్చగాడు వేషధారణలో రైతులకు సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు రైతు భరోసా, రుణమాఫీ, రైతు బీమా పథకాలు అమలు చేస్తున్నప్పటికీ సకాలంలో అందకపోవడంతో వ్యవసాయంలో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఆధునిక పరికరాలను రాయితీతో సమకూర్చి ఆ పంట చేతికి రాగానే సరైన గిట్టుబాటు ధర వచ్చేలా ప్రభుత్వాలు కృషి చేసి వ్యవసాయమే మేలన్న విధంగా ప్రజలకు భరోసా కల్పించాలని కోరారు.

ఆర్పీఎఫ్ సేవలతో ప్రయాణికుడికి ఊరట

విశాఖపట్నం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ అమానత్ సేవల ద్వారా ఆర్పీఎఫ్ సిబ్బంది ప్రయాణికులకు ఊరట కలిగిస్తున్నారు. రైల్లో పొరపాటున విలువైన వస్తువులు విడిచిపెట్టి దిగిపోయిన ప్రయాణికులకు వీరు కొద్ది గంటల్లో తిరిగి అప్పగించడం విశేషం. బుధవారం బ్రహ్మపూర్-విశాఖ (18525) రైల్లో కోచ్ సి-1లో సీటు నంబరు 67 వద్ద సుమారు రూ.50 వేల విలువైన వస్తువులతో సంచిని విడిచిపెట్టి దిగిపోయినట్లు ఓ ప్రయాణికుడి నుంచి ఫిర్యాదు అందింది. వెంటనే ఆర్పీఎఫ్ అప్రమత్తమై రైలు కొత్తవలస చేరిన వెంటనే సి-1 కోచ్‌లోకి వెళ్లి తనిఖీ చేయగా సంచి దొరికింది. ఈ సమాచారాన్ని ఫిర్యాదుదారుకు అందించారు. కొత్తవలస స్టేషన్‌కు చేరుకున్న ఫిర్యాదుదారుని ఆర్పీఎఫ్ కార్యాలయ కమాండెంట్ విచారించి తగిన ఆధారాలు సమర్పించడంతో సంచిని తిరిగి అప్పగించారు.

29న రెడ్‌క్రాస్ సర్వసభ్య సమావేశం

మహారాణిపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ విశాఖ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 29న నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. జిల్లాకు చెందిన రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులంతా తమ ఆధార్, సభ్యత్వ కార్డులు తీసుకొని 29న ఉదయం 11 గంటలకు ఐఆర్‌పీఎస్ హాల్‌కు హాజరుకావాలని తెలిపారు. 10 మంది సభ్యులతో కూడిన జిల్లా శాఖ కార్యవర్గాన్ని ఎన్నుకుంటామన్నారు. ఈ పది మందిలో చైర్మన్, వైస్ చైర్మన్, కోశాధికారులను ఎన్ను కుంటారని పేర్కొన్నారు. జిల్లా సహకార అధికారి ఎన్నికలు నిర్వహిస్తారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

- ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు


సమావేశంలో మాట్లాడుతున్న దామోదరరావు

కూర్మన్నపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ఎంప్లాయీస్ యూనియన్ ధ్యేయమని రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. బుధవారం స్టీల్ సిటీ ఆర్టీసీ డిపోలో ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది డిపోల ఈయూ కార్మికుల సమావేశంలో మాట్లాడారు. ఖాళీగా ఉన్న పోస్టులను ప్రభుత్వం తక్షణమే భర్తీ చేయాలని, పదోన్నతులకు మోక్షం కల్పించాలని, సిబ్బందికి నైట్‌అవుట్, ట్రావెలింగ్, ఓటీ అలవెన్స్‌లను చెల్లించాలని, ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను అమలు చేయాలని కోరారు. తప్పు చేయకుండా కార్మికులను అధికారులు వేధిస్తే ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈయూ డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి.భానుమూర్తి కారుణ్య నియామకాలను తక్షణమే చేపట్టాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి నందమూరి రామారావు, శుభకర్, కృష్ణమూర్తి, తాతలు, నారాయణ, పద్మ, మూర్తి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మాడవీధుల్లో వైభవంగా ఏకాదశి తిరువీధి


తిరువీధిలో స్వామివారి ఊరేగింపు

సింహాచలం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి తిరువీధి ఉత్సవం బుధవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. ఏకాదశి పురస్కరించుకుని ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణ ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించి, పల్లకిలో ఉంచారు. ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనులు, అధ్యాపకుల వేద మంత్రోచ్చారణలు, భక్తుల హరి నామస్మరణ నడుమ స్వామివారి తిరువీధి జరిపారు. మార్గం పొడవునా భక్తులు నారికేళ ఫలాలు, కర్పూర నీరాజనాలిచ్చి ఆహ్వానం పలికారు.

అప్పన్న సన్నిధిలో ప్రత్యేక పారాయణం

సింహాచలం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో బుధవా రం ప్రత్యేక పారాయణలు నిర్వహించారు. విశిష్టాద్వైత మత ప్రచారకులు తిరు మంగై ళ్వార్ తిరు నక్షత్ర ఉత్సవాల్లో భాగం గా వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ఆస్థాన మండపంలో ప్రత్యేక వేదికపై ఆళ్వార్లతో సహా అధిష్టింపజేశారు. నాలాయిర దివ్యప్రబంధంలోని పాశురాలను ఆలయ స్థానాచార్యులు డా. టిపి రాజగోపాల్ సారధ్యంలో అధ్యాపకులు పారాయణలు చేశారు.

హనుమత్ వ్రతం ప్రారంభం

సింహాచలం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సింహగిరి మెట్ల మార్గంలో ఉన్న సాక్షి ఆంజనేయస్వామి సన్నిధిలో బుధవారం గణపతి పూజతో హనుమద్వ్రతం వేడుకలకు శ్రీకారం చుట్టారు. ఆలయ అర్చకుడు రమేశ్ గణపతి పూజ, పుణ్యాహవచనములు చేసిన పవిత్ర జలాలతో ఆలయ పరిసరాలను, పూజా ద్రవ్యాలను ప్రోక్షణ జరిపారు. తరువాత మూడు రోజుల పాటు సుందరకాండ పారాయణ చేసేందుకు రుత్విక్ వరణులను రుత్విక్‌లకు ఇచ్చారు. దేవస్థానం ఈఓ త్రినాథరావు ఆదేశాల మేరకు ఆలయాన్ని మామిడి తోరణాలు, బంతి పూలతో శోభాయమానంగా అలంకరించారు.

ఖండకావ్యం భాషకు అలంకారం



సమావేశంలో మాట్లాడుతున్న రచయిత చిన సూర్యనారాయణ

సీతంపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఖండకావ్యం పూర్తిగా ఆధునిక ప్రక్రియ.. కల్పితం లేదా కల్పితం కానిది గానీ విషయాన్ని వస్తువుగా తీసుకొని అష్టాదశ వర్ణనలతో జనరంజకంగా రాసే ప్రక్రియను ఖండకావ్యం అంటారని రచయిత సీహెచ్ చిన సూర్యనారాయణ పేర్కొన్నారు. పరిమిత పద్యాలతో ఒక వర్ణాంశమో, సంఘటన లేదా కథను చెబుతారని ఆయన విశ్లేషించారు. సీతంపేట రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు శేఖర్‌మంత్రి ప్రభాకర్ అధ్యక్షతన 'తెలుగులో ఖండ కావ్యాలు' అనే అంశంపై బుధవారం చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి వక్తగా విచ్చేసిన చిన సూర్యనారాయణ మాట్లాడుతూ మహాకావ్యం లక్షణాలు, ఖండకావ్యం అంశాలను వివరించారు. ప్రసంగాన్ని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డి.వి. సూర్యారావు సమీక్షించారు. డాక్టర్ కె.వి.ఎస్ మూర్తి, భాగవతుల సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

రైతుబజార్‌లో గోసంచారం

సీతమ్మధార, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార రైతుబజార్ లోపలకు ఆవులు వస్తుండటంతో కూరగాయల విక్రయదారులు ఇబ్బంది పడుతున్నారు. రైతుల గంపలు, కొనుగోలుదారుల సంచిలో ఉండే కూరగాయలను ఒక్క ఉదుటన తినడంతో ఏమీ చేయలేకపోతున్నారు. ఆవరణలోకి ఆవులు రాకుండా చూడాలని కొనుగోలుదారులు కోరుతున్నారు.

వెనుకబడి

... 5వ పేజీ తరువాయి

వెనుకబడ్డారు. వీటన్నింటినీ గత ప్రభుత్వం గాలికొదిలేసింది. దీంతో పాఠశాల విద్య గాడితప్పింది. దీని ఫలితమే స్టార్ రేటింగ్‌లో వెనుకబడ్డామని పలువురు టీచర్లు అభిప్రాయపడుతున్నారు. చివరకు 3-స్టార్ రేటింగ్ వచ్చిన పాఠశాలల్లో కూడా అత్యధికం ప్రాథమిక పాఠశాలలేనని, ఉన్నత పాఠశాలలు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. గత పాలకులు మాతృభాషలో బోధన, టీచర్ల నియామకాలపై నిర్లక్ష్యం చూపారని సీనియర్ హెచ్ఎం ఒకరు అన్నారు. ప్రధానంగా యాప్‌లతో టీచర్లను వేధించడానికి వారికి సరిపోయిందని, దాంతో బోధన గాడి తప్పిందన్నారు.

ధనుర్మాసోత్సవాల వాల్ పోస్టర్లు ఆవిష్కరణ

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై గల శ్రీవేంకటేశ్వర వినాయకస్వామి దేవస్థానంలో ఏటా నిర్వహించే ధనుర్మాసోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను బుధవారం ఆలయ సిబ్బంది ఆవిష్కరించారు. దేవస్థానం ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఈవో ఎ.జగన్నాథరావు మాట్లాడుతూ ఈ నెల 16న నెలగంట పెట్టడంతో ప్రారంభమయ్యే ఉత్సవాలు జనవరి 13తో ముగుస్తాయన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 21న లక్ష తులసీ పూజ, జనవరి పదిన ముక్కోటి ఏకాదశి పూజలు, 11న కుడారై ఉత్సవం, 13న గోదా శ్రీనివాసుల కల్యాణాన్ని జరుపుతామన్నారు. ఉత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనవలసిందిగా ప్రధాన అర్చకులు నారాయణాచార్యులు, లక్ష్మణాచార్యులు కోరారు.

విజేతలకు అభినందనలు

అగనంపూడి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన భగవద్గీత పోటీల్లో అగనంపూడికి చెందిన జాజుల అప్పారావు ద్వితీయ స్థానం సాధించారు. అలాగే ఏయూలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో స్థానిక యువకుడు కొమ్మోజు అశోక్ గోల్డ్ మెడల్ సాధించాడు. విజేతలను బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి అభినందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. అగనంపూడి ప్రాంతానికి వ్యక్తులు వివిధ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలబడడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు ఇల్లపు ప్రసాద్, మోటూరి వెంకటరమణ, బి. సత్యనారాయణ, బండారు చందూరమేశ్, ఎల్వీ రమణ, మొల్లి కోటేశ్వరరావు, రాము, పద్మ, కొలిపాక అప్పారావు, భీష్మ, త్రిమూర్తులు, పూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

తుంగ్లాంలో కాలువలు పరిశీలన

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తుంగ్లాంలో మురుగు నీటి సమస్యపై స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం జీవీఎంసీ అధికారులు గ్రామంలో పర్యటించి ప్రధాన కాలువలను పరిశీలించారు. తుంగ్లాం నుంచి వచ్చే మురుగు బయటకు పోయేలా చర్యలు చేపట్టి, తుంగ్లాం కాలనీ నుంచి షీలానగర్ రైల్వే అండర్ బ్రిడ్జికి నేరుగా రహదారి నిర్మించవలసిందిగా కూటమి నాయకులు కరణం ముత్యాలనాయుడు, ప్రకాశ్, తదితరులు జీవీఎంసి అధికారులకు కోరారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కణితి మార్గం లోని ఒక తోటలో ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక కర్ణవానిపాలెం ప్రాంతానికి చెందిన గుంటూరు అప్పలరాజు (52) క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తుండేవాడు. బుధవారం కణితి చెక్‌పోస్టు ప్రాంతంలోని ఓ తోటలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మార్గంలో వస్తున్న ఓ ఆటో డ్రైవర్ బహిర్భూమికని ఆ తోటలోకి వెళ్లగా, ఉరి వేసుకుని ఉన్న వ్యక్తిని చూసి పోలీసులకు సమాచారం అందించాడు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

కాగా అప్పలరాజు బాధ్యతా రాహిత్యంగా ఉంటాడని, మూడు రోజుల క్రితం తన తల్లి చనిపోయినా వెళ్లలేదని పోలీసులకు మృతుని కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అప్పలరాజుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సినిమా గైడ్

● **పుష్ప-2** : జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య, సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 26, వంకాయలు (తెలుపు) 26,వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 20, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 34,బీరకాయలు 38, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 18, క్యారెట్ 68 దొండకాయలు 30, బంగాళ దుంపలు 32, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 120, అల్లం (పాతది)56, బరబాటి 24, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 55, గోరు చిక్కుడు 24 దోసకాయ 24,వెల్లుల్లి (పెద్దవి) 300, కొబ్బరికాయ (పెద్దది) 25,బీన్స్ (పెన్సిల్) 58, పొటల్స్ 44, కీరదోస 28, కాప్సికమ్ 58,పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 46, కొండఉసిరి 50, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర 4, పాలకూర 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడి కాయ 30, క్యాప్రెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	620
విజయనగరం	624
శ్రీకాకుళం	624

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	93
ఫారం ధర	113
విత్ స్కిన్	296
స్కిన్‌లెస్	206



పెదగంట్యాడ పారిశ్రామికవాడ ప్రధాన రహదారి పక్కన కుప్పలుగా ఉన్న డెబ్రిస్



రహదారిపైకి చేరుతున్న డెబ్రిస్, ఇతర వ్యర్థాలు

డంపింగ్ యార్డు కాదు రోడ్డే...

రాత్రి వేళల్లో పెదగంట్యాడ పారిశ్రామికవాడ ప్రధాన రహదారి పక్కన పడేస్తున్న భవన నిర్మాణదారులు

తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు

ఐలా పాలకవర్గం పట్టించుకోవడం లేదన్న విమర్శలు

పెదగంట్యాడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ పారిశ్రామికవాడ ప్రధాన రహదారి డంపింగ్ యార్డును తలపిస్తోంది. ఈ రహదారికి ఇరుపక్కలా భవన నిర్మాణదారులు శిథిల భవనాలకు సంబంధించిన డెబ్రిస్‌తో పాటు ఇతర వ్యర్థాలను రాత్రి వేళల్లో ఇష్టానుసారంగా పడేస్తుండడంతో కుప్పలు కుప్పలుగా పేరుకుపోతున్నాయి. దీంతో ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రహదారిలో డెబ్రిస్, ఇతర వ్యర్థాలు లేకుండా జీవీఎంసీ ప్రజారోగ్యశాఖ సిబ్బంది తొలగిస్తున్నా.. మళ్లీ అంతకు రెట్టింపుగా పలువురు డెబ్రిస్‌ను, వ్యర్థాలను వేస్తున్నారు. సుమారు కిలోమీటరు పొడవున ఉన్న ఈ రోడ్డుకు ఇరుపక్కలా తారురోడ్డుకు, డ్రైనేజీలకు మధ్య కొంత ఖాళీ స్థలం ఉంది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఏపీఐఐసీ ఈ స్థలాన్ని రిజర్వు చేసి ఉంచింది. పరిసర ప్రాంతాల్లో ఎవరు పాత కట్టడాలను తొలగించినా.. అందుకు సంబంధించిన డెబ్రిస్‌ను రాత్రి పూట ఇక్కడ డంప్ చేస్తున్నారు. అలాగే చాలామంది తమ ఇళ్లలోని వ్యర్థాలను కూడా పడేస్తున్నారు. మరికొందరు కుక్కలు, పందులు, ఇతర జంతు కళేబరాలను కూడా ఇక్కడే పడేస్తుండడంతో ఈ మార్గంలో తీవ్ర దుర్వాసన వెలువడుతుంది. కాగా డెబ్రిస్ వల్ల ఇప్పటికే ఒకపక్క డ్రైనేజీలు మూసుకుపోయాయి.



పేరుకుపోతున్న చెత్తాచెదారం..

ఇంత అధ్వానంగా ఉన్న ఈ ప్రాంతాన్ని కొందరు స్థానికులు బహిర్భూమిగా కూడా వినియోగించుకుంటున్నారు. పారిశ్రామికవాడకు వచ్చి పోయే కార్మికులకు ఇదే రహదారి. పెదగంట్యాడ నుంచి యాతపాలెం, వెంకన్నపాలెం, కొంగపాలెం, కొత్త దిబ్బపాలెం, అశోక్‌నగర్ కాలనీలకు రాకపోకలు సాగించేందుకు ఇదే ప్రధాన మార్గం. వేమన ఐటీఐ, క్రీడా కోచింగ్ సెంటర్, విద్యుత్ సబ్ స్టేషన్, పెదగంట్యాడ అగ్నిమాపక కేంద్రం ఈ మార్గంలోనే ఉన్నాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు తీవ్ర దుర్వాసన వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అలాగే దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వారు, ఆటోనగర్ పరిశ్రమల కస్టమర్లు ఇంత అధ్వానంగా ఉన్న ఈ మార్గంలో ముక్కు మూసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ప్రధాన రహదారిలోనే ఇలాంటి పరిస్థితి నెలకొనడంతో పారిశ్రామికవాడ ప్రతిష్ఠ మసకబారుతోంది. డెబ్రిస్‌ను తొలగించేందుకు జీవీఎంసీ అధికారులు చర్యలు చేపడుతున్నా.. ఆ మరుసటి రోజుకు పరిస్థితి యథాస్థితికి చేరుకుంటుండడంతో వారు వ్యర్థాలను తొలగించేందుకు ముందుకు రావడం లేదు. ఈ రోడ్డు ఇంత దారుణంగా ఉన్నా ఐలా పాలకవర్గం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా జీవీఎంసీ ఉన్నతాధికారులు, ఐలా పాలకవర్గం ప్రతినిధులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

భూ బాధితులకు న్యాయం చేసేందుకే రెవెన్యూ సదస్సులు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భూ సమస్యలతో ప్రజలు అల్లాడిపోయారని, అటువంటి వారికి తగిన న్యాయం చేయాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 86వ వార్డు పరిధి రాజీవ్ నగర్‌లో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సదస్సుల ద్వారా స్వీకరించే వచ్చే ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో పొందుపరుస్తామన్నారు. సమస్య పరిష్కారమైందా లేదా అన్నది అర్జీదారుల ఫోన్లకు మెసేజ్ వస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వహయాంలో జగన్ నియంతలా వ్యవహరించారని మండిపడ్డారు. లాండ్ యాక్ట్ పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడంతో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే లాండ్ యాక్ట్‌ని రద్దు చేసిందని పల్లా పేర్కొన్నారు. తహసీల్దార్ శ్రీవల్లి మాట్లాడుతూ ఈ సదస్సులో 16 అర్జీలు వచ్చాయని, వీటిని త్వరితంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. టీడీపీ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మధుసూదన్, కూటమి నాయకులు కాదా శ్రీను, గంధం వెంకటరావు, వేగుంట శ్రీనివాస్,నాగార్జున, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

ఎలక్ట్రీషియన్ కోర్సులో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

గాజువాక, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గాజువాక ప్రభుత్వ ఐటీఐలో స్కిల్ హబ్స్ ద్వారా అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఆపై చదివినవారు ఎలక్ట్రీషియన్ కోర్సులు చేసేందుకు అర్హులని, ఆసక్తి గలవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8121743777 సెల్ నంబర్‌ను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు.

ఉమా రామలింగేశ్వరాలయంలో గీతా జయంతి

అగనంపూడి, డిసెంబరు 11 (ఆంధ్ర జ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి జాబిలి హిల్స్‌లో గల ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం గీతా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేయగా,అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పలువురు భక్తులు గీత, లలిత, విష్ణుసహస్ర నామ పారాయణాలను పఠించారు.

‘అన్నదాతకు అండగా’ పోస్టర్ ఆవిష్కరణ

పెందుర్తి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాంపురంలో ఉన్న వైసీపీ కార్యాలయంలో అన్నదాతకు అండగా పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం జరిగే అన్న దాతకు అండగా కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు పైల శ్రీనివాసరావు, మదుపాడ నాగమణి, బోకం రామునాయుడు, చిరికి దేవుడు, మెంటి మహేశ్, చందు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలని కమిషనర్‌కు వినతి

ఎన్‌ఏడీ జంక్షన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డులో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరుతూ జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు స్టాండింగ్ కమిటీ మెంబర్, వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ బుధవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకానీనగర్‌లో అంతర్గత, బీటీ రోడ్లు, బుచ్చిరాజుపాలెం, గవరవీధి, గాంధీనగర్, లక్ష్మీనగర్ కొండవాలు ప్రాంతాల్లో నిర్మించాలని విన్నవించారు.

మాడవీధుల్లో ఏకాదశి తిరువీధి

సింహాచలం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) :వరాహలక్ష్మీనృసింహస్వామి తిరువీధి ఉత్సవం బుధవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు.ఏకాదశి పురస్కరించుకుని ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణ ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించి, పల్లకిలో ఉంచారు. ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనులు, అధ్యాపకుల వేదమంత్రోచ్చారణలు, భక్తుల హరి నామస్మరణ నడుమ స్వామివారి తిరువీధి జరిపారు. మార్గం పొడవునా భక్తులు పండ్లుతో ఆహ్వానం పలికారు.

సాగునీటి సంఘాల ఎన్నికపై సమీక్ష

జనసేన నాయకలకు ఎమ్మెల్యే పంచకర్ల సూచనలు

పెందుర్తి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి విశాఖ జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికల్లో విజయం సాధించేందుకు జనసేన నాయకులు వ్యూహాత్మకంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆదేశించారు. బుధవారం ఆయన సుజాతనగర్‌లో ఉన్న తన క్యాంపు కార్యాలయంలో రూరల్ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల జనసేన పార్టీ ఇన్‌చార్జిలతో సాగునీటి సంఘాల ఎన్నికలపై సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 14న జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికల్లో జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఉన్న సంఘాలను శత శాతం కైవసం చేసుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతుల్లో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై తక్షణమే పరిరక్షణ చర్యలు చేపడతామని చెప్పారు. దీనిపై రెవెన్యూ అధికారులు కూడా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద నలుగురు బాధితులకు మంజూరైన రూ.5 లక్షలు చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

రాజయ్యపేటలో రెవెన్యూ సదస్సు

పెందుర్తి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజయ్యపేటలో అధికారులు బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు, ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం హయాంలో చేపట్టిన భూముల రీసర్వేలో పలు తప్పిదాలు జరిగాయన్నారు. ముఖ్యంగా పట్టదారు పాసు పుస్తకాల్లో తమకు సంబంధం లేని సర్వే నంబర్లు వేసి, విస్తీర్ణంలో హెచ్చు, తగ్గులు చూపారన్నారు. దీనిపై తహసీల్దార్ ఆనంద్ కుమార్ స్పందిస్తూ రీ సర్వే అర్జీలను పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం రైతుల నుంచి 33 వినతులు స్వీకరించారు.



సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్

రెవెన్యూ సదస్సుపై ఆటోలో ప్రచారం

ఎన్‌ఏడీ జంక్షన్ : గోపాలపట్నం మండల రెవెన్యూ పరిధిలో నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులపై అధికారులు ఆటోలు, సచివాలయం సిబ్బంది ఇంటింటికి వెళ్లి బుధవారం ప్రచారం నిర్వహించారు.

గురువారం చంద్రనగర్‌లో గోపాలపట్నం విలేజీ పరిధిలోని ప్రాంతాలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు సదస్సు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ సీహెచ్‌వీ రమేశ్ తెలిపారు. అలాగే 13న కంచరపాలెం పరిధిలోని ఏఎస్ఆర్ నగర్‌లో, 16న ఐటీఐ జంక్షన్ కాగిత పైడయ్య కల్యాణ మండపంలో, 17న వెంకటాపురం పరిధి కంపరపాలెం అంగన్‌వాడీ కేంద్రం వద్ద, 19న పులబట్లపాలెం పరిధిలోని సంతోష్‌నగర్ మొదటి లైన్ వద్ద, 21న కప్పరాడ పరిధి మురళీనగర్ హైవే శివాలయం వద్ద, 23న మాధవధార మాధవస్వామి కల్యాణ మండపంలో, 26న మర్రిపాలెం మసీదు వీధిలో సదస్సులు జరుగుతాయని తెలిపారు.

నేడు 89వ వార్డులో ....

గోపాలపట్నం; జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్ మైదానంలో గురువారం రెవెన్యూ సదస్సు జరగనుంది. ఉదయం 9 నుంచి జరగనున్న ఈ సదస్సులో ప్రభుత్వ విప్ పి.గణబాబు, తహసీల్దార్ పాల్గొనున్నారు.

రాష్ట్ర స్థాయి కౌశల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) :భారతీయ విజ్ఞాన మండలి, ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ సంయుక్తంగా ఈనెల 6న జిల్లాస్థాయిలో ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన కౌశల్ (ఆర్ఎస్ఎస్ సంస్థ) పోటీల్లో పలువురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని కౌశల్ జిల్లా సమన్వయకర్త పి. నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 29, 30 తేదీల్లో విజయవాడలో రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయన్నారు. క్విజ్‌లో కణితి పాఠశాలకు చెందిన కె. రోహిత్, జీవీఎంసీ కేడీపీఎం పాఠశాలకు చెందిన కె. డానియల్, భీమిలి మునిసిపల్ పాఠశాలకు చెందిన డి. మనోజ్, భీమిలి కేజీబీవీకి చెందిన సోనియా, రేవిడి పాఠశాలకు చెందిన ఎం. అశ్విని, చిట్టివలస పాఠశాలకు చెందిన పి. సాయివర్ధన్ ఎంపికైనట్టు చెప్పారు. పోస్టర్ తయారీలో అడవివరం పాఠశాలకు చెందిన చైత్రవర్షిణి, విశాఖ క్వీన్ మేరీ స్కూల్‌కు చెందిన ఐ. మహిత మధురానగర్‌కు చెందిన పి. చరణ్‌కుమార్, ఎస్. విజయదుర్గ ఎంపికయ్యారన్నారు. రీలు విభాగంలో నడుపూరు పాఠశాలకు చెందిన ఎల్. కౌశిక్, చిట్టివలస విద్యార్థిని బి. కృష్ణహరిణి గెలుపొందారని చెప్పారు.

ముగిసిన దివ్యాంగుల క్రికెట్ పోటీలు

గాజువాక, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జింక్ మైదానంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి దివ్యాంగుల క్రికెట్ పోటీలు బుధవారంతో ముగిశాయి. పోటీల్లో తూర్పుగోదావరి జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విశాఖ, విజయనగరం జట్లు నిలిచా యి. విజేతలకు స్యాపోర్టు సీఐ దాలిబాబు ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, క్రీడల ప్రతినిధులు పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న సీఐ దాలిబాబు



అంబలం పూజలో పాల్గొన్న గురుస్వామి డీవీ అప్పారావు, తదితరులు

వైభవంగా అయ్యప్ప స్వామి అంబలం పూజ

కూర్మన్నపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి దుగ్గపువానిపాలెంలో బుధవారం అయ్యప్ప స్వామి అంబలం పూజను వైభవంగా నిర్వహించారు. గురుస్వామి డీవీ అప్పారావు ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలను చేపట్టారు. అరటి డొప్పలతో ఏర్పాటు చేసిన పద్దెనిమిది మెట్లను దీపాలతో అలంకరించి స్వామికి పూజలు జరిపారు. అయ్యప్ప, భవానీ భక్తులు ఆలపించిన భక్తి గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వందలాది మంది భక్తులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం పలువురు గురుస్వాములను సత్కరించారు. అనంతరం భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు గోవిందరాజులు, నరసింగరావు, గోవిందరాజులు, వెంకటసూరి, అశోకచక్రవర్తి, బి.సన్యాసిరావు, దానప్పలు, తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనకు కృషి చేయాలి: ‘పల్లా’

ఆటోనగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి కల్పించేందుకు ఏపీ టెక్నికల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లు కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆటోనగర్‌లో వాసవీ భవనంలో బుధవారం ఏపీ టెక్నికల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పదో తరగతి కనీస విద్యార్హతతో శ్రమించే స్వభావం కలిగిన యువతను ఉపాధి బాట పట్టించేందుకు ఇనిస్టిట్యూట్‌లు తమవంతు సహకారాన్ని అందిస్తున్నాయన్నారు. వెల్డింగ్ ఇనిస్టిట్యూట్స్ ఓనర్స్ అసోషియేషన్ పర్యవేక్షణలో అనేక ఇనిస్టిట్యూట్‌లు ఎంతోమందికి ఆరు నెలల పాటు శిక్షణ ఇచ్చి సింగపూర్, మలేషియా, దుబాయ్, ఖతర్, కువైట్, సౌతాఫ్రికా, ఆస్ట్రేలియా దేశాల సంస్థలతో ఉద్యోగాలకు పంపిస్తున్నాయన్నారు. యువతకు ఉపాధి కల్పనకు యత్నిస్తున్న అసోసియేషన్‌కు స్థలం కేటాయిస్తామని పల్లా హామీ ఇచ్చారు. అసోసియేషన్ అధ్యక్షుడు కరణం కనకారావు మాట్లాడుతూ క్రమశిక్షణ, ఉద్యోగ భద్రత, నాణ్యమైన సాంకేతిక విద్యను నేర్పిస్తారనే విశ్వాసాన్ని ఆటోనగర్ వెల్డింగ్ ఇనిస్టిట్యూట్‌లు సొంతం చేసుకున్నాయన్నారు. అనంతరం గౌరవ అధ్యక్షునిగా పల్లా శ్రీనివాసరావును ఎన్నుకుని అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు బొండా అచ్చిబాబు, శ్రీహరి, పాపారావు, వెంకటరమణ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పూర్తి స్థాయి ఉక్కు ఉత్పత్తితో ప్రగతి సాధ్యం

ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో పూర్తి స్థాయి ఉత్పత్తితో ప్రగతి సాధ్యమని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. ప్లాంట్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఎఫ్ విభాగంలో పూర్తి స్థాయి ఉత్పత్తి జరగాలని, అందుకు తగ్గ వనరులను సమకూర్చేందుకు యాజమాన్యం పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. ప్లాంటులో అధిక ఉత్పత్తి తీసేందుకు ఉద్యోగులు సిద్ధంగా ఉన్నందున యాజమాన్యం సహకారం అవసరమన్నారు. ఉక్కు కర్మాగారంలో ఉద్యోగులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, ఆయా విభాగాల్లో కార్మికుల సంఖ్య తక్కువగా ఉందని, నిర్వాసితులకు పూర్తి స్థాయిలో ఉపాధి కల్పించాలన్నారు. సమావేశంలో యూనియన్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, గొందేశి ప్రభాకరరెడ్డి, కొమ్ము ప్రసాద్, మొల్లి ఈశ్వరరావు, ఎస్పే నాయుడు, డి.మోహన్, ఎన్.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి రాజీ లేని పోరు

కార్మికుల సమస్యల పరిష్కారానికి యూనియన్ రాజీ లేని పోరాటాలు చేస్తుందని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి జి.గణపతిరెడ్డి అన్నారు. స్టీల్‌ప్లాంటులో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంతో కష్టపడి విధులు నిర్వహిస్తున్న కార్మికుల సంక్షేమానికి యాజమాన్యం మరిన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికుల సంక్షేమానికే తాము తొలి ప్రాధాన్యం ఇస్తామన్నారు. విధి నిర్వహణలో కార్మికులంతా అప్రమత్తంగా ఉండాలని, ఉత్పత్తిని మరింత పెంచేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు దొమ్మేటి అప్పారావు, నాయకులు అమ్మోరు, కోన రమణ, సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.



గుంతలు పడి బురదమయంగా మారిన రోడ్డు

పైప్‌లైన్ లీక్‌తో రాకపోకలకు అవస్థలు

గోపాలపట్నం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : భూగర్భ పైప్‌లైన్ లీకేజీతో రహదారి ధ్వంసమై ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగర పరిధిలోని 89వ వార్డు ఎల్లపువానిపాలెం జెడ్పీ హైస్కూల్ సమీపంలో ఎంఈఎస్ (మిలటరీ ఇంజనీరింగ్ సర్వీస్)కు చెందిన భూగర్భ తాగునీటి పైప్‌లైన్ నెల రోజులుగా లీకవుతోంది. దీనికి మరమ్మతులు చేపట్టకపోవడంతో నీరు చేరిన చోట రహదారి గుంతలుగా మారింది. దీనివల్ల ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రామ ధనస్సును సందర్శించిన భక్తులు



రామ ధనస్సుకు పూజలు చేస్తున్న భక్తులు

పెందుర్తి రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతల అగ్రహారం రామాలయంలో ఉం చిన అయోధ్య రామ ధనస్సును భక్తులు బుధవారం అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆల య కమిటీ సభ్యులు ధనస్సును పలు రకాల పుష్పాలతో అలంకరించి, రామాయణ కీర్తనలు ఆలపించారు. అంతకుముందు గీతాకృష్ణ మందిరంలో ఆలయ ధర్మకర్త ఆళ్ల తాతారావు ఆధ్వర్యంలో నిర్వహించిన గీతా జ యంతి వేడుకలు సందర్భంగా ఏకాహం చేశారు. శ్రీకృష్ణ మూల విరాట్ విగ్రహానికి క్షీరాభిషేకం జరిపారు.

ఘనంగా గీతా జయంతి

వేపగుంట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : భరత్‌నగర్ సమీపంలోని లక్ష్మీనరసింహనగర్‌లో కొలువైన శ్రీ గోపీజనవల్లభస్వామి ఆలయంలో గీతా జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ముం దుగా పాలాభిషేకం, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం శాంతి గీతా సేవా సంఘం ఆధ్వర్యలో శాంతి యజ్ఞం, భగవద్గీతలోని 18 అధ్యాయనాలను పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెందుర్తి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 97వ వార్డు చిన ముషిడివాడ వుడా కాలనీలో రూ. 20 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న తారు రోడ్డు పనులకు కార్పొరేట్ సేనాపతి వసంత శంకర్రావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అవగడ్డ అప్పలనాయుడు, కిశోర్ చౌదరి, రమణ, వెంకటరావు, విశ్వనాథం, కేశవ, తదితరులు పాల్గొన్నారు.

చేనేత మేళా ప్రారంభం రేపు

మధురవాడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మధురవాడ శిల్పారామంలో శుక్రవారం చేనేత మేళాను ప్రారంభించనున్నామని ముఖ్య కార్యనిర్వహణాధికారి వి.స్వామినాయుడు తెలిపారు. ఉదయం 11 గంటలకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభిస్తారని, చేనేత కళాకారులను ప్రోత్సహించేందుకు వీలుగా 26 వరకు ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 60 మంది కళాకారులు స్టాల్స్ ఏర్పాటు చేస్తారన్నారు.

2 నుంచి పలు రైళ్లు రద్దు

విశాఖపట్నం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సంబల్‌పూర్ డివిజన్‌లో ఆధునికీకరణ పనులు చేపట్టనున్నందున జనవరి 2 నుంచి పలు రైళ్లను తాత్కాలికంగా రద్దుచేస్తున్నామని వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. జనవరి 2 నుంచి 8 వరకు విశాఖ-రాయపూర్ ప్రత్యేక పాసింజర్, 3 నుంచి 9 వరకు రాయపూర్-విశాఖ, విశాఖ-భవానీపట్న, 4 నుంచి 9 వరకు భవానీపట్న-విశాఖ ప్రత్యేక పాసింజర్ రద్దు చేశారు. జనవరి 3 నుంచి 8 వరకు విశాఖ-దుర్గ్, దుర్గ్-విశాఖ రైళ్లను రద్దు చేశారు. భువనేశ్వర్-జునాగర్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైళ్లు జనవరి 3 నుంచి 8 వరకు భువనేశ్వర్-రాయగడ మధ్య రాకపోకలు సాగించేలా గమ్యాలను కుదించారు.

14న బెంగళూరు నుంచి హౌరాకు ప్రత్యేక రైలు

విశాఖపట్నం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 14న దువ్వాడ మీదుగా బెంగళూరు నుంచి హౌరాకు (ఒకవైపు మాత్రమే) ప్రత్యేక రైలు నడుపుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ రైలు 14న ఉదయం 10.15 గంటలకు బెంగళూరులో బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 4.03 గంటలకు దువ్వాడ, 5.35 గంటలకు విజయనగరం, రాత్రి 9.45 గంటలకు హౌరా చేరుతుంది.

వినూత్న ఆలోచనలకు బాసట

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

వినూత్న ఆలోచనలు, సరికొత్త ఆవిష్కర్తలకు ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఇంటిలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ విభాగం అండగా నిలుస్తోంది. విభిన్న ఆలోచనలతో వచ్చే వారికి సహకరించడంతో పాటు ఆవిష్కరణలకు పేటెంట్స్ (హక్కులు) కల్పించేందుకు కృషి చేస్తోంది. కొత్త ఆలోచనలకు పేటెంట్స్ తీసుకోవడంలో భారతీయులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఇంటిలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ (ఐపీఆర్) సెంటర్లను ఏర్పాటుచేసింది. ఇందులో భాగంగానే 2020లో ఏయూలో ఏర్పాటైన ఈ సెంటర్‌లో మేధోహక్కుల కోసం ఇప్పటివరకు 450 మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో 154 మందికి హక్కులు దక్కేలా ఈ సెంటర్ సహాయ, సహకారాలను అందించింది. మరో 200 దరఖాస్తులు ప్రాసెస్‌లో ఉన్నాయి.

నూతన ఆవిష్కరణలకు అండగా ఏయూ ఐపీఆర్

- పేటెంట్ హక్కులు కల్పించేందుకు సహకారం
- ఇప్పటివరకు 450కి పైగా దరఖాస్తులు
- 154 ఆవిష్కరణలకు దక్కిన పేటెంట్స్
- దరఖాస్తు, గైడెన్స్, మార్కెటింగ్ వరకు అండగా..



విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాలకు చెందిన ఫ్యాకల్టీ, పరిశోధకులు, పరిశోధక విద్యార్థులు, పీజీ, డిగ్రీ విద్యార్థులు ఈ హక్కులకు దరఖాస్తు చేసిన వారిలో ఉన్నారు. వర్సిటీలోని 13 విభాగాలకు చెందిన ఆవిష్కరణలకు పేటెంట్స్ దక్కాయి. ఇందులో కంప్యూటర్ సైన్స్‌అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్‌లో 31, సివిల్ ఇంజనీరింగ్‌లో 30, జువాలజీ 19, కెమికల్ ఇంజనీరింగ్ 16, కెమిస్ట్రీ 13, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ 10, ఈసీఈ 9, మెకానికల్ ఇంజనీరింగ్ ఏడు, బయో కెమిస్ట్రీ/బయో టెక్ ఏడు, ఫార్మసీ ఐదు, ఇన్‌స్ట్రుమెంట్ టెక్ మూడు, జియో ఇంజనీరింగ్ మూడు, సైకాలజీ విభాగానికి చెందిన ఆవిష్కరణకు పేటెంట్ దక్కింది.

హక్కులు దక్కేలా కృషి..

ప్రపంచవ్యాప్తంగా భిన్న ఆలోచనలతో చేసే ఆవిష్కరణలకు పేటెంట్స్ కల్పిస్తుంటారు. ఆవిష్కరణలపై వారికి 20 ఏళ్ల పాటు హక్కులుంటాయి. అటువంటి ఆలోచనలను ఉత్పత్తిగా చేసి మార్కెట్‌లోకి తీసుకురావాలంటే తప్పనిసరిగా ఆవిష్కర్తల అనుమతి ఉండాలి. ఇందుకోసం సదరు ఉత్పత్తికి ముందుకువచ్చే సంస్థలు, కంపెనీలు ఆవిష్కర్తలకు భారీమొత్తంలో రాయల్టీని అందిస్తాయి. మన దేశంలో ఇటువంటి ఆలోచనలతో భిన్న ఆవిష్కరణలు చేసే ఎంతోమంది ఉన్నారు. కానీ ఆ ఆలోచనలకు పేటెంట్స్ తీసుకోవడంలో అవగాహన లేకపోవడంతో ఇబ్బంది ఎదురవుతోంది. దీంతో ఇతర దేశాలకు చెందిన వారు ఇదే తరహా ఆలోచనలతో ఆవిష్కరణలు చేసి పేటెంట్స్ పొందుతున్నారు. దీనివల్ల ఎంతోమంది ఆవిష్కరణలపై హక్కులను కోల్పోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఇటువంటి ఇబ్బందులకు చెక్ చెప్పాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టింది. కామర్స్ అండ్ ఇండస్ట్రీ మంత్రిత్వశాఖ ఇందుకోసం ప్రత్యేకంగా స్పృహ పేరుతో సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమంపై విస్తృత అవగాహన కల్పించడంతో పాటు దరఖాస్తు, ఇతర సహకారం అందించేందుకు అనేకచోట్ల సెంటర్ ఫర్ ఇంటిలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ (సీఐపీఆర్)ను ఏర్పాటుచేసింది. కేంద్ర మంత్రిత్వశాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్రమోషన్ ఫర్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ విభాగం స్పృహ అమలు బాధ్యతను చూస్తోంది. వర్సిటీలోని సీఐపీఆర్ నాలుగేళ్లుగా పనిచేస్తోంది.



ఐపీఆర్ కార్యాలయం

ఇదీ సహకారం..

భిన్న ఆవిష్కరణలు చేసేవారికి సీఐపీఆర్ సహకారాన్ని అందిస్తుంది. విద్యార్థులు, ఫ్యాకల్టీ, పరిశోధకులకు అవగాహన కల్పించడంతో పాటు ఆలోచనకు హక్కులు పొందడంపై అవగాహన కల్పిస్తారు. భిన్న ఆలోచనతో వచ్చే విద్యార్థికి.. అదే ఆలోచనతో కూడిన ఆవిష్కరణ ఎక్కడైనా ఉందా..? ఉంటే దానికి హక్కు దక్కిందా..? అన్న అంశాలను డేటాబేస్‌లో వెతికి తెలియజేస్తారు. అటువంటి ఆలోచన లేదని నిర్ధారణ అయిన తరువాత న్యాయపరంగా ముందుకు వెళ్లే ప్రక్రియను వివరిస్తారు. అంటే హక్కులు దక్కించుకునేందుకు అనుగుణంగా సదరు ఆలోచనకు సంబంధించి పేటెంట్, కాపీరైట్, ట్రేడ్‌మార్క్‌ను ఫైలింగ్ చేస్తారు. ఈ ప్రక్రియను కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే పేటెంట్ ఆఫీస్ (ఆఫీస్ ఆఫ్ ద కంట్రోల్ జనరల్ ఆఫ్ పేటెంట్స్, డిజైన్స్ అండ్ ట్రేడ్‌మార్క్స్) నిర్వహిస్తుంది.

మేధోహక్కులతో ఆలోచనలకు రక్షణ

భిన్న ఆవిష్కరణలు చేసే వారికి మేధోహక్కులను పొందడం ద్వారా రక్షణ లభిస్తుంది. దేశంలో విభిన్న సమస్యలకు పరిష్కారమార్గాలను చూపించే ఆవిష్కరణలకు హక్కులు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటికి చెక్ చెప్పేందుకు కేంద్రం ఐపీఆర్ సెంటర్లను ఏర్పాటు చేసింది. ఏయూలోని సెంటర్ ద్వారా నాలుగేళ్లలో ఎన్నో ఆవిష్కరణలకు హక్కులు లభించేలా చేశాం. ఆవిష్కరణపై హక్కులతో పాటు ఆ ఉత్పత్తి మార్కెట్‌లోకి వెళితే ఆదాయం కూడా వస్తుంది. ఈ ఆలోచనకు ప్రపంచమే గుర్తింపు ఇచ్చినట్టు అవుతుంది.

- ప్రొఫెసర్ ఈఎస్ ధనుంజయరావు, చైర్ ప్రొఫెసర్ సీఐపీఆర్

సెంటర్ ఆధ్వర్యంలోనే దరఖాస్తు ప్రక్రియ

సాధారణంగా మేధో హక్కుల కోసం దరఖాస్తు చేయడానికి రూ.50 వేల వరకు ఖర్చవుతుంది. ఏయూలో ఏర్పాటుచేసిన ఈ సెంటర్ వల్ల ఒక్కరూపాయి కూడా ఖర్చు కాదు. ఇప్పటివరకు వందలాది దరఖాస్తులు వచ్చాయి. కొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. 154 ఆలోచనలకు హక్కులు దక్కాయి. ఆలోచనలకు ఇతర దేశాలకు అందించడంతో పాటు వారి నుంచి తీసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నాం. భిన్న ఆలోచనలు నచ్చి విదేశాల్లోనివారు పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపిస్తే ఈ ఆలోచనలను ఎగుమతి చేస్తాం. ఇక్కడ ఎవరైనా విదేశాల్లోని ఆలోచన నచ్చి వాటిపై పెట్టుబడిపెట్టి ఉత్పత్తి తయారీకి ముందుకువస్తే దిగుమతి చేసుకుంటాం. ఆవిష్కరణకు సంబంధించిన ఉత్పత్తి తయారీకి సహకరిస్తాం.

- ప్రొఫెసర్ ఎల్లపు రాంబాబు, డైరెక్టర్, సీఐపీఆర్

భగవద్గీతలోని సారాంశాన్ని గ్రహించాలి

గీతా జయంతి ఉత్సవంలో త్రిదండి చిన జీయర్‌స్వామి

సిరిపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత సారాంశాన్ని తెలుసుకోవాలని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి పేర్కొన్నారు. గురజాడ కళాక్షేత్రంలో ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ సారథ్యంలో బుధవారం గీతా జయంతి ఉత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చిన జీయర్ జ్యోతి ప్రజ్వలన చేసి, భక్తులనుద్దేశించి ప్రసంగిస్తూ భగవద్గీతలోని శ్లోకాలు, అక్షరాలు శక్తివంతమైనవన్నారు. గమ్యం తెలియని జీవితానికి చక్కని పరిష్కార మార్గాన్ని చూపి.. భక్తి, మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక చైతన్యాన్ని కలిగిస్తుందన్నారు. యువత వ్యసనాల బారిన పడకుండా ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తూ భగవద్గీతను అనుసరించాలన్నారు. ఇస్కాన్ విశ్వస్థాయి ప్రతినిధులు గురుప్రసాద్ స్వామి మహారాజ్, భీమా ప్రభు, ఇస్కాన్ విశాఖ శాఖ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయ్ సేవిని ప్రసంగించారు. అనంతరం విద్యార్థులకు చినజీయర్ భగవద్గీత పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో సింహాచలం ఈవో వేంద్ర త్రినాథరావు, ఎంవీ రాజశేఖర్, వంశీప్రభు, స్వరూప్ ప్రభు, భక్తులు పాల్గొన్నారు. అంతకుముందు వివిధ ఆధ్యాత్మిక సంస్థలతో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, గీతాపారాయణం, గీతా యజ్ఞం, గీతా హోమం పూర్ణాహుతి నిర్వహించారు.



గీతాజయంత్రి ఉత్సవంలో అనుగ్రహ భాషణ చేస్తున్న చిన జీయర్‌స్వామి

షిప్‌యార్డ్ కాలనీలో ఇరువర్గాల మధ్య కొట్లాట

వేపగుంట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాటలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన షిప్‌యార్డ్‌కాలనీలో బుధవారం జరిగింది. పోలీసులు, స్థానికుల సమాచారం మేరకు కాలనీకి చెందిన బిల్డర్ డీవీ మహేశ్, మరో బిల్డర్ రమణయ్య మధ్య కొన్నేళ్లుగా వివాదం నడుస్తోంది. దీనిపై కోర్టుల్లో కేసుండగా భవన నిర్మాణం చేపడుతున్నారని మహేశ్ వర్గీయులు భవనం వద్ద కోర్టు ఉత్తర్వుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీనిపై బిల్డర్ రమణయ్య వర్గీయులు అభ్యంతరం తెలిపారు. దీంతో వాగ్వాదం జరిగి కొట్లాటకు దారితీసింది. ఇందులో ఇద్దరికి గాయాలయ్యాయి. ఒకరి తలకు పది కుట్లు పడినట్టు సమాచారం. పెందుర్తి పోలీసులు ఇరువర్గాలను స్టేషన్‌కు పిలిపించి, వీడియో ఫుటేజ్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తామని సీఐ సతీశ్‌కుమార్ పేర్కొన్నారు.


కాలనీలో కొట్లాట జరుగుతున్న దృశ్యం

చోరీ కేసులో నలుగురి అరెస్టు

విజయవాడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులను ఏమార్చి చోరీ చేస్తున్న నలుగురిని కృష్ణలంక పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారి నుంచి 1.5 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. గోపాలపట్నానికి చెందిన బుర్రి సురేష్ అలియాస్ ఒలుసు, అరిటాకుల తారకేశ్వరరావు, కైలాసపురానికి చెందిన తంబాల శ్రీను, కొబ్బరితోటకు చెందిన బుడుమూరి రాజు అలియాస్ ఆకాష్ పాత స్నేహితులు. పలు చోరీ కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చిన వారు. రద్దీ ప్రదేశాల్లో దొంగతనాలు చేస్తుంటారు. ఎవరి వద్ద ఎక్కువ డబ్బులున్నాయో రెక్కీ చేసి, ముందుగా ఒకడు డబ్బున్న వ్యక్తి వద్దకు వెళ్లి జేబులోని నగదును దొంగిలించే సమయంలో మిగిలిన వారు పట్టుకుని, అక్కడ తోపులాట జరుగుతున్నట్టుగా క్రియేట్ చేస్తారు. ఇదే అదనుగా డబ్బు నొక్కేస్తారు. ఈనెల 6న చల్లపల్లికి చెందిన వ్యక్తి ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న సమయంలో అతడి జేబులో నుంచి డబ్బులు కాజేసి పరారయ్యారు. బాధితుడు కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ జరిపిన సీఐ ఎస్ఎస్‌వీ నాగరాజు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. పద్మావతి ఘాట్ వద్ద అనుమానంగా సంచరిస్తున్న వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా నిజం బయటపడింది.

సెంట్రల్ పార్కులో మ్యూజికల్ ఫౌంటెన్

వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

డాబాగార్డెన్స్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విశాఖ సెంట్రల్ పార్కులో మ్యూజికల్ ఫౌంటెన్‌ను త్వరలో సందర్శకులకు అందుబాటులోకి తీసుకువస్తామని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. సిటీ సెంట్రల్ పార్కును బుధవారం వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌తో కలిసి సందర్శించారు. దీవీస్ సీఎస్సార్ నిధులతో ఏర్పాటు చేసిన రక్షిత నీటి ప్లాంట్‌ను ప్రారంభించారు. పార్కులో ఉన్న వాకర్స్‌తో మాట్లాడి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. పార్కులోని చాలా ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. చిన్నారుల కోసం మరిన్ని క్రీడా పరికరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఓపెన్ జిమ్ పరికరాలకు మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ భవానీశంకర్, ఎస్‌వీఎస్ఎన్ రాజు, డీఎఫ్‌ఓ శివానీ, శంకరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, ఎమ్మెల్యే వంశీకృష్ణ

విశాఖ పోర్టులో వెస్ట్ క్యూ-6 టెర్మినల్ ఆధునికీకరణ

ఇంటిగ్రేటెడ్ కార్గో టెర్మినల్ కంపెనీతో ఒప్పందం


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న అధికారులు

విశాఖపట్నం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టులో వెస్ట్ క్యూ-6 టెర్మినల్ ఆధునికీకరణ, డ్రై బల్క్ కార్గో నిర్వహణకు ఇంటిగ్రేటెడ్ కార్గో టెర్మినల్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీతో బుధవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. బెర్త్‌ను 255 మీటర్ల పొడవు, 14 మీటర్ల లోతుకు పెంచనున్నారు. ఇది పూర్తయితే 230 మీటర్ల పొడవున్న పానామ్యాక్స్ నౌకల రాకపోకలకు వీలవుతుంది. బెర్త్‌పై 1500 టీపీహెచ్ సామర్థ్యం కలిగిన రెండు కొత్త హార్బర్ మొబైల్ క్రేన్లు, రెండు మొబైల్ హోపర్లుసమకూరుస్తారు. దీనికి రూ.165.7 కోట్ల పెట్టుబడి అవసరం. అడ్వాన్స్‌గా రూ.77.2 కోట్లు చెల్లించారు. ఈ టెర్మినల్ ద్వారా ఏడాదికి 51.8 లక్షల టన్నుల కార్గోను హ్యాండిల్ చేయవచ్చు. ప్రాజెక్టును 18 నెలల్లో పూర్తి చేయాలనేది నిబంధన. దీని ద్వారా 100 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుదని పోర్టు సెక్రటరీ వేణుగోపాల్ తెలిపారు.

14న సాగునీటి సంఘాలకు ఎన్నికలు

జిల్లాలో 29 సంఘాలు: 18,834 మంది ఓటర్లు

విశాఖపట్నం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 29 సాగునీటి సంఘాలకు ఈనెల 14న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం నోటిఫికేషన్ విడుదలైంది. ప్రతి సంఘం పరిధిలో ఆరుగురు ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యులు ఉంటారు.ఈ లెక్కన జిల్లాలో 174 సభ్యులకు ఎన్నికలు జరుగుతాయి. మొత్తం ఓటర్లు 18,834మంది. అన్ని సంఘాలు చిన్ననీటిపారుదల విభాగం పరిధిలోకి వస్తాయి. ఎన్నికల రోజు ఉదయం ఓటర్లను సమావేశపరిచి ఏకాభిప్రాయంతో నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఓటింగ్ కోరితే చేతులెత్తే ప్రక్రియ ద్వారా ఎన్నికలు ముగిస్తారు. దానికి అభ్యంతరం తెలిపితే రహస్య బ్యాలెట్ అమలుచేస్తారు. ఇందులో భాగంగా 29మంది ఎన్నికల అధికారులు, 29 మంది సహాయ ఎన్నికల అధికారులు, 58 మంది సహాయకులకు శిక్షణ ఇచ్చారు. తొలుత ప్రతి సంఘానికి ఆరుగురు ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులను ఎన్నుకోవాలి. వారిలో ఒకర్ని అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా అదే రోజు ఎన్నుకుంటారు. ఎన్నికల నిర్వహణ సజావుగా సాగేలా ఏర్పాట్లు పూర్తిచేశామని నోడల్ అధికారి జె.స్వామినాయుడు తెలిపారు.

స్టార్టప్ నిర్వాహకులకు రూ.6 లక్షల ప్రోత్సాహకాలు

వెంకోజీపాలెం, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): స్టార్టప్ సంస్థలను ప్రోత్సహించేందుకు ఆ-హబ్ (ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్), ఈపీడీసీఎల్ సంయుక్తంగా నిర్వహించిన 'హక్ ఏపీ హ్యాకథాన్'లో పాల్గొని సృజనాత్మక ఆలోచనలను ఆవిష్కరించిన ఏడు బృందాలకు రూ.6 లక్షల బహుమతులను ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి అందించారు. ఏయూ వేదికగా బుధవారం జరిగిన 13వ ఎడిషన్ 'హక్ ఏపీ హ్యాకథాన్' కార్యక్రమంలో స్టార్టప్ సంస్థలతో పాటు విద్యార్థులు, నిపుణులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో సహా 72 బృందాలు పాల్గొని విద్యుత్ పంపిణీ వ్యవస్థలోని సమస్యలకు పరిష్కార మార్గాలను ప్రదర్శించారు. దీనివల్ల సంస్థ సుమారు రూ.2 కోట్లను ఆదా చేయగలుగుతుంది. స్టార్టప్ ఆలోచనలు సంస్థకు దోహదపడతాయని సీఎండీ అన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.విశ్వనాథన్ మాట్లాడుతూ విద్యా, పారిశ్రామిక రంగాలను అనుసంధానించే దిశగా ఇటువంటి హ్యాక్‌థాన్ల నిర్వహణ అవసరమన్నారు. తమ సంస్థలోని సమస్యల పరిష్కారం కోసం హ్యాక్‌థాన్‌ను నిర్వహించేందుకు ఆ-హబ్‌ను స్వాగతిస్తున్నామన్నారు. ఈపీడీసీఎల్ డైరెక్టర్లు వి.విజయలలిత, బి.రామచంద్ర ప్రసాద్, సీజీఎం డి.సుమన్‌కల్యాణి, ఆ-హబ్ సీఈవో రవి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


బహుమతులను అందజేస్తున్న ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి విస్తృత ఏర్పాట్లు

జగదాంబ కూడలి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మార్గశిర రెండో గురువారం సందర్భంగా కనక మహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రధాన ఆలయం నుంచి టౌన్ కొత్తరోడ్డు వరకు ఉచిత దర్శనాలతో పాటు టికెట్ దర్శనాల క్యూలైన్లు సిద్ధమయ్యాయి. రీడింగ్ రూమ్ నుంచి ఎవరికీ ప్రవేశం లేకుండా పోలీసులు ఆంక్షలు విధించారు. వీవీఐపీ, వీఐపీ దర్శనాల కోసం విక్టోరియా ఆస్పత్రి నుంచి క్యూలైన్లు ఏర్పాటు చేశారు. దర్శనం కోసం ఈవో కె.శోభారాణిపై రాజకీయ ఒత్తిళ్లు పెరిగాయి. ఎమ్మెల్యేల వ్యక్తిగత సహాయకులు ఫోన్లలో ఒత్తిడి చేస్తున్నట్టు సమాచారం. వీఐపీ దర్శనాలకు రూ.100 రుసుము నిర్ణయించారు. రాజకీయ నాయకులు, ప్రతినిధులు దీనిని వ్యతిరేకిస్తున్నట్టు తెలిసింది.



భక్తుల దర్శనాలకు సిద్ధమైన క్యూలైన్లు

పోలీసుల కనుసన్నల్లోనే...

ఆలయంలోకి ప్రవేశించే అన్ని మార్గాల తాళం చెవులు పోలీసులకు ఇవ్వాలని సీపీ గతంలోనే ఆదేశించారు. ఈ మేరకు ఆలయ ప్రధాన ద్వారం తాళం చెవి కోసం బుధవారం పోలీసులు ఈవోపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. కాగా జగన్నాథస్వామి గుడి వద్ద కల్యాణమండపంలో ఉచిత భోజనాలు ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు.

బియ్యం నుంచి నమూనాల సేకరణ: జేసీ

విశాఖపట్నం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విశాఖ పోర్టు నుంచి విదేశాలకు బియ్యం ఎగుమతి చేస్తున్న కాకినాడకు చెందిన మెస్సర్స్ బేబో ఇంటర్నేషనల్ సంస్థ గోదాముల్లో మంగళ, బుధవారాల్లో పౌరసరఫరాలశాఖ అధికారులు తనిఖీ చేశారు. మొత్తం ఎనిమిది ట్రక్కుల్లో వచ్చిన 240 టన్నుల బియ్యం నుంచి శాంపిల్స్ తీసుకుని పౌరసరఫరాల సంస్థ ప్రయోగశాలకు పంపారు. ఈ విషయాన్ని జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్ బుధవారం వెల్లడించారు. ఇప్పటికే కంటైనర్ ఫ్రైట్ స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన తనిఖీల్లో 483 టన్నుల రేషన్ బియ్యం సీజ్ చేశామన్నారు. తనిఖీల నేపథ్యంలో పోర్టుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే బియ్యం నిల్వలపై నిఘా ఉంచామన్నారు. శాంపిల్స్‌పై నివేదిక వచ్చిన తరువాత నిర్ణయం తీసుకుంటామన్నారు.

విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణకు తరలిరండి

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

విశాఖపట్నం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియంలో ఈనెల 13న ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరించనున్నారని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి పారిశ్రామికవేత్తలు, రైతులు, సామాజిక కార్యకర్తలు భాగస్థులు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా నుంచి 300 మంది వెళ్లేలా చూడాలన్నారు. వారి కోసం వాహనాలు ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు.